V6 NEWS

www.vishvambhara.com

తెలుగు దినపత్రిక

# విశ్వంభర

అక్షరం సాక్షిగా..

శనివారం
21-12-2024

సంపుటి : 01 | సంచిక : 229 | పేజీలు : 12 | వెల : 5/- తెలంగాణ / ఆంధ్రప్రదేశ్




జమిలి ఎన్నికల జేపీసీ ఛైర్‌పర్సన్‌గా


## బీజేపీ ఎంపీ పీపీ చౌదరి

- ప్రకటించిన లోక్‌సభ సెక్రటేరియట్
- 129వ రాజ్యాంగ సవరణ బిల్లుపై అధ్యయనం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం జేపీసీ ఏర్పాటు
- సభ్యులుగా లోక్‌సభ నుంచి 27 మంది ఎంపీలు, రాజ్యసభ నుంచి 12 మంది



**దిల్లీ:** జమిలి ఎన్నికలపై అధ్యయనానికి ఏర్పాటైన జాయింట్ పార్లమెంటరీ కమిటీకి ఛైర్మన్‌గా బీజేపీ ఎంపీ పీపీ చౌదరి నియమితులయ్యారు. ఈ విషయాన్ని లోక్‌సభ సెక్రటేరియట్ శుక్రవారం ప్రకటించింది. దేశ వ్యాప్తంగా లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలు ఒకేసారి నిర్వహించేందుకు ఉద్దేశించిన 129వ రాజ్యాంగ సవరణ బిల్లుపై అధ్యయనం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం జేపీసీని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఈ కమిటీలో సభ్యుల సంఖ్యను గురువారం 31 నుంచి 39కి పెంచారు. దీని ప్రకారం లోక్‌సభ నుంచి 27 మంది ఎంపీలు, రాజ్యసభ నుంచి 12 మంది చొప్పున ఉంటారు.

## ముగిసిన పార్లమెంట్ శీతాకాల సమావేశాలు



- చివరిరోజు అమిత్ షా వ్యాఖ్యలపై సభలో విపక్ష ఎంపీల నిరసనలు
- ఉభయసభలు నిరవధిక వాయిదా

2



# కేటీఆర్‌పై ఈడీ కేసు

**ఫార్ములా-ఈ కార్ రేస్ వ్యవహారంలో తెలంగాణ ఏసీబీ ఎఫ్ఐఆర్ ఆధారంగా మనీలాండరింగ్ కింద కేసు నమోదు**

ఫార్ములా-ఈ కార్ రేస్ వ్యవహారంలో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ అంశంపై ఏసీబీ నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈడీ అధికారులు ఈసీఐఆర్ నమోదు చేశారు. మనీలాండరింగ్ నిరోధక చట్టం ప్రకారం మాజీ మంత్రి కేటీఆర్, అప్పటి పురపాలక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్ కుమార్, అప్పటి హెచ్ఎండీఏ చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డిపై ఈడీ కేసు నమోదు చేసింది.

## వెల్లడించిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్

- ఈవ్యవహారంలోనే ఏసీబీ నమోదు చేసిన కేసుపై కేటీఆర్ క్వాష్ పిటిషన్
- ఇరు వైపులా వాదనలు విన్న ధర్మాసనం..
- ఈనెల 30వరకు అరెస్టు చేయొద్దని హైకోర్టు ఆదేశాలు



**విశ్వంభర, హైదరాబాద్:**

మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై మరో కేసు నమోదైంది. తాజాగా కేటీఆర్‌పై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ (ఈడీ) కేసు నమోదు చేసింది. ఫార్ములా ఈకార్ రేసు కేసులో హైకోర్టులో కేటీఆర్‌కు కాస్త ఊరట లభించినప్పటికీ, తాజాగా మనీలాండరింగ్ కింద కేసు నమోదు చేసింది ఈడీ. ఏ1గా కేటీఆర్ పేరు చేర్చిన ఈడీ, మిగతా2లో...



11

## వరుసగా ఐదోరోజూ నష్టాల్లో స్టాక్ మార్కెట్లు

ఒక్క సెషన్‌లో ₹9 లక్షల కోట్లు ఉఫ్!

## బీఆర్ఎస్ సభ్యులు వక్రబుద్ధితో వ్యవహరిస్తున్నారు

- భూ భారతి బిల్లును ఆమోదించకుండా అడ్డుకునే ప్రయత్నం
- సభలో గూండాగిరి, దౌర్జన్యం, రౌడీయిజం లేకుండా స్పీకర్ చర్యలు చేపట్టాలి: మంత్రి పొంగులేటి

2

మరిన్ని తాజా వార్తల కోసం **స్కాన్** చేయండి

# తెలంగాణలో ప్రతి సమస్య భూమితోనే ముడిపడి ఉంది

- గత ప్రభుత్వం తెచ్చిన 'ధరణి' రైతులను తమ భూములకు దూరం చేసింది
- విపక్ష పార్టీ అహంకారంతో వ్యవహరిస్తోంది
- చర్చ పక్కదోవపట్టకుండా సహనంతో వ్యవహరించిన స్పీకర్‌కు అభినందనలు: సీఎం రేవంత్‌రెడ్డి

భూభారతి బిల్లుకు శాసనసభ ఆమోదం



**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణలో ప్రతి సమస్య భూమితోనే ముడిపడి ఉందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. 'భూ భారతి' బిల్లుపై చర్చలో భాగంగా రేవంత్‌రెడ్డి మాట్లాడారు. ''తెలంగాణలో ప్రజల ఆత్మగౌరవం నిలబెట్టేది భూమి. భూమిని కాపాడుకునే ప్రయత్నంలో దొడ్డి కొమరయ్య వంటి వారు ప్రాణాలు కోల్పోయారు. రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, మల్లు స్వరాజ్యం లాంటి అనేక మంది భూ పోరాటాలు చేశారు. పేదల భూములు కాపాడేందుకు పటేల్, పట్వారీ వ్యవస్థను రద్దు చేశారు. భూమిలేని పేదలకు ఇందిరాగాంధీ ప్రభుత్వ భూమి ఇచ్చి మిగతా2లో...

## దేశ అభివృద్ధిలో గ్రోత్ ఇంజిన్ తెలంగాణ

- రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలి
- ప్రత్యేక అవసరాలను గుర్తించి కేంద్రం ప్రోత్సాహం అందించాలి
- స్థానిక పరిస్థితులకు తగ్గట్లుగా కేంద్ర పథకాలు ఉపయోగించుకునే వెసులుబాటు ఉండాలి
- విభజన చట్టం ప్రకారంరావాల్సిన రూ.1800 కోట్ల పెండింగ్ గ్రాంట్లు విడుదల చేయాలి
- వెనకబడిన ప్రాంతాల అభివృద్ధికి ఏడాదికి రూ.450 కోట్ల నిధులు మరో ఐదేళ్ల పాటు పొడిగించాలి
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



2

## ముగ్గురి దారుణ హత్యకేసులో నిందితుడికి మరణ శిక్ష

- సహకరించిన స్నేహితుడికి యావజ్జీవ కారాగారశిక్ష
- నాంపల్లి కోర్టు సంచలన తీర్పు
- వివాహేతర సంబంధం కారణంతో హత్య
- భార్య, ఆమె ప్రియుడిని పెట్రోల్ పోసి నిప్పంటించిన సాయిలు
- ఈఘటనలో పదినెలల చిన్నారి సైతం మృతి

2






## రాహుల్ గాంధీపై కేసు

- ఢిల్లీ క్రైమ్ బ్రాంచ్‌కి బదిలీ
- తోపులాటలో బీజేపీ ఎంపీల గాయాలకు రాహులే బాధ్యుడని ఆరోపణ
- హత్యాయత్నం సహా పలు సెక్షన్ల కింద ఆయనపై కేసు నమోదు

**దిల్లీ:** పార్లమెంట్ ప్రాంగణంలో గురువారం జరిగిన తోపులాట ఘటనకు సంబంధించి ప్రతిపక్ష నేత రాహుల్‌పై నమోదైన కేసు దిల్లీ క్రైమ్ బ్రాంచ్‌కి బదిలీ అయ్యింది. బీజేపీ ఎంపీల ఫిర్యాదు మేరకు పోలీసులు ఆయనపై కేసు నమోదు మిగతా2లో...

## హర్యానా మాజీ సీఎం కన్నుమూత



- ఐదు సార్లు ముఖ్యమంత్రిగా చేసిన ఓం ప్రకాష్ చౌతాలా
- 87 ఏళ్ల వయస్సులో అత్యంత వృద్ధ ఖైదీగా తీహార్ జైలులో గడిపిన చౌతాలా

2

### నేటి చికెన్ ధరలు

| ఫామ్ ధర | రిటైల్ |
|---|---|
| ₹ 91 | ₹ 113 |
| స్కిన్ | స్కిన్ లెస్ |
| ₹ 164 | ₹ 186 |



# కేటీఆర్‌పై ఈడీ కేసు

(మొదటి పేజీ తరువాయి)

ఏ2గా అప్పటి మున్సిపల్ ముఖ్య కార్యదర్శి అరవింద్ కుమార్, ఏ3గా హెచ్ఎండీఏ అధికారి బీఎల్ఎన్ రెడ్డిపై కేసులు నమోదు చేసింది. తెలంగాణ ఏసీబీ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసినట్లు ఈడీ పేర్కొంది. ఈ మేరకు ఇప్పటికే తెలంగాణ ఏసీబీకి లేఖ రాశారు ఈడీ అధికారులు. కేటీఆర్‌పై నమోదైన కేసు వివరాలు ఇవ్వాలని కోరారు. ఎఫ్ఐఆర్ కాపీతోపాటు హెచ్ఎండీఏ అకౌంట్ నుంచి ఎంత మొత్తం బదిలీ చేశారో వంటి వివరాలు ఇవ్వాలంటూ ఈడీ కోరింది. ప్రస్తుతహెచ్ఎండీఏ కమిషనర్ దాన కిశోర్ ఫిర్యాదు కాపీ కూడా పంపాలని ఈడీ కోరింది. ఏయే తేదీల్లో లావాదేవీలు జరిగాయో ఆ వివరాలు కూడా చెప్పాలని ఈ లేఖలో ఈడీ కోరింది. ఈ క్రమంలో ఈడీ కేసు నమోదు చేసింది. ఫార్ములా-ఈ కార్ రేస్ వ్యవహారంలో తెలంగాణ ఏసీబీ తనపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను క్వాష్ చేయాలని కేటీఆర్ దాఖలు చేసిన లంచ్ మోషన్ పిటిషన్‌పై విచారణ జరిగింది. ప్రాథమిక దర్యాప్తు ఇప్పటికే పూర్తయినందున మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వొద్దని రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఏజీ సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపించారు. కేటీఆర్ తరఫున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది సుందరం, ప్రభాకర్‌రావు, గండ్ర మోహన్‌రావు వాదనలు వినిపించారు. అవినీతి నిరోధక చట్టం కింద పెట్టిన సెక్షన్లు ఈ కేసుకు వర్తించవని, ఎఫ్ఐఆర్‌ను క్వాష్ చేయాలని కోరారు. ఇరు వైపులా వాదనలు విన్న ధర్మాసనం.. ఈనెల 30 వరకు కేటీఆర్‌ను అరెస్టు చేయొద్దని ఆదేశించింది. కేటీఆర్‌పై ఏసీబీ నమోదు చేసిన కేసులో దర్యాప్తు కొనసాగించవచ్చని స్పష్టం చేసింది. పది రోజుల్లో కౌంటరు దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ.. తదుపరి విచారణను ధర్మాసనం ఈనెల 27కి వాయిదా వేసింది. ఈ నేపథ్యంలో తాజాగా ఈడీ మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసింది.

# దేశ అభివృద్ధిలో గ్రోత్ ఇంజిన్ తెలంగాణ

**విశ్వంభర, హైదరాబాద్:** దేశ అభివృద్ధిలో గ్రోత్ ఇంజిన్‌గా ఉండే తెలంగాణ రాష్ట్ర సమగ్రాభివృద్ధికి తగిన ప్రాధాన్యత ఇవ్వాలని, రాష్ట్ర ప్రత్యేక అవసరాలను గుర్తించి తగిన ప్రోత్సాహం అందించాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కోరారు. రాజస్థాన్‌లోని జైపూర్ వేదికగా కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ నేతృత్వంలో జరిగిన ప్రీ బడ్జెట్ సమావేశంలో భట్టి విక్రమార్క, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు పాల్గొన్నారు. రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలను సమావేశంలో భట్టి వివరించారు. కేంద్ర ప్రాయోజిత పథకాల నుంచి తెలంగాణకు నిధులు తక్కువగా వస్తున్నాయని, జనాభా ప్రాతిపదికన కేంద్ర పథకాల్లో రాష్ట్రానికి నిధులు ఇవ్వాలని కోరారు. ''స్థానిక పరిస్థితులకు తగ్గట్లుగా కేంద్ర పథకాలు ఉపయోగించుకునే వెసులుబాటు ఉండాలి. విభజన చట్టం ప్రకారం రాష్ట్రానికి రావాల్సిన రూ.1800 కోట్ల పెండింగ్ గ్రాంట్లు విడుదల చేయాలి. వెనకబడిన ప్రాంతాల అభివృద్ధికి ఏడాదికి రూ.450 కోట్ల నిధులు మరో ఐదేళ్ల పాటు పొడిగించాలి. తెలంగాణలోని వెనకబడిన జిల్లాల్లో పారిశ్రామిక పార్కులు, సాగునీటి ప్రాజెక్టులు, జాతీయ రహదారులకు నిధులు మంజూరు చేయాలి. స్మార్ట్ సిటీస్ మిషన్ పొడిగించాలి. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల రంగానికి పీఎల్ఐ పథకాన్ని అమలు చేయాలి'' అని భట్టి కోరారు.

# ముగ్గురి దారుణ హత్యకేసులో నిందితుడికి మరణ శిక్ష

**విశ్వంభర, హైదరాబాద్:** ముగ్గురిపై పెట్రోల్ పోసి హతమార్చిన కేసులో నిందితుడికి నాంపల్లి కోర్టు మరణ శిక్ష విధించింది. 2022లో నారాయణగూడకు చెందిన సాయిలు.. తన భార్య, ఆమె ప్రియుడు, చిన్నారిపై పెట్రోల్ పోసి దారుణంగా హత్య చేశాడు. సుదీర్ఘ వాదనల అనంతరం మరణ శిక్ష విధిస్తూ శుక్రవారం నాంపల్లి క్రిమినల్ కోర్టు తీర్పు వెలువరించింది. సాయిలుకు సహకరించిన అతని స్నేహితుడు రాహుల్‌కు రూ.1000 జరిమానాతో పాటు యావజ్జీవ కారాగార శిక్ష విధించింది.

**2022లో ఏం జరిగిందంటే..**

నారాయణగూడ వంతెన కింద పూలు విక్రయిస్తూ నాగులు సాయిలు, ఆర్తి దంపతులు జీవనం సాగించేవారు. పలు కారణాలతో సాయిలు, ఆర్తి తరచూ గొడవ పడేవారు. దీంతో ఆర్తి తన భర్తకు దూరంగా ఉంది. ఈ క్రమంలో పరిచయమైన నాగరాజు అనే యువకుడితో ఆమె వివాహేతర సంబంధం కొనసాగిస్తోందని సాయిలు తెలుసుకున్నాడు. ఈ విషయంపై పలుమార్లు ఆమెను మందలించాడు. అయినా ఆర్తి పట్టించుకోలేదు. దీంతో కక్ష పెంచుకున్న సాయిలు.. భార్య, ఆమె ప్రియుడిపై పెట్రోల్ పోసి నిప్పంటించాడు. ఈ ఘటనలో పది నెలల చిన్నారి సైతం తీవ్రంగా గాయపడింది. చికిత్స పొందుతూ ముగ్గురూ ప్రాణాలు కోల్పోయారు. ఆర్తి తల్లి ఫిర్యాదు మేరకు 2022లో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు పూర్తి చేశారు. తాజాగా కోర్టు.. నిందితుడికి మరణ శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించింది.

# ముగిసిన పార్లమెంట్ శీతాకాల సమావేశాలు..

**ఢిల్లీ:** పార్లమెంట్‌లో శీతాకాల సమావేశాలు శుక్రవారం ముగిశాయి. విపక్ష సభ్యుల ఆందోళనల నేపథ్యంలో ఉభయసభలను నిరవధికంగా వాయిదా వేశారు. అంబేద్కర్‌పై కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలపై విపక్ష ఎంపీలు నిరసన వ్యక్తం చేస్తుండగానే స్పీకర్ ఓం బిర్లా లోక్ సభను నిరవధికంగా వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. ఆ సమయంలో ప్రధాని మోదీ కూడా సభలో ఉన్నారు.వన్ నేషన్, వన్ ఎలక్షన్ బిల్లుపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన జాయింట్ పార్లమెంటరీ కమిటీలో 12 మంది రాజ్యసభ సభ్యులకు చోటు కల్పించాలని కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ మేఘ్‌వాల్ ప్రవేశపెట్టిన తీర్మానానికి రాజ్యసభ ఆమోదం తెలిపింది. ఆ తర్వాత అమిత్ షా వ్యాఖ్యలపై సభలో విపక్ష ఎంపీలు నిరసనకు దిగడంతో రాజ్యసభను నిరవధికంగా వాయిదా వేశారు. దాంతో పార్లమెంట్ శీతాకాల సమావేశాలు ముగిసినట్లయ్యింది. శుక్రవారం ఉదయం ఉభయసభల ప్రారంభానికి ముందు పార్లమెంట్ ఆవరణలోని అంబేద్కర్ విగ్రహం వద్ద .. ఇండియా కూటమి ఎంపీలు నిరసన చేపట్టారు. అంబేద్కర్‌పై కేంద్ర మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలను వారు తప్పుపట్టారు. షా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. అంబేద్కర్‌ను అవమానించిన షా రాజీనామా చేయాలన్నారు.




# తెలంగాణలో ప్రతి సమస్య భూమితోనే ముడిపడి ఉంది

(మొదటి పేజీ తరువాయి)

ఆత్మగౌరవం నిలబెట్టింది. ఆక్రమణలు తొలగించి రైతుల హక్కులు కాపాడేందుకు గత ప్రభుత్వాలు ఎన్నో చట్టాలు తెచ్చాయి. గత ప్రభుత్వం తెచ్చిన 'ధరణి' మాత్రం రైతులను తమ భూములకు దూరం చేసింది. 2010లో ఒడిశా కూడా ఇదే ధరణి విధానాన్ని తీసుకొస్తే.. ఒడిశా ప్రభుత్వం తప్పు చేసిందని ఎన్ఐసీ, కాగ్ సూచించాయి. అనుభవం లేని ఐ అండ్ ఎల్ఎఫ్ఎస్ సంస్థకు అప్పగించొద్దని హెచ్చరించింది. తెలంగాణ ప్రభుత్వం మాత్రం యువరాజుకు అత్యంత సన్నిహితుడైన గాదె శ్రీధర్‌రాజు కంపెనీకి ధరణి పోర్టల్ నిర్వహణను అప్పగించారు. క్రిమినల్ కేసుల్లో ఇరుక్కున్న సంస్థలను ఐఎల్ అండ్ ఎల్ఎఫ్ఎస్ సంస్థ టేకోవర్ చేసుకుంది. అవకతవకలకు పాల్పడిన సంస్థకు ధరణి పోర్టల్ బాధ్యతను అప్పగించారు. ధరణి టెండర్ దక్కగానే ఈ సంస్థ పేరు, యాజమాన్యం మారింది. ఫాల్కన్ హెచ్‌బీ అనే ఫిలిప్పీన్ కంపెనీ, తర్వాత సింగపూర్ కంపెనీ ఇందులోకి వచ్చాయి. 50 లక్షల మంది రైతులు, వారి భూముల వివరాలను ఈ సంస్థ చేతిలో పెట్టారు. ట్యాక్స్ హెవెన్ దేశాల కంపెనీల చేతిలో మన ధరణి పోర్టల్ పెట్టారు. ఫిలిప్పీన్స్, సింగపూర్, కెమెన్ హైలాండ్స్, వర్జిన్ ఐలాండ్ మీదుగా ధరణి పోర్టల్ తిరిగింది. పోర్టల్ నిర్వహణ ఏ కంపెనీ చేతిలోకి వెళ్లినా.. సీఈవోగా గాదె శ్రీధర్‌రాజే ఉన్నారు'' అని సీఎం వివరించారు. సీఎం ప్రసంగం తర్వాత భూ భారతి బిల్లుకు శాసనసభ ఆమోదం తెలిపింది.

**విపక్ష పార్టీ అహంకారంతో వ్యవహరిస్తోంది**

విపక్ష పార్టీ అహంభావంతో అహంకారంతో వ్యవహరిస్తోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. సభా మర్యాదలను ఉల్లంఘించి సభాపతిపైనే దాడి చేస్తామన్న ధోరణిలో చర్చను అడ్డుకోవాలని ప్రయత్నించిందన్నారు. ''రెచ్చగొట్టడం ద్వారా భూ భారతి బిల్లుపై చర్చను పక్కదోవ పట్టించాలని ప్రయత్నించినా.. చాలా ఓర్పుతో సభాపతి వ్యవహరించారు. ఏ మాత్రం సహనం కోల్పోకుండా.. వాళ్లంతట వాళ్లే సహనం చచ్చిపోయి సహకరించాల్సిన పరిస్థితి కల్పించి సభను ముందుకు నడిపించారు. తెలంగాణ రైతాంగానికి ఉపయోగపడే కీలకమైన, ముఖ్యమైన బిల్లుపై చర్చ జరిగే విధంగా కృషి చేసిన సభాపతిని అభినందిస్తున్నా'' అని సీఎం తెలిపారు.



# రాహుల్ గాంధీపై కేసు

(మొదటి పేజీ తరువాయి)

చేసిన సంగతి తెలిసిందే. తమ పార్టీకి చెందిన ఇద్దరు ఎంపీలకు గాయాలు కావడానికి రాహుల్ గాంధీయే బాధ్యుడని ఆరోపిస్తూ బీజేపీ ఎంపీలు హేమంగ్ జోషి, అనురాగ్ ఠాకూర్, బాన్సురీ స్వరాజ్ పార్లమెంట్ స్ట్రీట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. హత్యాయత్నం సహా పలు సెక్షన్ల కింద రాహుల్‌పై కేసు నమోదైంది. మరోవైపు బీజేపీపై కాంగ్రెస్ ఎంపీలు చేసిన ఫిర్యాదుపైనా ఢిల్లీ క్రైమ్ బ్రాంచ్ పోలీసులు దర్యాప్తు చేపట్టనున్నారు.



**అసలేం జరిగింది?**

అంబేద్కర్‌ను అమిత్‌షా అవమానించారంటూ గత రెండు రోజులుగా ప్రతిపక్షాలు ఆందోళన చేపట్టాయి. ఈ నేపథ్యంలో కాంగ్రెస్సే రాజ్యాంగ నిర్మాతను అవమానిస్తోందంటూ మకరద్వారం మెట్లపై నిల్చుని గురువారం ఉదయం పార్లమెంటు ప్రారంభం కావడానికి ముందు ఎన్డీయే ఎంపీలు నిరసన చేపట్టారు. అదే సమయంలో ప్రతిపక్షాల ఎంపీలూ ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఒకరికొకరు ఎదురుపడ్డారు. ఇరువర్గాల నినాదాలతో ఆ ప్రాంతం హోరెత్తింది. అదే సమయంలో మెట్లపై కూర్చున్న తమను తోసుకుంటూ రాహుల్ సభలోకి వెళ్లడానికి ప్రయత్నించారని బీజేపీ ఎంపీలు ఆరోపించారు. పక్కనుంచి వెళ్లే అవకాశమున్నా కావాలనే ఎంపీల మధ్యలోంచి తమను నెట్టుకుంటూ వెళ్లారని తెలిపారు. ఈ తోపులాటలో బీజేపీ ఎంపీలు ప్రతాప్‌చంద్ర షడంగి(69), ముకేశ్ రాజ్‌పూత్(56) గాయపడ్డారు. ఈ తోపులాటకు సంబంధించి గురువారం రాత్రి రాహుల్‌గాంధీపై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. భారతీయ న్యాయ సంహితలోని (బీఎన్ఎస్) సెక్షన్ 117 (కావాలనే తీవ్రంగా గాయపరచడం), సెక్షన్ 125 (ఇతరుల ప్రాణాలకు, వ్యక్తిగత భద్రతకు ముప్పు కలిగించడం), సెక్షన్ 131 (నేరపూరిత బల ప్రయోగం), సెక్షన్ 351 (నేరపూరితంగా బెదిరించడం), సెక్షన్ 3(5) (ఉమ్మడి ఉద్దేశం) కింద కేసులను పెట్టారు.

# బీఆర్ఎస్ సభ్యులు వక్రబుద్ధితో వ్యవహరిస్తున్నారు

**విశ్వంభర, హైదరాబాద్:** గతంలో చేసిన తప్పులను సరిదిద్దుకోకుండా బీఆర్ఎస్ సభ్యులు వక్రబుద్ధితో వ్యవహరిస్తున్నారని తెలంగాణ రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి విమర్శించారు. శాసనసభలో భూ భారతి బిల్లుపై చర్చ సందర్భంగా మంత్రి మాట్లాడారు. ఫార్ములా ఈ-రేసు అంశంపై చర్చకు బీఆర్ఎస్ సభ్యులు పట్టుబట్టడంతో పాటు స్పీకర్ పోడియం వైపు దూసుకెళ్లేందుకు యత్నించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో వారి ఆందోళనల మధ్యే భూ భారతి బిల్లుపై పొంగులేటి తన ప్రసంగాన్ని కొనసాగించారు. ''బీఆర్ఎస్ సభ్యులు భూ భారతి బిల్లును ఆమోదించకుండా అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారు. వారి తీరు సభ్యసమాజం సిగ్గుపడేలా ఉంది. సభలో గూండాగిరి, దౌర్జన్యం, రౌడీయిజం లేకుండా స్పీకర్ చర్యలు చేపట్టాలి. భారాస హయాంలో తీసుకొచ్చిన 'ధరణి' పోర్టల్ తప్పులతడకగా ఉందని కేసీఆర్‌కు తెలుసు. ఆయన 80వేల పుస్తకాలు చదివారు. పుస్తకాలను క్షుణ్ణంగా పరిశీలించి ధరణి పోర్టల్ రూపొందించారని అనుకునేవాళ్లం. ఆ చట్టానికి మూడేళ్లకే వందేళ్లు నిండాయి. ఇందిరమ్మ రాజ్యంలో 1971లో చేసిన చట్టం.. 49 ఏళ్లుగా ప్రజల్లో ఉంది. భూ భారతి బిల్లుకు సంబంధించి బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు అనేక సూచనలు ఇచ్చారు. ఈ బిల్లు సభలో ప్రవేశపెట్టినప్పుడు ప్రధాన ప్రతిపక్ష నేత కేసీఆర్ కూడా సూచనలు చేస్తారని ఆశించాం. అవి చట్టంలో పొందుపరచాలని భావించాం. కేసీఆర్ రాలేదు.. సభలో ఉన్నవాళ్లు ఈరకంగా గొడవ చేస్తున్నారు. భారాస చిల్లర వేషాలను ప్రజలు హర్షించరు'' అని పొంగులేటి వ్యాఖ్యానించారు.



**హరీశ్‌రావుపై స్పీకర్ ఆగ్రహం**

అంతకుముందు హరీశ్‌రావు తీరుపై స్పీకర్ ప్రసాద్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ సభ్యుల ఆందోళన సందర్భంగా స్పీకర్ మాట్లాడారు. ''హరీశ్‌రావు తీరు రాష్ట్ర ప్రజలకు తీరని అన్యాయం చేసేలా ఉంది. సభను తప్పుదోవ పట్టించడం సరికాదు. భూ భారతి ముఖ్యమైన బిల్లు. ప్రజలకు సంబంధించిన బిల్లులపై చర్చల సమయంలో ఇలా ప్రవర్తించడం సరికాదు. ఈ బిల్లు ఇష్టం లేదా? రైతులకు సాయం చేయడం ఇష్టం లేదా?''అని స్పీకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

# హర్యానా మాజీ సీఎం కన్నుమూత

**చండీగఢ్:** హర్యానా మాజీ సీఎం ఓం ప్రకాష్ చౌతాలా కన్నుమూశారు. 89 ఏళ్ల వయస్సున్న ఆయన శుక్రవారం గుర్గావ్ నివాసంలో గుండెపోటుతో మరణించారు. ఇండియన్ నేషనల్ లోక్ దళ్ (ఐఎన్ఎల్డీ) చీఫ్ అయిన ఓం ప్రకాష్ చౌతాలా హర్యానాకు ఐదుసార్లు సీఎంగా వ్యవహరించారు. భారత మాజీ ఉప ప్రధాని చౌదరి దేవి లాల్ కుమారుడైన ఆయన 1989లో తొలిసారి ముఖ్యమంత్రి అయ్యారు. అయితే కేవలం ఆరు నెలలు ఆ పదవిలో కొనసాగారు. రెండు నెలల తర్వాత మళ్లీ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసినా ఐదు రోజులకే రాజీనామా చేయాల్సి వచ్చింది.1991లో మూడవసారి ముఖ్యమంత్రి పదవి చేపట్టారు. అయితే రెండు వారాల్లోనే ఆ రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించారు.1999 నుంచి 2005 వరకు వరుసగా రెండు పర్యాయాలు సీఎంగా ఉన్నారు. కాగా, 2000లో అధికారంలో ఉన్నప్పుడు 3,206 మంది ఉపాధ్యాయులను అక్రమంగా నియమించినట్లు ఓం ప్రకాష్ చౌతాలా, ఆయన కుమారుడు అజయ్ సింగ్ చౌతాలాపై ఆరోపణలు వచ్చాయి. టీచర్ రిక్రూట్‌మెంట్ స్కామ్‌కు సంబంధించి 2013లో వారిద్దరికి పదేళ్ల జైలు శిక్షను కోర్టు విధించింది. అయితే తొమ్మిదిన్నర సంవత్సరాల పాటు జైలు శిక్ష అనుభవించిన వారికి 2021లో ఢిల్లీ ప్రభుత్వం ఆరు నెలల ప్రత్యేక ఉపశమనం కల్పించడంతో చౌతాలా జైలు నుంచి విడుదలయ్యారు. మరోవైపు 16 ఏళ్ల నాటి ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో సీబీఐ కోర్టు 2022 మే 27న చౌతాలాకు నాలుగేళ్ల జైలు శిక్షతోపాటు రూ.50 లక్షల జరిమానా విధించింది. ఈ నేపథ్యంలో 87 ఏళ్ల వయస్సులో అత్యంత వృద్ధ ఖైదీగా తీహార్ జైలులో ఆయన గడిపారు. ఆ తర్వాత బెయిల్‌పై విడుదలయ్యారు. ఈ ఏడాది అక్టోబర్ 5న జరిగిన హర్యానా అసెంబ్లీ ఎన్నికల ఓటింగ్ సందర్భంగా ఓం ప్రకాష్ చౌతాలా చివరిసారిగా బహిరంగంగా కనిపించారు. సిర్సాలోని చౌతాలా గ్రామంలో ఓటు హక్కు వినియోగించుకున్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వమైనా భూముల ఆడిటింగ్ చేయాలి: అక్బరుద్దీన్ ఒవైసీ

**విశ్వంభర, హైదరాబాద్:** ఫార్ములా ఈ-రేసు అంశంపై చర్చకు బీఆర్ఎస్ సభ్యులు పట్టుబట్టడంతో పాటు స్పీకర్ పోడియం వైపు దూసుకెళ్లేందుకు యత్నించడంతో సభలో కాసేపు గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. బీఆర్ఎస్ సభ్యుల తీరును ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ తప్పుబట్టారు. ఈ రోజు సభలో జరిగింది పదేళ్ల బీఆర్ఎస్ పాలనను తెలియజేస్తోందని వ్యాఖ్యానించారు. సభ్యులు ప్రజల సమస్యలు ప్రస్తావించేందుకు సభకు వస్తారని.. ఇలా ఆందోళన చేసేందుకు కాదన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలన.. కచరా గవర్నెన్స్ అని ఘాటు వ్యాఖ్యలు చేశారు.'' శుక్రవారం సభలో జరిగింది బీఆర్ఎస్ సంస్కృతికి నిదర్శనం. బీఆర్ఎస్ సభ్యులకు కేసీఆర్ బోధించింది ఇదేనా? ధరణి.. ఒక కుటుంబం కోసం.. ఒక పార్టీ కోసమే తెచ్చారు. భూముల ఆడిటింగ్ జరగాలని పదేళ్లుగా డిమాండ్ చేస్తున్నా. నా డిమాండ్‌ను భారాస ఏనాడూ పట్టించుకోలేదు. కాంగ్రెస్ ప్రభుత్వమైనా భూముల ఆడిటింగ్ చేయాలి'' అని అక్బరుద్దీన్ కోరారు. సభలో చర్చ కొనసాగుతుండగానే భారాస సభ్యులు వాకౌట్ చేశారు.



## 23న మ్యూజిక్ టీచర్ అభ్యర్థులకు సర్టిఫికేషన్ వెరిఫికేషన్

**విశ్వంభర, హైదరాబాద్ :** గురుకులాల్లో మ్యూజిక్ టీచర్ల పోస్టులకు సంబంధించిన అభ్యర్థులకు 23న సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను నిర్వహించనున్నారు. ఈ మేరకు ట్రిబ్ చైర్మన్ బడుగు సైదులు శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. మాసాబ్ ట్యాంక్‌లోని డీఎస్ఎస్ భవన్‌లో సర్టిఫికేషన్ వెరిఫికేషన్ కొనసాగుతుందని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికేట్స్‌తో హాజరు కావాలని, అభ్యర్థులు https://treirb.cgg.gov.in లో షెడ్యూల్ చూసుకోవాలని సూచించారు.

## ముంబయి నుంచి హైదరాబాద్‌కు డ్రగ్స్.. నిందితుడి అరెస్ట్



**విశ్వంభర, హైదరాబాద్:** ముంబయి నుంచి హైదరాబాద్‌కు తీసుకొచ్చిన డ్రగ్స్‌ను నార్కోటిక్ బ్యూరో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. హైదరాబాద్‌కు చెందిన వసీమ్‌ఖాన్ ముంబయి నుంచి డ్రగ్స్‌ను తీసుకొచ్చి హైదరాబాద్‌లో విక్రయిస్తున్నట్టు పోలీసులకు సమాచారం అందింది. దీంతో వసీమ్‌ఖాన్‌పై నిఘా పెట్టిన పోలీసులు.. బస్సులో ముంబయి నుంచి 320 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్ తీసుకొస్తుండగా నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకుని, పరారీలో ఉన్న మరో నిందితుడు ఆయాన్ కోసం గాలిస్తున్నారు.


## ఫార్ములా-ఈ కార్‌పై ఎప్పుడైనా? ఎక్కడైనా చర్చకు సిద్ధం

**సీఎం రేవంత్‌రెడ్డి**

**విశ్వంభర, హైదరాబాద్:** ఫార్ములా-ఈ కార్ రేసింగ్‌పై సభలో చర్చించాలని కేటీఆర్ ఇంతకాలం ఎందుకు అడగలేదని సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. అసెంబ్లీలో సీఎం మాట్లాడుతూ.. ''ఈ కార్ రేస్ ప్రతినిధులు వచ్చి నన్ను కలిశారు. రూ.600 కోట్లు పెండింగ్ నిధులు రావాల్సి ఉంది.. ఇవ్వమని అడిగారు. మీరు ఊ.. అంటే మరోసారి రేసింగ్ నిర్వహిస్తామని చెప్పారు. ఎఫ్ఈవో ప్రతినిధులు వచ్చి కలిసిన తర్వాతే ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. హెచ్ఎండీఏ ఖాతాలోని రూ.కోట్ల నిధులు లండన్‌లోని కంపెనీకి నేరుగా ఎలా వెళ్తాయి? నిర్వాహకులతో కేటీఆర్ కుదుర్చుకున్న ఒప్పందం రూ.600 కోట్ల విలువైనది. మిగతా డబ్బు కోసం వాళ్లు వచ్చినప్పుడే ఈ విషయం నా దృష్టికి వచ్చింది. ఓఆర్ఆర్ అమ్మినా.. హెచ్ఎండీఏ నిధులు కాజేసినా.. అడగవద్దన్నట్లు మాట్లాడుతున్నారు. నేను జాగ్రత్త పడటం వల్ల రూ.450 కోట్లు మిగిలాయి. ఈ కార్ రేసింగ్ వ్యవహారంపై ఏసీబీ విచారణ జరుగుతోంది.. హైకోర్టులో కేటీఆర్ వేసిన పిటిషన్‌పై విచారణ జరుగుతోంది కాబట్టి ఎక్కువ వివరాలు వెల్లడించలేను. న్యాయపరంగా చిక్కులు లేకపోతే ఈ వ్యవహారంపై ఎక్కడైనా, ఎప్పుడైనా చర్చకు సిద్ధం. అవసరమైతే భారాస కార్యాలయానికి వెళ్లి అయినా చర్చిస్తాం. రూ.55 కోట్లు చిన్న విషయం కాదు'' అని సీఎం అన్నారు.

## జైలుకెళ్లి యోగా చేస్తానన్న కేటీఆర్ ఎందుకు భయపడుతున్నారు?

**మంత్రి సీతక్క**



**విశ్వంభర, హైదరాబాద్:** పార్లమెంటులో అంబేద్కర్‌ను, అసెంబ్లీలో దళిత స్పీకర్‌ను అవమానించారని మంత్రి సీతక్క అన్నారు. అసెంబ్లీ ఆవరణలో మీడియాతో చిట్‌చాట్‌లో ఆమె మాట్లాడారు. క్యాబినెట్ ఆమోదం తీసుకొని ఫార్ములా ఈ-రేసుకు కేటీఆర్ డబ్బులు చెల్లించారా అని ప్రశ్నించారు. ప్రభుత్వ అనుమతి లేని అంశానికి సభలో చర్చ ఎందుకు అని అడిగారు. గవర్నర్ క్లియరెన్స్ ఇచ్చిన కేసుకు సభలో చర్చ అవసరం లేదని చెప్పారు. బీఏసీలో ఫార్ములా ఈ-రేసు మీద చర్చ కోసం భారాస ఎందుకు అడగలేదని ప్రశ్నించారు. ముసుగు వేసుకుని భారాస రాజకీయం చేస్తోందని విమర్శించారు.''జైలుకు వెళ్లి యోగా చేస్తానన్న కేటీఆర్ ఎందుకు భయపడుతున్నారు. తప్పు చేయకపోతే విచారణ ఎదుర్కొని నిర్దోషిగా బయటికి రావచ్చు కదా? కేటీఆర్ తన సమస్యను రాష్ట్ర ప్రజల సమస్యగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారు. గతంలో ప్రభుత్వ కేసులు ఎదుర్కొన్న నాయకులు కోర్టుకు వెళ్తే తప్పుపట్టిన ఆయన.. ఇప్పుడు కోర్టు మెట్లు ఎందుకు ఎక్కారు? కేటీఆర్‌కు నిజాయతీ లేదు. లక్షలాది మంది రైతులకు ప్రయోజనం చేకూర్చే భూ భారతి బిల్లుపై చర్చ జరగకుండా అడ్డుకునే కుట్ర చేస్తున్నారు. వాళ్ల భూ కబ్జాల బాగోతం బయట పడుతుందనే ఇలా చేస్తున్నారు. అందరూ చట్టం ముందు సమానులే.. ఫార్ములా ఈ-రేసు కేసులో విచారణ ఎదుర్కోవాల్సిందే'' అని సీతక్క చెప్పారు.

# ఈ సుద్దపూస 2036లో హైదరాబాద్‌లో ఒలింపిక్స్ నిర్వహిస్తడట

- రేవంత్ పాలనలో శుక్రవారం వచ్చిందంటే చాలు.. అందరూ భయపడే పరిస్థితి..
- తెలంగాణ భవన్‌లో మీడియా సమావేశంలో హరీష్ రావు



**విశ్వంభర, హైదరాబాద్:** కొండను తవ్వి ఎలుకను పట్టినట్లు, అధికారంలోకి వచ్చిన ఏడాది తర్వాత ఇప్పుడు ఏదో శోధించినట్లు సీఎం రేవంత్ రెడ్డి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని మాజీ మంత్రి హరీశ్‌రావు తీవ్రంగా మండిపడ్డారు. ఆ డైవర్షన్‌లో భాగమే.. కేటీఆర్ మీద పెట్టిన కేసు అని హరీశ్‌రావు పేర్కొన్నారు. తెలంగాణ భవన్‌లో హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు.ఈ రేవంత్ రెడ్డికి అటు విజన్ లేదు, ఇటు విజ్‌డమ్ లేదు. రేవంత్ రెడ్డి అనాలోచిత నిర్ణయం వల్ల తెలంగాణ ప్రతిష్ఠ దిగజారే పరిస్థితి వచ్చింది. ఇక్కడ ఇంటర్నేషనల్ రేస్ మూడేండ్లు జరగాల్సి ఉంటే, దాన్ని మధ్యంతరంగా రద్దు చేసిండు. ఈ పాటి దానికి, ఈ సుద్దపూస 2036లో హైదరాబాద్‌లో ఒలింపిక్స్ నిర్వహిస్తడట. కూట్లో రాయి తీయలేనోడు ఏట్లో రాయి తీస్తడన్నట్లు. ఆల్రెడీ ఒప్పందం అయి మూడేళ్లు రేసు నిర్వహించే అవకాశం ఉన్న ఇంటర్నేషనల్ ఈవెంట్‌ను రద్దు చేసి, ఒలింపిక్స్ నిర్వహిస్తానని డబ్బా కొడుతున్నడు అని హరీశ్‌రావు సెటైర్లు వేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అర్ధాంతరంగా రద్దు చేయడం వల్ల నష్టం జరిగిందని లండన్‌లో ప్రభుత్వం మీద కేసు వేసింది. ఆ కేసు గెలిస్తే రాష్ట్ర ప్రతిష్ఠ మరింత తగ్గుతది. ఇది కేటీఆర్ సంబంధించిన అంశం కాదు, నాలుగు కోట్ల ప్రజలకు సంబంధించినది. రాష్ట్ర ప్రతిష్ఠ, దేశ ప్రతిష్ఠ దిగజారింది. దిస్ విజన్ లెస్ చీఫ్ మినిస్టర్.. రూయిండ్ ద హైదరాబాద్ బ్రాండ్ అండ్ తెలంగాణ స్టేట్ ఇమేజ్. అప్పులు అప్పులు అని దివ్యంగా వెలుగుతున్న రాష్ట్రాన్ని దివాళా రాష్ట్రం అన్నడు. ఇవాళ రాష్ట్రానికి వచ్చే పెట్టుబడులు రాకుండా పోయినయి. ఉద్యోగ కల్పనకు దిక్కు లేకుండా పోయింది అని హరీశ్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు.


**రేవంత్ పాలనలో శుక్రవారం వచ్చిందంటే చాలు.. అందరూ భయపడే పరిస్థితి..**

సీఎం రేవంత్ రెడ్డి పాలనలో శుక్రవారం వచ్చిందంటే చాలు.. అందరూ భయపడే పరిస్థితి నెలకొందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎవడన్నా నేషనల్ మీడియా ఇంటర్వ్యూలో ఎల్ అండ్ టీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌ను లోపలేయాలని పోలీసులకు చెప్పిన అని గర్వంగా చెప్పుకుంటడా. అంతకుమించిన తలకుమాసినోడు ఎవడన్న ఉంటడా? ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన ఎల్ అండ్ టి సంస్థకు చెందిన మెట్రో సీఈఓను లోపలేస్తా అన్నడు రేవంత్ రెడ్డి. కాంగ్రెస్ మాజీ కేంద్రమంత్రి దివగంత దాసరి నారాయణ రావు గతంలో చంద్రబాబు పాలన ఎట్లుండెనో చెప్పేందుకు ఓ సినిమా తీసిండు. ఆ సినిమా పేరు పిచ్చోడి చేతిలో రాయి.. అట్లనే రేవంత్ రెడ్డి కూడా ఎప్పుడు, ఎవరి మీద పడుతడో, ఏం కేసులు పెడతడో తెల్వకుండా అయ్యింది. శుక్రవారం వచ్చిందంటే చాలు అందరూ భయపడే పరిస్థితి నెలకొని ఉందని హరీశ్‌రావు తెలిపారు. రైతుల మీద కేసులు, విద్యార్థుల మీద కేసులు, ఆటో డ్రైవర్ల మీద కేసులు, అంగన్ వాడీల మీద కేసులు, ఆశాల మీద కేసులు, చివరకు ఎక్కడి పోయిందంటే.. పోలీసుల మీద కూడా కేసులు పెట్టించిండు. సినిమా వాళ్ల మీద కూడా కేసులు పెట్టించిండు. ఆయన పాలనా వైఫల్యాలపై అడుగడుగునా నిలదీస్తున్న ప్రతిపక్ష నాయకుల మీద కేసులు పెట్టడం పెద్ద విషయమా? కేటీఆర్ మీద కేసులు పెట్టిండు, నా మీద పెట్టిండు, తలసాని మీద పెట్టిండు, పల్లా మీద పెట్టిండు, కౌశిక్ రెడ్డి మీద పెట్టిండు.. మా పట్నం నరేందర్ రెడ్డి అయితే నిన్ననే జైలు నుంచి బయటికి వచ్చిండు అని హరీశ్‌రావు పేర్కొన్నారు. పోలీసులతో దబాయించు, అక్రమ కేసులు బనాయించు, అబద్ధాలతో బుకాయించు. ఢిల్లీలోనేమో రాజ్యాంగ పరిరక్షణ కావాలె, గల్లీలోనేమో రాజ్యంగ భక్షణ చెయ్యాలె. 125 అడుగుల అంబేద్కర్ కే తాళం వేసి పెట్టిన ఘనత రేవంత్ రెడ్డిది. ఎండాకాలం వడ దెబ్బ తప్పించుకోవచ్చు గానీ, రేవంత్ రెడ్డి హైడ్రా దెబ్బ తప్పించుకోలేక రియల్ ఎస్టేట్ ధమాల్ అయ్యింది. నువ్వు ఎన్ని కేసులు పెట్టినా, మా కేటీఆర్ నీ వెంటపడటం మానరు, నీ బండారం బయటపెట్టడం ఆపరు. ఈ పిచ్చి కేసులకు భయపడి మా లీడర్లు గానీ, క్యాడర్లు గానీ ఎక్కడా తగ్గరు. కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ కోసం పోరాటం చేసినోళ్లం. వెనుకడుగు వేసిది లేదు అని హరీశ్‌రావు తేల్చిచెప్పారు.



## రామానుజన్ జయంతి వేడుకలకు డా.కాచంకు ఆహ్వానం

**విశ్వంభర, హైదరాబాద్:** డిసెంబర్ 22 శ్రీనివాస రామనుజన్ జయంతి జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా తెలంగాణ మేథమేటిక్స్ ఫోరం ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించనున్నారు. అదేవిధంగా హయత్ నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాష్ట్రస్థాయి గణిత ప్రతిభా పరీక్ష నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ప్రెసిడెంట్ కందికొండ శ్రీనివాసరావు తెలిపారు. ఈ కార్యక్రమానికి వీ3 న్యూస్, విశ్వంభర దినపత్రిక సీఎండీ డా.కాచం సత్యనారాయణను ప్రత్యేక అతిథిగా ఆహ్వానిస్తూ నిర్వాహకులు శుక్రవారం ఆహ్వాన పత్రికను డా.కాచంకు అందజేశారు.



## ఫార్ములా వన్ రేసుపై అసెంబ్లీలో చర్చ చేపట్టాలి

### మాజీ మంత్రి తలసాని

**విశ్వంభర, హైదరాబాద్:** అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా గెలుపు కోసం కాంగ్రెస్ పార్టీ ఎన్నో అలవికాని హామీలు ఇచ్చిందని, ఇప్పుడు ఆ హామీలను నెరవేర్చడంలో విఫలమైందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆరోపించారు. ఆ హామీలపై చర్చ పెట్టాలని తాము కోరామని తెలిపారు. శుక్రవారం ఉదయం శాసనసభ సమావేశాల ప్రారంభానికి ముందు మీడియా పాయింట్‌లో తలసాని మాట్లాడారు.ఫార్ములా వన్ రేసు సందర్భంగా అవినీతి జరిగిందంటూ తమ నాయకుడు కేటీఆర్‌పై కేసు పెట్టారని, ఫార్ములా వన్‌పై చర్చ జరగాలని తాము డిమాండ్ చేస్తున్నామని తలసాని వెల్లడించారు. శాసనసభలో తమ దళిత ఎమ్మెల్యేలకు చెప్పులు చూపించారని ఆయన ఆరోపించారు. సభ రికార్డులు బయటపెట్టాలని డిమాండ్ చేశారు. తాము అన్ని విధాల సభకు సహకరించడానికి సిద్ధంగా ఉన్నామని చెప్పారు.

## ఆ చట్టం భూ భారతి కాదు.. భూ హారతి

### ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి



**విశ్వంభర, హైదరాబాద్:** ఇవాళ తెలంగాణ శాసనసభ ఆమోదించిన చట్టం భూ భారతి కాదు భూ హారతి అని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ నేతల భూకబ్జాలకు, రియల్ ఎస్టేట్ బ్రోకర్లకు మంగళ హారతి పట్టనుందని విమర్శించారు. అసెంబ్లీ ఆవరణలోని మీడియా పాయింట్ వద్ద ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి మాట్లాడారు.బీఆర్ఎస్ ప్రభుత్వ హాయాంలో 75 లక్షల మంది రైతులకు సంబంధించి కోటి 50 లక్షల ఎకరాలకు ధరణి చట్టం హక్కులు కల్పించింది. భూ భారతి చట్టం రైతుల పాలిట పిడుగుపాటు లాంటిదే. ఏదైనా కుక్కను చంపాలంటే దాన్ని పిచ్చి కుక్కగా ముద్ర వేయాలి. ఇప్పుడు ధరణిని కూడా పిచ్చి కుక్కగా ముద్ర వేసి చంపేశారు. ఎలుక చొచ్చిందని ఇల్లు తగలబెట్టుకున్న చందంగా ఉంది కాంగ్రెస్ ప్రభుత్వ పరిస్థితి. ఇక రేపట్నుంచి పేదలకు కష్ఠాలు మొదలవుతాయని పల్లా రాజేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. కేవలం పది శాతం సమస్యలు కూడా లేని ధరణి చట్టంను రద్దు చేయడం దారుణం. ధరణితో పారదర్శకత పెరిగింది. 12 కోట్ల మంది ధరణి వెబ్‌సైట్ విజిట్ చేశారు. లక్షల ట్రాన్సక్షన్స్ జరిగాయి. అసెంబ్లీలో పొంగులేటి పచ్చి అబద్దాలు ఆడారు. నిజాం తర్వాత తెలంగాణలో భూమినంతా 86 సంవత్సరాల తర్వాత కేసీఆర్ సర్వే (ఎల్ఆర్‌యూపి)చేయించి హక్కు పత్రాలు ఇచ్చారు. సీఎంఓలో ఉన్న అధికారులందరూ ధరణి చట్టంలో పాలుపంచుకున్నవారే. వారిని కూడా రేవంత్ తప్పుబడుతున్నారా..? కేసీఆర్ తెచ్చిన సాఫ్ట్‌వేర్‌ను వాడుతూ రేవంత్ గత ప్రభుత్వాన్ని తప్పు పడుతున్నారని పల్లా రాజేశ్వర్ రెడ్డి ధ్వజమెత్తారు.70 లక్షల మంది రైతులకు సంబంధించి కోటి 52 లక్షల ఎకరాలకు ధరణి లో చిన్న తప్పు కూడా దొర్లలేదు. 27 లక్షల ట్రాన్సాక్షన్లు జరిగిన ధరణి సాఫ్ట్‌వేర్‌లో లోపభూయిష్టాలు ఉన్నట్టా ? సాఫ్ట్‌వేర్ అనేది ఎప్పటికపుడు అప్ డేట్ చేసుకోవాలి. విదేశీ సంస్థల చేతిలో ధరణి సాఫ్ట్‌వేర్ అనేది పూర్తి అబద్దం. జమాబందీ తిరిగి తెస్తున్నారు. ఇది అక్రమార్కులకు పండగే. పౌతీ విధానం తేవడం తిరోగమన చర్య. కుటుంబంలో మళ్ళీ తగాదాలు మొదలవుతాయి. అనుభవదారు కాలమ్ పెడతారట.. రైతు, కౌలు రైతు కొట్లాడాలి. కొత్త దుకాణాలు మొదలై భూ భారతితో అవినీతి విచ్చలవిడి అవుతుంది. ఎమ్మార్వో సంతృప్తి చెందితేనే మ్యూటేషన్ అనేది మరో అవినీతి దుకాణం. కేసీఆర్ తెచ్చిన బ్రహ్మాండమైన చట్టాన్ని నీరు గార్చారు. భూభారతితో రైతుల గుండె దడ మొదలైంది. భూ భారతి చట్టాన్ని బీఆర్ఎస్ నిర్ద్వంద్వముగా తిరస్కరిస్తోంది. ధరణితోనే రైతుబంధు పారదర్శకంగా సాగింది. రైతులతో కలిసి భూ భారతిపై పోరాటం చేస్తాం అని పల్లా రాజేశ్వర్ రెడ్డి హెచ్చరించారు.

## మరాఠీ ప్రజల్ని అవమానిస్తే సహించం: ఏక్‌నాథ్ శిందే

**నాగ్‌పూర్:** ఠానే జిల్లాలోని కల్యాణ్‌లో ఓ మరాఠీ కుటుంబంపై దాడి ఘటన రాజకీయ దుమారానికి కారణం కావడంపై మహారాష్ట్ర డిప్యూటీ సీఎం ఏక్‌నాథ్ శిందే స్పందించారు. రాష్ట్రంలో మరాఠీ ప్రజలను అవమానిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఈ ఘటనలో నిందితుడిపై చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. ఇదే అంశంపై సీఎం దేవేంద్ర ఫడణవీస్ శాసనమండలిలో ప్రకటన కూడా చేశారన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ''మేం మరాఠీల గౌరవాన్ని కాపాడతాం. అవమానించే వారిని క్షమించం. మరాఠీ ప్రజల హక్కులను కాపాడేందుకు దివంగత బాల్ ఠాక్రే శివసేనను స్థాపించారు'' అని అన్నారు.మరో వైపు, కల్యాణ్‌లో ఇటీవల ఇరుగు పొరుగువారి మధ్య తలెత్తిన ఘర్షణ నేపథ్యంలో ఓ మరాఠీ కుటుంబంపై దాడికి పాల్పడిన ప్రభుత్వ ఉద్యోగి, అతడి భార్యపై పోలీసులు కేసు నమోదు చేశారు. మరోవైపు, ముంబయి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంపై భాజపా యువ విభాగానికి చెందిన కొందరు దాడి చేయడంపై విలేకర్లు అడిగిన ప్రశ్నకు శిందే స్పందించారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకున్న వారిని పోలీసులు చూసుకుంటారన్నారు. ప్రజాస్వామ్యంలో విధ్వంసానికి పాల్పడే హక్కు ఎవరికీ లేదని చెప్పారు. కొత్త క్యాబినెట్‌లోకి తీసుకోకపోవడంపై ప్రస్తుతం శివసేనలో ఎవరూ అసంతృప్తితో లేరని.. తామంతా ఓ కుటుంబంలా పనిచేస్తున్నామని శిందే చెప్పుకొచ్చారు.






## ప్రియాంకా గాంధీకి '1984' బ్యాగ్ బహుమతిగా అందజేసిన బీజేపీ ఎంపీ



**ఢిల్లీ:** పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో భాగంగా పలు విషయాలపై ప్రతిపక్షాలు నిరసన తెలుపుతున్న విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా గాంధీ మోదీ, అదానీలు కలిసిఉన్నట్లుగా ముద్రించిన బ్యాగులు, పాలస్తీనా అని రాసి ఉన్న బ్యాగులు, బంగ్లాదేశ్‌లో మైనార్టీలపై దాడులను ఖండిస్తున్నట్లు సందేశం ఉన్న బ్యాగులను వెంట తీసుకువచ్చి వినూత్నంగా నిరసన తెలుపుతున్నారు. దీనికి సంబంధించిన వార్తలు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. ఈనేపథ్యంలో బీజేపీ ఎంపీ అపరాజితా షడంగి ప్రియాంకకు '1984' అని ఎరుపు రంగుతో రాసి ఉన్న బ్యాగును అందించడం ప్రాముఖ్యం సంతరించుకుంది.దీనికి సంబంధించిన వీడియోనూ బీజేపీ ఎంపీ అపరాజితా షడంగి సోషల్ మీడియాలో షేర్ చేస్తూ కోట్‌ను జత చేశారు. అందులో ''కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకకు బ్యాగులంటే చాలా ఇష్టం. అందుకే ఆమెకు '1984' నాటి సిక్కుల ఊచకోతకు సంబంధించిన బ్యాగు అందజేశాను. తొలుత దాన్ని తీసుకోవడానికి ఆమె నిరాకరించినా.. తర్వాత తీసుకొని పక్కన పెట్టేశారు'' అని రాసుకొచ్చారు. గత 50 ఏళ్ల పాలనలో కాంగ్రెస్ ఏం చేసిందో నేటితరానికి తెలియాలనే ఉద్దేశంతో ఈ బ్యాగును బహూకరించానని ఆమె పేర్కొన్నారు.



# అసాధారణ ఘటనల మధ్య ముగిసిన పార్లమెంటు శీతాకాల సమావేశాలు

లోక్‌సభ, రాజ్యసభ రెండూ నిరవధికంగా వాయిదా

అధికార, ప్రతిపక్షాల మధ్య వాగ్వాదాలు.. తోపులాటలు.. గాయాలు

వాయిదాలు, అంతరాయాలతో.. లోక్‌సభలో 65 గంటలు వృథా

అదానీ వ్యవహారంలో అట్టుడికిన ఉభయసభలు..

దుమారం రేపిన అంబేద్కర్ పై అమిత్ షా వ్యాఖ్యలు

తోపులాట.. ఇద్దరు ఎంపీలకు గాయాలు..

ఆందోళనల మధ్యనే జమిలీ ఎన్నికల బిల్లు ప్రవేశ పెట్టిన కేంద్రం

పార్లమెంటు శీతాకాల సమావేశాలు శుక్రవారంతో ముగిశాయి, లోక్‌సభ, రాజ్యసభ రెండూ నిరవధికంగా వాయిదా పడ్డాయి. ఈసారి తీవ్ర నిరసనలు, దాడి ఆరోపణలు, ఏకకాలంలో ఎన్నికలు శాసనసభ ఒత్తిడితో కూడిన గందరగోళ కాలానికి ముగింపు పలికింది. అలాగే చివరి క్షణంలో 'ఒక దేశం, ఒకే ఎన్నికలు' రాజ్యాంగ సవరణ బిల్లులను జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)కి సూచించే తీర్మానాన్ని లోక్‌సభ ఆమోదించింది .పార్లమెంటు శీతాకాల సమావేశాలు. అధికార, విపక్షాల మధ్య వాగ్వాదాలు సహా కొన్ని అసాధారణ ఘటనల మధ్య ముగిశాయి. రాజ్యాంగంపై చర్చ, జేపీసీకి జమిలి బిల్లులు పంపించడం వంటివి జరిగినప్పటికీ.. బీఆర్ అంబేడ్కర్‌పై కేంద్ర హోమ్ మంత్రి అవమానకర వ్యాఖ్యలు చేశారని విపక్షాల ఆరోపణలతో ఉభయ సభలు అట్టుడికాయి. అమిత్ షా రాజీనామా చేయాలన్న విపక్షాల నిరసనల మధ్య ఎలాంటి కార్యకలాపాలు జరగకుండానే చివరి రోజు ఉభయసభలు నిరవధికంగా వాయిదా పడ్డాయి. ఈ క్రమంలో శీతాకాల సమావేశాల ఉత్పాదకత భారీగా పడిపోయినట్లు వెల్లడైంది. నవంబర్ 25న ప్రారంభమైన పార్లమెంట్ శీతాకాల సమావేశాలు.. అధికార, విపక్షాల మధ్య వాగ్వాదాల మధ్యే కొనసాగాయి. చివరి రోజు లోక్‌సభ ప్రారంభమైన కేవలం మూడు నిమిషాలకే సభను వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ ప్రకటించారు. విపక్షాల ఆందోళనలతో నెల రోజులు ఉభయసభలు అట్టుడికాయి. కానీ నెల రోజులంతా ఒక ఎత్తైతే.. గురువారం జరిగిన తంతు మరో ఎత్తు. 16 బిల్లులు ప్రవేశపెట్టాలని కేంద్రం భావించింది. ఓవైపు రాజ్యంగంపై పదునైన ప్రసంగాలు.. అదానీ వ్యవహారంపై ఘాటైన విమర్శలు.. మధ్యలో తోపులాటలు.. గాయాలు.. ఇలా సాగిన వింటర్ సెషన్స్ ఎట్టకేలకు ముగిసింది.

**అధికార విపక్షాల మధ్య తీవ్ర సంవాదం..**

పార్లమెంట్ శీతాకాల సమావేశాలు అనూహ్య ఘటనలకు వేదికయ్యాయి. దాదాపు నెల రోజులపాటు జరిగిన సమావేశాల్లో పలు అంశాలపై అధికార విపక్షాల మధ్య తీవ్ర సంవాదం నడిచింది. ఆందోళనల పర్వం కొనసాగింది. పదునైన సంభాషణలకు వేదికైంది. చివరి రోజైన శుక్రవారం కూడా ఉభయ సభల్లో గందరగోళ పరిస్థితులే కనిపించాయి. అంబేద్కర్‌పై కేంద్ర మంత్రి అమిత్ షా వ్యాఖ్యలను నిరసిస్తూ రాజ్యసభలో కాంగ్రెస్ ఎంపీలు నినాదాలు చేశారు. ఇటు లోక్‌సభలోనూ ఇదే పరిస్థితి కనిపించడంతో...పార్లమెంటు గౌరవాన్ని, సభలో శాంతిని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్క సభ్యుడిపైనా ఉందని సభ్యులను శాంతపరిచే ప్రయత్నం చేశారు స్పీకర్ ఓంబిర్లా. సభలో జాతీయ గీతాలాపన పూర్తయిన వెంటనే సభను వాయిదా వేస్తున్నట్టు ఆయన ప్రకటించారు. ఇటు రాజ్యసభలో వన్ నేషన్ వన్ ఎలక్షన్ బిల్లును సంయుక్త పార్లమెంటరీ కమిటీజేపీసీకి పంపేందుకు ఆమోదముద్ర పడింది.

**అదానీ వ్యవహారంలో అట్టుడికిన ఉభయసభలు..**









నవంబర్ 15 నుంచి ప్రారంభమైన శీతాకాల సమావేశాల్లో అనేక కీలకపరిణామాలు చోటు చేసుకున్నాయి. అదానీ వ్యవహారంపై విపక్షసభ్యుల ఆందోళనలతో సభ అట్టుడుకుంది. దాదాపు 14రోజుల పాటు అదానీ వ్యవహరంపైనే రచ్చ జరిగింది. దీంతో ఉభయసభల విలువైన సమయం వాయిదాలకే సరిపోయింది. ఇక పార్లమెంట్ చరిత్రలో తొలిసారి రాజ్యసభ చైర్మన్ పై విపక్షాలు అవిశ్వాస తీర్మాన నోటీస్ ఇచ్చాయి. చైర్మన్ జగదీప్ ధన్‌కడ్‌పై విపక్షాల గొంతును నొక్కేస్తున్నారని ఆరోపిస్తూ..ఇండి కూటమి నో కాన్ఫిడెన్స్ మోషన్ ఇచ్చింది. అయితే నో కాన్ఫిడెన్స్ మోషన్‌కు మూవ్ అయ్యేందుకు తగినంత సమయం లేకపోవడం, డాక్యుమెంట్ లోపాలతో సహా విధానపరమైన సమస్యల కారణంగా నో కాన్ఫిడెన్స్ మోషన్ తిరస్కరించబడింది. ఇక అదానీ గ్రూప్ లంచం ఆంరోపణలపై విపక్షాలు విరుచుకుపడుతుంటే.. రివర్స్‌లో సోరోస్ గాంధీ బంధం గురించి ఏమంటారంటూ అధికార పక్షం ఎదురుదాడికి దిగింది.

**సభముందుకు జమిలీ బిల్లు..**


ఇలా అధికార విపక్షాల ఆందోళనలతో ప్రతిరోజూ ఉభయసభల్లో గందరగోళ పరిస్థితులు నెలకొనేవి. అయితే రాజ్యంగం అమల్లోకి వచ్చి 75ఏళ్లు అవుతున్న సందర్భంగా పార్లమెంట్ లో రెండురోజుల పాటు చర్చ జరిగింది. ఈ రెండ్రోజులు సభ్యులు పూర్తిగా హాజరై రాజ్యాంగంపై తమ అభిప్రాయాలతో పాటు పదునైన ప్రసంగాలు చేశారు. రాజ్యాంగ చర్చలోఅధికార విపక్షాల పరస్పర ఆరోపణలతో సభ వేడెక్కింది. ఇక ఎంతో ఉత్కంఠ రేపిన జమిలీ బిల్లును సభముందుకు తీసుకొచ్చింది మోదీ సర్కార్. దీనిపై విపక్షాలు తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేసినా కేంద్రం వెనక్కి తగ్గలేదు. బిల్లును క్షుణ్ణంగా పరిశీలించేందుకు పరిశీలించేందుకు ఓటింగ్ ద్వారా జేపీసీకి పంపేందుకు ఆమోదముద్ర పడింది.

**దుమారం రేపిన అంబేద్కర్ పై అమిత్ షా వ్యాఖ్యలు**

ఇక అంబేద్కర్‌పై అమిత్‌షా రాజ్యసభలో చేసిన

## వాయిదాలు, అంతరాయాలతో..
## లోక్‌సభలో 65 గంటలు వృథా

పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో ఉభయ సభల్లోనూ విలువైన సమయం వృథా అయ్యింది. లోక్‌సభ భారీ అంతరాయాలను ఎదుర్కొంది. మూడవ సెషన్‌లో 65 గంటలు, మొత్తం మూడు సెషన్‌లలో కలిపి 70 గంటలకు పైగా సమయాన్ని కోల్పోయింది. నవంబర్ 25న ప్రారంభమైన పార్లమెంటు శీతాకాల సమావేశాలు మూడు విడతలుగా కొనసాగాయి. డిసెంబర్ 19న లోక్‌సభలో గొడవ, ప్రతిపక్ష ఎంపీల నిరసనల నేపథ్యంలో పార్లమెంటు సమావేశాలు ఆకస్మికంగా ముగిశాయి. శుక్రవారం ఉభయ సభలూ నిరవధికంగా వాయిదాపడ్డాయి.కాగా, అధికారిక సమాచారం ప్రకారం లోక్‌సభ మొదటి సెషన్‌లో 5 గంటల 37 నిమిషాలు వృథా అయ్యాయి. రెండవ సెషన్‌లో గంటా 53 నిమిషాలు, ముగింపు సెషన్‌లో ఆశ్చర్యకరంగా 65 గంటల 15 నిమిషాలు లోక్‌సభ కోల్పోయింది.లోక్‌సభ తొలి సెషన్‌లో ఏడు, రెండో సెషన్‌లో 15, మూడో సెషన్‌లో 20 సమావేశాలు జరిగాయి. తొలి సెషన్‌లో ఏడు గంటలు, రెండో సెషన్‌లో 33 గంటలకుపైగా, మూడో సెషన్‌లో 21.7 గంటలపాటు చర్చల్లో ఎంపీలు పాల్గొన్నారు.మరోవైపు రాజ్యసభ తొలి సెషన్‌లో 34.16 గంటల పాటు చర్చ జరిగింది. రెండో సెషన్‌లో చర్చా సమయం 115.21 గంటలకు పెరిగింది. అయితే మూడవ సెషన్‌లో చర్చల సమయం 62 గంటల కనిష్టస్థాయికి పడిపోయింది.



వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. అంబేద్కర్‌ను అమిత్‌షా అవమానించారంటూ విపక్షాలు దేశవ్యాప్తంగా నిరసనప్రదర్శనలకు పిలుపునిచ్చింది. అమిత్‌షా రాజీనామా చేయాలని.,.జాతికి క్షమాపణ చెప్పాలంటూ విఫక్షాలు భారీ స్థాయిలో ఆందోళనలు చేపట్టాయి. అయితే తాను అంబేద్కర్‌ను అవమానించలేదని కేంద్రమంత్రి అమిత్‌షా వివరణ ఇచ్చారు.అమిత్‌షా వివరణ ఇచ్చినా విపక్షాలు మాత్రం శాంతించలేదు.

**తోపులాట.. ఇద్దరు ఎంపీలకు గాయాలు..**

ఈనెలరోజుల పాటు జరిగన ఆందోళనలు ఓ ఎత్తైతే...గురువారం జరిగిన ఆందోళనలు మరోఎత్తు. అమిత్ షా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్ష ఇండి కూటమి ఎంపీలు బ్లూకలర్ దుస్తులు, కండువాలతో ఆందోళనకు దిగారు. అంబేద్కర్ ప్లకార్డులు పట్టుకుని అమిత్ షా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రాహుల్ గాంధీ, ప్రియాంక, ఇతర ఎంపీలు పార్లమెంటు ఆవరణలోని అంబేద్కర్ విగ్రహం వద్దకు వెళ్లి ఆందోళన చేశారు. జై భీమ్ నినాదాలు చేశారు. మరోవైపు, బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏ ఎంపీలు సైతం ప్లకార్డులు పట్టుకుని బాబా సాహెబ్‌ను అవమానించిన కాంగ్రెస్ క్షమాపణ చెప్పాలని నిరసనకు దిగింది.ఇలా పోటాపోటీ ఆందోళనలతో పార్లమెంటు ఆవరణలో తీవ్ర గందరగోళం ఏర్పడింది. పార్లమెంటు మకరద్వారం వద్ద గోడపైకి ఎక్కి విపక్ష సభ్యులు నిరసన తెలిపారు. ఈసందర్భంలోనే అధికార విపక్షాలు ఎదురుపడడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. సభ్యుల మధ్య ఒక్కసారిగా తోపులాట చోటు చేసుకుంది. ఈతోపులాటలో ఒడిశా బీజేపీ ఎంపీ ప్రతాప్ చంద్ర సారంగి తలకు గాయమైంది. రాహుల్ గాంధీ నెట్టడంతోనే తాను పడ్డానని సారంగి తెలిపారు. మెట్ల వద్ద నిల్చొని ఉండగా.. రాహుల్ గాంధీ ఓ ఎంపీని నెట్టేశారు. ఆయన వచ్చి తనపై పడటంతో కిందపడి గాయపడ్డానని సారంగి తెలిపారు. ఈ తోపులాటలో మరో ఎంపీ ముకేశ్ రాజ్‌పుత్‌కూ గాయాలయ్యాయి. వెంటనే సారంగితోపాటు ముకేశ్‌నూ ఆసుపత్రికి తరలించారు.ప్రస్తుతం ఇద్దరు ఎంపీలు ఆసుపత్రిలోనే వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారు. మరోవైపు బీజేపీ ఎంపీల ఆరోపణలను రాహుల్ గాంధీ, ఖర్గే తీవ్రంగా ఖండించారు. పార్లమెంట్ లోపలికి వెళ్లనీయకుండా బీజేపీ ఎంపీలు తమను అడ్డగించారని..కర్రలతో తమను బెదిరించేందుకు ప్రయత్నించారని రాహుల్ ఆరోపించారు. ఇటు బీజేపీ ఎంపీలు కూడా కాంగ్రెస్ తీరుపై తీవ్ర ఆరోపణలతో విరుచుకుపడ్డారు. ముఖ్యంగా పార్లమెంట్‌లో రాహుల్ ఓ గూండాలా ప్రవర్తించారని...మహిళా ఎంపీలపైనా ఆయన దురుసుగా ప్రవర్తించినట్లు బీజేపీ మహిళా ఎంపీలు ఆరోపించారు. మేము శాంతియుతంగా నిరసన తెలుపుతున్న సమయంలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ మావైపు దూసుకొచ్చారు. మాకు అతి దగ్గరగా వచ్చి నినాదాలు చేయడం మొదలుపెట్టాడు. మమ్మల్ని బెదిరిస్తున్నట్టుగా అతని వ్యవహరించిన తీరు మాకు చాలా ఇబ్బంది కలిగించింది. ముఖ్యంగా మహిళా ఎంపీల దగ్గర రాహుల్ ప్రవర్తించిన తీరు ఏమాత్రం ఆమోదయోగ్యం కాదు. ఓ ఎంపీ..తోటి సభ్యుల పట్ల గౌరవంగా ఉండాలి. ఈరోజు ఇలా జరగడం చాలా బాధాకరంగా ఉంది. అందుకే ఈవిషయంపై రాజ్యసభ చైర్మన్‌కు ఫిర్యాదు చేశామని బీజేపీ ఎంపీలు తెలిపారు.నాగాలాండ్ ఎంపీ ఫాంగ్నాన్ చివరిరోజు రాజ్యసభలో కన్నీరు పెట్టుకుని రాహుల్ తీరుపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఓ మహిళా సభ్యురాలి పట్ల అభ్యంతరంగా ప్రవర్తించడం దారుణమంటూ ఆవేదన వ్యక్తం చేయడంతో రాజ్యసభ చైర్మన్ ఆమెను సముదాయిస్తూ..జరిగిన ఘటనను పరిశీన లో ఉందని తెలిపారు. మరోవైపు చివరిరోజు కూడా కాంగ్రెస్ ఆందోళనలు కొనసాగాయి. కేంద్ర హోంమంత్రి అమిత్ షా రాజీనామా చేయాలని, అంబేద్కర్‌పై చేసిన వ్యాఖ్యలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం విపక్ష సభ్యులు విజయ్ చౌక్ నుండి పార్లమెంటుకు పాదయాత్ర చేశారు. అయితే పార్లమెంట్ ప్రాంగణంలోనే పోటాపోటీ నిరసనలు చేపట్టడమే కాకుండా ఒకర్నొకరు గాయాలు చేసుకునే రీతిలో ఎంపీలు ఘర్షణకు దిగడం దేశవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశమైంది.దేశ అత్యున్నత చట్ట సభ అయిన పార్లమెంట్ ప్రాంగణంలో హుందాగా ఉండాల్సిన ఎంపీలు ఇలా పరస్పరం తోసుకుని గాయాలపాలవ్వడంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. దీనిపై సీరియస్ అయిన లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇకపై పార్లమెంట్ గేట్ వద్ద ఎలాంటి నిరసనలు చేయకుండా నిషేధాజ్ఞలు జారీ చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎంపీలను లోక్‌సభ స్పీకర్ హెచ్చరించారు.

**లోక్‌సభ ఉత్పాదకత 58 శాతం..**

మొత్తంగా ఈ సమావేశాల్లో లోక్‌సభ ఉత్పాదకత 58 శాతంగా ఉన్నట్లు సెక్రటేరియట్ వెల్లడించింది. రాజ్యసభలోనూ కార్యకలాపాలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. అంబేద్కర్‌ను కేంద్ర మంత్రి అమిత్ షా అవమానించారని ఆరోపిస్తూ విపక్షాలు తీవ్ర ఆందోళన చేపట్టాయి. శుక్రవారం సభ ప్రారంభమైన కొద్దిసేపటికే చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ సభను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. మొత్తంగా ఈ సెషన్‌లో రాజ్యసభ 43గంటల 27నిమిషాలు పనిచేసిందని, తన నిర్దిష్ట పనిగంటల్లో 40.03% మాత్రమేనని పేర్కొన్నారు.





-పోతుగంటి వెంకట రమణగుప్త,
బ్యూరోచీఫ్
(వీ3 న్యూస్, విశ్వంభర దిన పత్రిక)
సెల్: 6304475133

# పారా లీగల్ వాలంటీర్లు వారధిలా ఉండాలి

**జిల్లా ప్రధాన న్యాయమూర్తి శశిధర్ రెడ్డి**




**విశ్వంభర, రంగారెడ్డి జిల్లా:** ప్యారా లీగల్ వాలంటీర్లు ప్రజలకి, న్యాయ సేవ సంస్థ కి వారధిలా ఉండాలి అని రంగా రెడ్డి జిల్లా ప్రధాన న్యాయమూర్తి , రంగారెడ్డి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ శశిధర్ రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ వారి ఆదేశాల మేరకు గురువారం.. రంగారెడ్డి జిల్లా న్యాయ సేవ సంస్థ ఆధ్వర్యంలో కొత్తగా ఎంపికచేయబడిన ప్యారా లీగల్ వాలంటీర్లకు, ఇదివరకు ఉన్న ప్యారా లీగల్ వాలంటీర్లకు నిర్వహించిన శిక్షణ శిబిరానికి శశిధర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శశిధర్ రెడ్డి మాట్లాడుతూ పారా-లీగల్ వాలంటీర్లు ప్రజలకు, ముఖ్యంగా సమాజంలోని బలహీన వర్గాలకు చెందిన వారికి, మానవ గౌరవంతో జీవించే హక్కు గురించి తెలుసుకునేలా, రాజ్యాంగబద్ధంగా , చట్టబద్ధంగా హామీ ఇవ్వబడిన అన్ని హక్కులతో పాటు విధులు బాధ్యతలను నిర్వర్తించేలా ప్రజలకు అవగాహన కల్పించాలి అన్నారు. పారా-లీగల్ వాలంటీర్లు వివాదాలు, సమస్యలు, సమస్యల స్వభావాన్ని గురించి ప్రజలకు అవగాహన కల్పించాలి. ఈ సంస్థల ద్వారా వివాదం, సమస్య, సమస్యలను పరిష్కరించేందుకు వారు మండల న్యాయ సేవ సంస్థ, జిల్లా న్యాయ సేవ సంస్థ, రాష్ట్ర న్యాయ సేవ సంస్థ ని సంప్రదించవచ్చని ప్రజలకి తెలియజేయాలి. స్థానికంగా ఉన్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు వాలంటీర్లకు సమాచారం అందినప్పుడు, వాలంటీర్లు పోలీసు స్టేషన్ ను సందర్శించి, అవసరమైతే, సమీపంలోని న్యాయ సేవల సంస్థల ద్వారా అరెస్టయిన వ్యక్తికి న్యాయ సహాయం అందేలా చూడాలి. ప్యారా లీగల్ వాలంటీర్లు ప్రజలకి న్యాయ సేవ సంస్థ కి వారధిలా ఉండాలి అన్నారు. మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జీ పట్టాభి రామ రావు మాట్లాడుతూ" వాలంటీర్లు జిల్లా న్యాయ సేవ సంస్థ, రాష్ట్ర న్యాయ సేవ సంస్థ నుండి సరైన అధికారంతో జైళ్లు, లాక్-అప్లు, సైకియాట్రిక్ హాస్పిటల్స్, చిల్డ్రన్స్ చేత శిక్షణ ఇప్పించారు. శిక్షణా శిబిరాన్ని అందరు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి / సీనియర్ సివిల్ జడ్జి . శ్రీదేవి మాట్లాడుతూ"పారా లీగల్ వాలంటీర్లు చట్ట ఉల్లంఘనలపై నిరంతరం నిఘా ఉంచాలి. స్థానికంగా పీ ఎల్ వి ఒక వ్యక్తి అరెస్టు గురించి సమాచారం అందుకున్నప్పుడు పీ ఎల్ వి పోలీస్ స్టేషన్ ను సందర్శించి, అరెస్టు చేయబడినట్లు నిర్ధారించుకోవాలి అవసరమైతే, సమీపంలోని న్యాయ సేవల ద్వారా వ్యక్తి న్యాయ సహాయాన్ని అందించాలి. శిక్షణ కార్యక్రమానికి చర్లపల్లి జైలు , చంచల్గూడ జైలు న చంచల్గూడ మహిళా జైలు నుండి ఖైదీలని ప్యారా లీగల్ వాలంటీర్స్ ని ఎంపిక చేసారు. కార్యక్రమం లో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ శ్రీ కొండల్ రెడ్డి , న్యాయవాదులు రవి, రోజా రమణి, విఙ్ఞేశ్వర వర్మ రాథోడ్, సోషల్ వర్కర్లు శ్యామల దేవి, అమిత రాణి పాల్గొన్నారు.

## జిల్లాలో విస్తృతంగా పర్యటించిన జిల్లా కలెక్టర్



**విశ్వంభర, మహబూబాబాద్ :** జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ పాఠశాలలు, వసతి గృహాలు, మోడల్ స్కూల్స్, కలవల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల కేసముద్రం, ఇందిరమ్మ ఇండ్ల సర్వే కేసముద్రం మండలం, పెనుగొండ, బోడ మచ్చ తండాలలో శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ మాట్లాడుతూ జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల సర్వేను క్షేత్రస్థాయిలో పక్కగా నిర్వహించాలని అన్నారు, కేసముద్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆకస్మికంగా తనిఖీ చేసి హాజరు పట్టిక మందుల స్టాక్ వివరాలు ఇన్ పేషెంట్ ఔట్ పేషెంట్ వివరాలను అడిగి తెలుసుకున్నారు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఎలాంటి అనారోగ్య సమస్యలు రాకుండా ప్రతి రోజు షెడ్యూలు ప్రకారము వైద్య పరీక్షలు, శిబిరాలు నిర్వహించి మందులు పంపిణీ చేయాలని సూచించారు. సాధారణ ప్రసవాలు ప్రోత్సహించాలన్నారు, ఆయన వెంట జిల్లా విద్యాశాఖ అధికారి ఎ.రవీందర్ రెడ్డి, సంబధిత శాఖల అధికారులు ఉన్నారు.

## ఇందిరమ్మ సర్వేకు ప్రజలు సహకరించాలి

**కౌన్సిలర్ రాధమ్మ వెంకటయ్య**



**విశ్వంభర, ఆమనగల్లు :** అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇల్లు అందించేందుకు చేపట్టుతున్న సర్వేకు ప్రజలు సహకరించాలని కౌన్సిలర్ కమటం రాధమ్మ వెంకటయ్య కోరారు. శుక్రవారం ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని 8వ వార్డు సంకటోనిపల్లి గ్రామంలో జరుగుతున్న సర్వేను ఆమె పరిశీలించారు. ఇల్లు లేని వారికి నివాసం కల్పించేందుకు సర్వే చేపడుతున్నట్లు దరఖాస్తుదారులు సంబంధిత పత్రాలతో అందుబాటులో ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారి ఎల్లయ్య, గ్రామ వాసులు దావ శ్రీను, లక్ష్మమ్మ, మహబూబా, లక్ష్మీ నర్సింహమ్మ మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## అవోప ఉపాధ్యక్షుడిగా వీర బొమ్మ రమేష్



**విశ్వంభర, హైదరాబాద్ :** ఆర్యవైశ్య అవోప (అఫీషియల్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్) తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా వీర బొమ్మ రమేష్ నియామకం అయ్యారు. ఈ సందర్భంగా అవోప రాష్ట్ర అధ్యక్షుడు శంకర్ చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నాడు. ఆయన మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వాసవి సేవా కేంద్రం అధ్యక్షుడు రమేష్, సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ అరెస్టులను ఖండిస్తున్నాం

**సిపిఐ మండల కార్యదర్శి ఊట్కూరి నర్సింహ**



**విశ్వంభర, రామన్నపేట :** ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ రాష్ట్ర కమిటీలు ఇచ్చిన పిలుపు మేరకు విద్యార్థుల రీఇంబర్స్ మెంట్, ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలని, జాతీయ నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలని అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చారు. అసెంబ్లీ ముట్టడికి వెళ్లకుండా ముందస్తుగానే ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్, సిపిఐ నాయకులను ఉదయం 7 గంటలకే అరెస్ట్ చేయడాన్ని ఖండిస్తున్నామని యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండల సిపిఐ మండల కార్యదర్శి ఊట్కూరి నర్సింహ్మ, ఏఐవైఎఫ్ మాజీ జిల్లా కార్యదర్శి ఎర్ర రమేష్ గౌడ్ లు అన్నారు. అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని, విద్యార్థుల ఫీజు రీఇంబర్స్మెంట్ విడుదల చేసేవరకు పోరాటం ఆగదని వారు అన్నారు. ఈ శీతాకాల అసెంబ్లీ సమావేశాలలోనే బడ్జెట్ కేటాయించి, వెంటనే విద్యార్థుల ఫీజు బకాయిలను విడుదల చేయాలని ఉట్కూరి నర్సింహ, ఎర్ర రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అరెస్టయిన వారిలో ఊట్కూరి భగవంత, ఊట్కూరి కృష్ణ, రచ్చ యాదగిరి, శివరాత్రి సమ్మయ్య తదితరులు ఉన్నారు.

## హాస్టల్‌ను తనిఖీ చేసిన అడిషనల్ కలెక్టర్



**విశ్వంభర, నెల్లికుదురు:** మానుకోట జిల్లా నెల్లికుదురు మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర హాస్టల్, కస్తూరిబా గాంధీ గురుకుల విద్యాలయం, ఇందిరమ్మ ఇళ్ల సర్వే స్థానిక సంస్థల అదన కలెక్టర్ లెనిన్ వత్సల్ టెప్పో శుక్రవారం విసిట్ చేశారు. బాలుర వసతి గృహంలో బెడ్స్,మూత్రశాలలు, వంటశాలను, కేజీబీవీ లో కిచెన్ స్టోర్ స్టాక్ రిజిస్టర్ లను పరిశీలించారు. ఈ సందర్భంగా మెనూ ప్రకారం నాణ్యతతో వంటలు చేయాలని టెప్పో సూచించారు.నెల్లికుదురు ఎస్సీ కాలనీలో నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇండ్ల ఆప్ సర్వేను పరిశీలించారు. కార్యక్రమంలో తాసిల్దార్ కోని చింతల రాజు, ఎంపీడీవో బాలరాజు, ఎం పి ఓ బానోతు పద్మ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీరామగిరిలో ఎస్సీ అవగాహన సదస్సు




**విశ్వంభర, నెల్లికుదురు :** జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నెల్లికుదురు మండలం శ్రీరామగిరిలో జిల్లా షెడ్యూల్డ్ కులస్తులకు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా అమలవుతున్న పథకాలపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. కార్పొరేషన్ ఇడి కె శ్రీనివాసరావు పాల్గొని ప్రధాన మంత్రి అనసుచిత్ జాతి అభ్యుదయ యోజన పథకం (పిఎం అజయ్), బ్యాంక్ అనుసంధానం ద్వారా సబ్సిడీ ఋణముల పథకములు, స్కిల్ డెవలప్మెంట్ ట్రైనింగ్ ప్రోగ్రామ్‌లతో సహా వివిధ పథకాలపై వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బాలరాజు,ఏఈవో సురేష్,అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు మాదరి ప్రశాంత్ స్థానిక ఎస్సీ నాయకులు,సంద శ్రీనివాస్, అరపెల్లి రామచంద్రు, బూర్గుల మోష, కొమ్ము శ్రీనివాస్, సతీష్, స్వామి, సాంబయ్య,వెంకటయ్య,రాములు పాల్గొన్నారు.

## ఘనంగా సునీత జగదీష్ రెడ్డి జన్మదిన వేడుకలు



**విశ్వంభర, సూర్యాపేట్ :** మాజీమంత్రి, స్థానిక ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి గారి సతీమణి, ఎస్ ఫౌండేషన్ ఛైర్పర్సన్ గుంటకండ్ల సునీత జగదీష్ రెడ్డి జన్మదిన వేడుకలు సూర్యాపేట లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో సూర్యాపేట మండల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొని కేక్ కట్ చేసి సంబురంగా జన్మదిన వేడుకలు జరిపారు.

## గ్రామాల అభివృద్ధి దేశానికే ఆదర్శం

**కద్దాల్ పంచాయతీకి బీహార్ సర్పంచుల అభినందన**



**విశ్వంభర, కద్దాల్ :** తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పల్లె ప్రగతితో గ్రామాలు ఎంతో అభివృద్ధి చెందాయని, ఆరోగ్యకరంగా మారాయని బీహార్ గ్రామపంచాయతీ ప్రజాప్రతినిధులు అన్నారు. రాజేంద్రనగర్ జాతీయ పంచాయతీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధి సంస్థలో రెండు రోజుల శిక్షణా కార్యక్రమాలలో భాగంగా శుక్రవారం కద్దాల్ మాజీ సర్పంచ్ గూడూరు లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి బీహార్ సర్పంచులతో ఎన్ ఐ ఆర్ డి పి ఆర్ రాజేంద్రనగర్ లో సమావేశమై గత పాలకవర్గంలో పల్లే ప్రగతి ద్వారా చేపట్టిన వివిధ అభివృద్ధి పనుల గురించి వివరించారు. గ్రామాలలో పారిశుద్ధ్య నిర్వహణ, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్వహణ, తడి చెత్త,పొడి చెత్త వేరు విధానం, ఇంకుడు గుంతల నిర్వహణ,పల్లెప్రకృతి వనం, రైతు వేదిక,వైకుంఠధామం నిర్మాణాలు, గ్రామపంచాయతీల సొంత ఆదాయ వనరుల పెంపు మొదలగు అంశాలను వివరించారు.

# చిన్న కాళేశ్వరం నిర్మాణ పనులు పూర్తి చేయాలి



**విశ్వంభర, భూపాలపల్లి:** చిన్న కాళేశ్వరం పంప్ హౌస్ హెడ్ రెగ్యులేటర్ నిర్మాణ పనులను మార్చి వరకు పూర్తి చేయాలని భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం మహదేవ్ పూర్ మండలం బీరసాగర్ వద్ద చిన్న కాళేశ్వరం వద్ద గోదావరి నుండి నీటిని తరలించడానికి 250 మీటర్లు వరకు తరలించడానికి చేపట్టిన పంప్ హౌస్ హెడ్ రెగ్యులేటర్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మార్చి మాసంలో డ్రై రన్ నిర్వహించాల్సి ఉందని పనులల్లో వేగం పెంచాలని మెగా ఇంజినీరింగ్ అధికారు లను ఆదేశించారు. చిన్న కాళేశ్వరం ప్రాజెక్టు పనులు నిర్దేశించిన సమయానికి పూర్తి చేయడం ద్వారా సాగుకు నీరందించడానికి అవకాశం కలుగుతుందని తద్వారా రైతులకు ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాటారం సబ్ కలెక్టర్ మయంక్ సింగ్, ఇరిగేషన్ ఈఈ యాదగిరి, తహసీల్దార్ కృష్ణ, డీఈలు సూర్యప్రకాశ్, ఉపేందర్, మెగా డిజిఎం వైపీ రావు, తదితరులు పాల్గొన్నారు.

## మహాదేవపూర్‌లో కలెక్టర్ పర్యటన



**విశ్వంభర, భూపాలపల్లి:** మహాదేవపూర్ మండలంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పర్యటించారు. కాళేశ్వరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి సిబ్బందితో మాట్లాడారు. ఓపి రిజిస్టర్ పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని ఇన్ పేషెంట్ వార్డు, డ్రగ్ స్టోర్ లను పరిశీలించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పైకప్పు లీకేజి అవుతుందని, మరమ్మత్తులు చేపించాలని సిబ్బంది జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకురాగా వెంటనే సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. సిబ్బంది సమయ పాలన పాటిస్తూ నిత్యం అందుబాటులో ఉండాలని ఆదేశించారు. అనంతరం మహాదేవపూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. ఆశ్రమ పాఠశాలలోని వంటగది, స్టోర్ రూమ్, డైనింగ్ రూమ్ లను తనిఖీ చేశారు. నూతన డైట్ మెనూ పరిశీలించి మెనూ ప్రకారం అల్పాహారం భోజనం అందిస్తున్నారా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, తహసిల్దార్ కృష్ణ, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, డాక్టర్ సుస్మిత, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సరిత తదితరులు పాల్గొన్నారు.

## గ్రామీణ క్రీడాకారుల ప్రతిభ గుర్తించేందుకే తైక్వాండో పోటీలు

**- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి**




**విశ్వంభర, కల్వకుర్తి :** కల్వకుర్తి ఉన్నత పాఠశాలలో సీఎం కప్ ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా తైక్వాండో టోర్నమెంట్ కం- సెలక్షన్ పోటీలను, ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా ఒలంపిక్ బీప్ ప్యాట్రన్, ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా తైక్వాండో ప్రెసిడెంట్, కల్వకుర్తి స్థానిక శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతంలోని క్రీడాకారులను ప్రోత్సహిస్తూ వారి ప్రతిభను వెలికి తీసే కార్యక్రమంలో భాగంగా ప్రతి ఏటా ఈ సిఎం కప్పును నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అందులో భాగంగా గ్రామీణ స్థాయి నుండి మండల స్థాయి నుండి నియోజకవర్గ స్థాయి. నుండి జిల్లా స్థాయి వరకు ప్రతిభ ఉన్న క్రీడాకారులను వెలికి తీసి వారికి క్రీడలపరంగా, ఆర్థికంగా ప్రోత్సహిస్తామని తెలియజేశారు. ఉమ్మడి జిల్లా స్థాయిలో సెలక్షన్ అయిన క్రీడాకారులకు ఈనెల 31, 1, 2 న రాష్ట్రస్థాయి టోర్నమెంట్ నిర్వహించడం జరుగుతుందన్నారు.

## వజ్రోత్సవాలకు తలకొండపల్లి రైతులు

**విశ్వంభర, తలకొండపల్లి :** మండలం లోని రైతులు, నాయకులు, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో జరుగుతున్న వజ్రోత్సవ వేడుకలు కిసాన్ మేళ లో పాల్గొనడానికి తలకొండపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దోకురి ప్రభాకర్ రెడ్డి నాయకత్వంలో బయలుదేరి వెళ్లారు. ఈ కార్యక్రమంలో డిసిసి ఉపాధ్యక్షులు భగవాన్ రెడ్డి, మాజీ సర్పంచ్ లు పయ్యావుల రమేష్ యాదవ్, మాజీ ఎంపిటిసి రాములు, మండల కిసాన్ సెల్ అధ్యక్షులు టి విష్ణు గౌడ్, రేణు రెడ్డి, నాగేష్, డి శ్రీనివాసులు, ఎస్ రాము, ఎం కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.



## గరుడ వాహనాన్ని బహూకరణ

**రాజన్న సిరిసిల్ల జిల్లా :** తంగళ్ళపల్లి మండల కేంద్రంలో అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడైన తంగళ్ళపల్లి శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం కు తంగళ్ళపల్లి వాస్తవ్యులైన ప్రస్తుతం సిరిసిల్లలో నివాసముంటున్న కామినేని నీలి రవీందర్ దంపతులు కామినేని శ్రీధర్ దంపతులు లక్ష్మీనరసింహ దేవస్థానానికి గరుడ వాహనాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానానికి మా వంతుగా గరుడ వాహనం సమర్పించడం జరిగిందని గరుడ వాహనం అందించడం మాకు దేవుడిచ్చిన పుణ్యం ఫలంగా ఏ జన్మలో చేసుకున్న పుణ్యమా అని ఈ సందర్భంగా స్వామి మాకు ఈ అవకాశం కల్పించాలని లక్ష్మీనరసింహస్వామి దయవల్ల మా కుటుంబ ఆయురారోగ్యాలతో పిల్లాపాపలతో ఉన్నత స్థాయిలో బతుకుతున్నామని ఇదంతా లక్ష్మీ నరసింహ స్వామి కటాక్షమని ఈ సందర్భంగా తెలియజేశారు.



## గుడి నిర్మాణానికి సహాయం



**విశ్వంభర, రాజన్న సిరిసిల్ల జిల్లా :** గోపాలపల్లి గ్రామంలో మాతమ్మ గుడి నిర్మాణం జరుగుతుండగా గుడి నిర్మాణం కొరకు జిల్లా యాదవ సంఘం అధ్యక్షులు మీరాల శ్రీనివాస్ యాదవ్ గ్రానైట్ , ద్వారమును అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామంలో నిర్మాణం జరుగుతున్న మాతమ్మ గుడికి అమ్మ దయవల్ల నా వంతు సహాయంగా గుడికి గ్రానైట్, ద్వారము అందచేయడం జరిగిందని తెలియజేస్తూ గ్రామంలోని ప్రజలు మాతమ్మ దయవల్ల పిల్లాపాపలతో సుఖ సంతోషాలతో ఉండాలని మాతమ్మ తల్లి దయ ఎప్పటికి ఉండాలని ఈ సందర్భంగా కోరుకోవడం జరిగిందని తెలియజేశారు. గుడికి సహాయం అందించిన యాదవ జిల్లా అధ్యక్షులు మీరాల భాస్కర్ యాదవ్ కు గ్రామంలో ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## సెంట్రల్ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు




**విశ్వంభర, సంగారెడ్డి :** లక్డారం గ్రామంలో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ఎన్ ఎస్ఎస్ అరే సెల్ ఆధ్వర్యంలో హెల్త్ క్యాంప్ ని స్థానిక ప్రభుత్వ జిల్లా పరిషత్ హై స్కూల్ ఆవరణలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పటాన్ చేరులోని అమేధా హాస్పిటల్స్ డాక్టర్స్ రవి మరియు రాజేంద్ర లు గ్రామంలోని వృద్ధులను, అస్వస్థత లో ఉన్నటువంటి మహిళలను, స్కూల్ విద్యార్థులను ఎన్ఎస్ఎస్ వాలంటీర్లను పరీక్ష నిర్వహించి మందులను సరఫరా చేశారు. అదేవిధంగా సాత్విక్ రూరల్ అండ్ యూత్ ఇంటిగ్రేటెడ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రెగ్నెంట్ మహిళలకు రక్తహీనత ఉన్నటువంటి విద్యార్థులకు మరియు వృద్ధులకు పోషక ఆహారాన్ని ఉచితంగా సరఫరా చేశారు.

## మంత్రి చొరవతోనే భూ కుంభకోణం



**విశ్వంభర, జయశంకర్ భూపాలపల్లి :** పలిమల మండలంలో భూ కుంభకోణం మంత్రి అండ దండలతో కొనసాగిందని పెద్దపెల్లి జిల్లా బిజెపి అధ్యక్షుడు సునీల్ రెడ్డి ఆరోపించారు. శుక్రవారం పలిమెల మండల కేంద్రంలో ని అక్రమంగా సిమెంట్ కంపెనీకి రిజిస్ట్రేషన్ అయిన భూముల వద్దకు వెళ్లి రైతులతో మాట్లాడారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ 2008 సంవత్సరంలో అప్పుడు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని శ్రీధర్ బాబు ఆ సమయంలో సైతం మంత్రిగా పనిచేశారని అదే సమయంలో తన అనుచరులకు ఈ పట్టాలు చేయించారని అన్నారు. ఎన్నికల సమయంలో ఈ ప్రాంత రైతులకు పట్టాలు చేయిస్తారని చెప్పి అనంతరం ఈ ప్రాంత రైతులను పట్టించుకోకపోవడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. ఆ సమయంలో మంత్రిగా ఉన్నప్పుడు శ్రీధర్ బాబు రైతులకు జేసీతో సర్వే చేయించారని తెలిపారు.

## వైభవంగా సరస్వతి అమ్మవారి శోభాయాత్ర



**విశ్వంభర, భూపాలపల్లి జిల్లా :** ప్రముఖ పుణ్యక్షేత్రం కాళేశ్వరం లో సరస్వతి అమ్మవారి శోభాయాత్ర వైభవంగా జరిగింది. ఢిల్లీకి చెందిన సరస్వతి అమ్మవారి భక్తులు అనాది శర్మ, వికాస్ కుమార్ లు సరస్వతి అమ్మవారి మీద భక్తితో మహా పుణ్యక్షేత్రం కాళేశ్వరం లో సరస్వతి అమ్మవారి పూజలు జరిపించి మహా వైభవంగా శోభాయాత్ర నిర్వహించారు. ఈ శోభాయాత్రలో కాలేశ్వరం గ్రామస్తులు ప్రజలు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## బంజారా నాట్య ప్రదర్శనకి విరాళం



**విశ్వాంభర, దోమ :** మండల పరిధిలోని దిర్సంపల్లి తాండలో జరుగుతున్న సేవాలాల్ మహారాజ్ మరియమ్మ మాత బంజారా నాట్య ప్రదర్శన కార్యక్రమంలో బహుజన ముక్తి పార్టీ జిల్లా అధ్యక్షులు పాత్లవత్ ఘాత్యనాయక్ పాల్గొన్నారు. అనంతరం బహుజన నాట్యమండలి సభ్యులకు 25 వేల రూపాయల సహాయం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బహుజన్ ముక్తి పార్టి ఉపాధ్యక్షులు హరి నాయక్, బహుజన ముక్తి పార్టీ నాయకులు రాజా రెడ్డి, నిర్మల్, విజెందర్ రెడ్డి, రవీందర్ నాయక్, రాజన్న, అరుణ్, గణేష్, ఆనంద్, వినోద్, రవి, విష్ణు పాల్గొన్నారు.

# రామన్నపేటలో అభివృద్ధి పనులకు నిధులు

**ఎమ్మెల్యే వీరేశం**



**విశ్వంభర, రామన్నపేట:** మండలంలోని పిల్లాయిపల్లి, ధర్మారెడ్డిపల్లి కాలువలు పూర్తిస్థాయిలో పనులు చేయించడం కోసం ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి కాలువలకు 224 కోట్లు నిధులు మంజూరు చేయించిన నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశంకు ప్రత్యేకమైన కృతజ్ఞతలు తెలుపుతున్నామని తెలంగాణ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకులు రాపోలు నరసింహ అన్నారు. గత ప్రభుత్వంలో పిల్లాయిపల్లి, ధర్మారెడ్డిపల్లి కాలువలకు 350 కోట్లు నిధులు మంజూరు చేశామని, కాలువలు త్వరితగతిన పూర్తి చేసి రైతులకు సాగునీరు అందిస్తామని, విపరీతమైన ఆర్భాటాలు చేసి, శిలాఫలకాలు వేసుకొని శిలాఫలకాలకే ఆగిపోయింది. కానీ, కాలువలు పూర్తి కాలేదు. అందుకే రైతులు గత ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పారని అన్నారు. గత ప్రభుత్వంలో జరిగిన విషయం పునరావృత్తం కాకుండా ప్రస్తుత ఎమ్మెల్యే పూర్తిస్థాయిలో ఈ కాలువల మీద దృష్టి సారించి, కాలువలు పూర్తయ్యే దాకా పట్టు వదలకుండా, కాలువల నిర్మాణం పూర్తిచేసి ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న రైతులకు సాగునీరు అందించాలని కోరుతున్నామని అన్నారు.

# విత్తన శుద్ధిపై అవగాహన సదస్సు



**రాజన్న సిరిసిల్ల జిల్లా :** తంగళ్ళపల్లి మండలం జిల్లెల్ల ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం వారి బాబు జగ్జీవన్ రామ్ వ్యవసాయ కళాశాల యొక్క ఆధ్వర్యంలో విత్తన శుద్ధి పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దత్తత గ్రామమైన రాళ్ల పేటలో శుక్రవారం రోజున వ్యవసాయ కళాశాల ఆచార్యులు రైతులకు కూనారం సన్మానాలు అనే వరి రకం విత్తనాల ను పంపిణీ చేశారు. అలాగే వరిలో విత్తన శుద్ధి పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ రాజేందర్ మాట్లాడుతూ రైతులకు విత్తన శుద్ధి ప్రాముఖ్యత వివరిస్తూ రైతులకు స్వయంగా విత్తన శుద్ధి ఎలా చేసుకోవాలో నేర్పించారు కిలో విత్తనానికి మూడు గ్రాముల కార్బెండజం 50శాతం ముందును కలిపి 24 గంటల తర్వాత నారు ముడిలో చల్లుకోవాలని దంప నారు ముళ్ళకైతే లీటర్ నీటికి ఒక గ్రామం కార్బ%శీ%. జిమ్ 50శాతం ముందును కలిపి.ఆ ద్రావణంలో 24 గంటలు విత్తనాలు నానబెట్టిన 24 గంటలు మండే కట్టి మొలకెత్తిన విత్తనాన్ని దంప నారు మడిలో చల్లుకోవాలని తెలిపారు విత్తనాలు నానబెట్టడానికి లీటరు మందు మీరు సరిపోతుందని కార్బన్డిజం 25శాతం, మామ్ కొజెబ్ 50 శాతం మిశ్రమ సిలింద్ర నాసిని నీ వాడితే రెండు గ్రాములు కిలో విత్తనానికి లీటర్ నీటికి చొప్పున వాడుకోవాలని సూచించారు.

# న్యూట్రిషన్ సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలి



**విశ్వంభర, భూపాలపల్లి :** న్యూట్రిషన్ సమస్య పరిష్కారానికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. శుక్రవారం ఐడిఓసి కార్యాలయపు కాన్ఫరెన్స్ హాలులో మహిళా శిశు సంక్షేమ, విద్యా, వైద్య, గ్రామీణాభివృద్ధి, పౌర సరఫరాలు, వ్యవసాయ, ఉద్యానవన శాఖల అధికారులతో జిల్లా స్థాయి న్యూట్రిషన్ కమిటి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పిల్లలు, గర్భిణీ స్త్రీలు, పాలిచ్చే తల్లుల ఆరోగ్య పరిస్థితులు, పోషకాహార లోపాలు, వాటి పరిష్కారాలపై ప్రత్యేక పర్యవేక్షణ చేయాలన్నారు. చిన్నారుల, గర్భిణీల, బాలింతల ఆరోగ్య సంరక్షణ కు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అన్నారు. నిరంతర పర్యవేక్షణ, సమాచార సేకరణను కొనసాగించాలని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో సంక్షేమ అధికారి చిన్నయ్య, వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ మధుసూదన్, విద్యాశాఖ అధికారి రాజేందర్, వ్యవసాయ అధికారి విజయభాస్కర్, డిఆర్డీఓ నరేష్, సిపిఓ బాబురావు, ఆర్ డబ్ల్యూ ఎస్ ఈ ఈ నిర్మల, ఆర్డీవో మంగీలాల్, పోషణ అభియాన్ జిల్లా కో ఆర్డినేటర్ యోచన తదితరులు పాల్గొన్నారు.

# హెూం మంత్రి అమిత్ షా వ్యాఖ్యలు ఖండిస్తున్నాం

**కే ఎల్ ఆర్ దేప భాస్కర్ రెడ్డి**



**విశ్వంభర, మహేశ్వరం:** తుక్కుగూడ మున్సిపాలిటీ లోని అంబేద్కర్ విగ్రహానికి నివాళులు అర్పించి అమిత్ షా చేసిన వాక్యాలు వెంటనే వెనక్కి తీసుకోవాలని మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కిచ్చన్న గారి లక్ష్మారెడ్డి, మహేశ్వరం నియోజకవర్గం సీనియర్ కాంగ్రెస్ నాయకులు దేప భాస్కర్ రెడ్డి నిరసన వ్యక్తం చేసారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.హెూం మంత్రి అమిత్ షా వ్యాఖ్యలు ఖండిస్తున్నామని భారత పార్లమెంట్ లో రాజ్యాంగ వజ్రోత్సవాలు జరుపుకుంటున్న సదస్సులో హెూం మంత్రి అమిత్ షా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి ఆర్ అంబేడ్కర్ పేరు ప్రస్తావించిన ప్రతిపక్షాలను ఉద్దేశిస్తూ అంబేద్కర్, అంబేద్కర్, అంబేద్కర్, అంటూ రాజ్యాంగ నిర్మాత పేరును ఎంపీలు ఎక్కువ సార్లు స్మరించడాన్ని ఆయన వ్యతిరేకించడం, అందుకు బదులుగా రామ నామ జపం చేస్తే మోక్షం లభిస్తుందని అనడం ఆయన కొనసాగుతున్న పదవికి అప్రతిష్ట అని నాగబాబు ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు.

## పేదలకు ఉచితంగా వైద్యాన్ని అందించడమే లక్ష్యం



**విశ్వంభర, కడ్తాల్ :** కడ్తాల్ మండల పరిధిలోని ఎక్వాయిపల్లి గ్రామంలో ఉప్పల చారిట్రబుల్ ట్రస్ట్ మరియు జర్పుల రాధాకృష్ణ మెమోరియల్ ట్రస్ట్, గంప లక్ష్మయ్య గుప్త చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిభిరం డాక్టర్ ఉప్పల అఖిల్, డాక్టర్ ఉప్పల అనిల్, డాక్టర్ భావన ప్రారంభించి స్వయంగా 333 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందుల పంపిణీ చేశారు. వైద్య శిబిరం సందర్శించిన అనంతరం మహాత్మా గాంధీజి కి పుల మాలలు వేసిన జిల్లా డైరెక్టర్ చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా, కడ్తాల మాజీ జెడ్పిటిసి జర్పుల దశరథ్ నాయక్, రైతు సమన్వయ కమిటీ అధ్యక్షుడు జోగు వీరయ్య మాట్లాడుతూ వైద్యం కోసం పట్టణాలకు వెళ్లకుండా మా గ్రామంలో శిబిరాన్ని ఏర్పాటు చేసినందుకు గ్రామస్థులు ఉప్పల వెంకటేష్, దశరథ్ నాయక్ కు ధన్యవాదాలు తెలిపారు . ఈ కార్యక్రమంలో ముత్యాలు, సత్తయ్య, బిక్షపతి, చంద్రయ్య, సాయిలు, వెంకటరెడ్డి, జంగయ్య, నర్సింహ, వెంకటయ్య, సత్యనరి, శేకర్, జగదీష్, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## నేడు తెలంగాణ ఆత్మ గౌరవ సభ

**విశ్వంభర, రామన్నపేట:** హైదరాబాద్ బషీర్ బాగ్ లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న కళాకారులు, కవులు, మేధావులు, ఉద్యమ నాయకులు నేడు తెలంగాణ ఆత్మగౌరవ సభ కార్యక్రమం జరిగింది. తెలంగాణలో ఉద్యమం కోసం పోరాడిన వారి సంక్షేమం కోసం బోర్డ్ ఏర్పాటు చేయుట కోసం తెలంగాణ ఉద్యమ కళాకారుల ఆత్మగౌరవ సభ కోసం యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండలంలోని ప్రజా కళాకారులందరూ, తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న తొలిదశ, మలిదశ ఉద్యమకారులు, కళాకారులు ప్రతి ఒక్కరూ రేపు జరగబోయే సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే తెలంగాణ ఉద్యమకారుల ఆత్మ గౌరవ సభలో పాల్గొని విజయవంతం చేయవలసిందిగా తెలంగాణ ఉద్యమ నాయకులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

**చైర్మన్ రాంపాల్ వైస్ చైర్మన్ దుర్గయ్య**



**విశ్వంభర, ఆమనగల్లు :** ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని 178వ బూత్ కమిటీ బిజెపి అధ్యక్షునిగా బైకని అశోక్ యాదవ్, బూత్ సెక్రెటరీ గా సముద్రాల వెంకటేష్, మీడియా కన్వీనర్ గా బంటీ, మరియు బూత్ లెవెల్ ఏజెంట్ గా వినయ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు ఈ సందర్భంగా ఎన్నికైన కమిటీకి రాంపాల్ నాయక్ (చైర్మన్), దుర్గయ్య(వైస్ చైర్మన్), బైకని శ్రీశైలం, శ్రీకాంత్ సింగ్ (కౌన్సిలర్) శుభాకాంక్షలు తెలియజేశారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో జనగల గిరి, గంజి శీను, పున్న శ్యామ్, నారాయణ, బైకని శేఖర్, జగదీశ్వర చారి, పెద్దయ్య, తదితరులు పాల్గొన్నారు

## సీఎం కప్ జిల్లా స్థాయి పోటీలు



**విశ్వంభర, మహేశ్వరం:** తుక్కుగూడలో సీఎం కప్ జిల్లా స్థాయి పోటీలు నిర్వహించారు. ఈ యొక్క కార్యక్రమంలో ఖో ఖో ఫైనల్ మ్యాచ్ తుక్కుగూడ వర్సెస్ సరూర్నగర్ జట్లు రావడం జరిగాయి. ఆ యొక్క ఫైనల్ మ్యాచ్ కి ముఖ్య అతిథిగా తుక్కుగూడ మున్సిపల్ చైర్ పర్సన్ బరిగెల హేమలత రాజు గౌడ్ పాల్గొన్నారు. ఫైనల్ మ్యాచ్ లో విజేతగా నిలిచిన మహేశ్వరం జట్టు మొదటి బహుమతి గెలుపొందారు, ద్వితీయ బహుమతి సరూర్నగర్ జుట్టు రావడం జరిగింది. వారికి చైర్పర్సన్ చేతుల మీదగా బహుమతులు గెలుపొందిన జట్లు కు అందజేశారు . ఈ కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ వైస్ చైర్మన్ భవాని వెంకటరెడ్డి, కౌన్సిలర్స్ జపాల భావన సుధాకర్, రాజమోని రాజు ఈ యొక్క టోర్నమెంట్ ఆర్గనైజర్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మహిళ దారుణ హత్య



**విశ్వంభర, జయశంకర్ భూపాలపల్లి:** కాటారం మండలం లోని అంకుశాపూర్ గ్రామ శివారులో ఓ మహిళ దారుణ హత్యకు గురైంది. వివాహిత సంబంధం కారణంగానే హత్య చేసినట్లు తెలిసింది. స్థానికుల వివరాల ప్రకారం.. భూపాలపల్లి మండలం కమలాపూర్ గ్రామానికి చెందిన కాలువ శైలజ (38) కు అంకుశపూర్ గ్రామానికి చెందిన వ్యక్తితో గత ఐదేళ్లగా వివాహిత సంబంధం నడుస్తుందని, గత కొన్ని రోజులగా వారి మధ్య గొడవలు జరుగుతున్నాయని సమాచారం. ఈ క్రమంలోనే సదరు వ్యక్తి మూడు రోజుల క్రితం శైలజను అడవిలోకి తీసుకెళ్లి హత్య చేశాడు. అనంతరం పోలీసుల ఎదుట లొంగిపోయాడని తెలుస్తుంది. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# కేంద్ర మంత్రి క్షమాపణలు చెప్పాలి

**విశ్వంభర, భూపాలపల్లి:** జిల్లా కేంద్రం లోని అంబేద్కర్ సెంటర్లో ఎస్ఎఫ్ఐ , డివైఎఫ్ఐ, కెవిపిఎస్ ప్రజాసంఘాల జిల్లా కమిటీల ఆధ్వర్యంలో 200మంది విద్యార్థులతో అంబేద్కర్ పై కేంద్ర హెూంశాఖ మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలకు నిరసనగా కార్యక్రమం చేపట్టారు. అనంతరం ఆయా సంఘాల నాయకులు మాట్లాడుతూ పార్లమెంటు సమావేశాలు జరిగిన సందర్భంలో అంబేద్కర్ పై చేసినటువంటి అనుచిత వ్యాఖ్యలకు సంబంధించి కేంద్ర హెూంశాఖ మంత్రి అమిత్ షాను వెంటనే బర్త రఫ్ చేయాలని తక్షణమే ఆయన తన పదవికి రాజీనామా చేయాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు .

**విశ్వంభర, నెల్లికుదురు :** భారతరత్న అంబేద్కర్ పట్ల అనుచిత వ్యాఖ్యలు మాట్లాడారని జెఎంఎం ఆధ్వర్యంలో కేంద్ర హెూమ్ మంత్రి అమిత్ షా దిష్టిబొమ్మను స్థానిక అంబేద్కర్ సెంటర్లో శుక్రవారం దహనం చేశారు. ఈ సందర్భంగా జేఎన్ఎం మండల అధ్యక్షులు కారెం ప్రశాంత్ మాట్లాడుతూ అమిత్ షా మంత్రి పదవికి రాజీనామా చేయాలని లేని పక్షంలో తొలగించాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో బాణాల సంజీవ,మండలి శ్రీకాంత్,ఆసోద ప్రవీణ్,ఆరె ఐలయ్య పాల్గొన్నారు.

**విశ్వంభర, భూపాలపల్లి :** ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు విశారదన్ మహారాజ్ ఆదేశాల మేరకు భూపాలపల్లి జిల్లా కేంద్రం లో ధర్మ సమాజ్ పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి, నల్ల బ్యాడ్జలతో నిరసన తెలియజేసారు. ధర్మ సమాజ్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు చిట్యాల శ్రీనివాస్ మాట్లాడుతూ అగ్రవర్ణాల ఆధిపత్యంలో ఉన్న ప్రతి పార్టీ, ప్రతి సంస్థ అంబేద్కర్ కి, రాజ్యాంగాన్నికి వ్యతిరేకులు అని అమిత్ షా మాటలతో నిర్ధారణ అయిపోయింది. రాజ్యాంగాన్నికి పెను ప్రమాదం మనువాద బీజేపీ పార్టీ. కావున ఈ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం. దేవుడి నామ స్మరణతో అమిత్ షా రాజీనామా చేసి స్వర్గాన్నికి వెళ్లాలని వారు ఎద్దేవా చేశారు. అగ్ర కులాలు రాజకీయాల నుండి శాశ్వతంగా వైదొలిగితే భారత రాజ్యాంగం ద్వారా ధర్మ సమాజ్ పార్టీ భూమ్మీద స్వర్గాన్ని నిర్మిస్తాం అని తెలిపారు.



**విశ్వంభర, రామన్నపేట:** పార్లమెంట్ సమావేశాల్లో కేంద్ర హెూం శాఖ మంత్రి అమిత్ షా ప్రసంగిస్తూ ఈ మధ్యన అంబేద్కర్ అనే పదం ఫ్యాషన్ అయిపోయిందంటూ హేళనగా మాట్లాడుతూ చిన్న చూపుతో అంబేద్కర్ ను అవమానించే విధంగా ప్రసంగించారని, ఆ మాటలను వెంటనే ఉపసంహరించుకొని, బేషరతుగా క్షమాపణలు చెప్పాలని యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండల కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు గాదె శోభారాణి డిమాండ్ చేశారు. అంబేద్కర్ పేరును హేళనగా మాట్లాడడం అంటే భారతదేశాన్ని హేళనగా మాట్లాడడమేనని, అమిత్ షా కళ్ళు అధికార గర్వంతో నెత్తికెక్కాయని విమర్శించారు.



# బైకుల చోరీలకు పాల్పడుతున్న ముఠా అరెస్టు

**రూ.10 లక్షల విలువచేసే 17 బైకులు స్వాధీనం**



**విశ్వంభర, దేవరకొండ :** కొండమల్లేపల్లి, చింతపల్లి, గుడిపల్లి, దేవరకొండ ప్రాంతాలలో వరుస బైక్ దొంగతనాలు జరుగుతున్న నేపథ్యంలో జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవర్ గారి ఆదేశాలతో దేవరకొండ డి.ఎస్.పి గారి నేతృత్వంలో కొండమల్లేపల్లి సిఐ , ఎస్సై వారి టీం ప్రత్యేక బృందంగా ఏర్పడి సాంకేతిక పరిజ్ఞానంతో బైకుల దొంగతనాలకు పాల్పడుతున్న దొంగల ముఠాను గుర్తించారు. ఈరోజు ఉదయం నమ్మదగిన సమాచారం మేరకు వాహనాల తనిఖీలో భాగంగా కొండమల్లేపల్లి చౌరస్తాలో పైన పేర్కొన్న బైక్ దొంగల ముఠాను పట్టుబడి చేసి వారిని విచారించగా కొత్త విషయాలు విషయాలు బయటకు వచ్చాయి, ఇట్టి దొంగలు ముఠాగా ఏర్పడి జల్సా లకు, చెడు అలవాట్లకు బానిసై రాత్రి సమయంలో ఇంటి ముందల ఓపెన్ ఏరియాలలో పార్కు చేసిన బైకులను టార్గెట్ చేసి వారి వద్ద తెచ్చుకున్న నకిలీ తాళం ద్వారా బైకులను దొంగిలించారు, ఇట్టి దొంగలు కొండమల్లేపల్లి , గుడిపల్లి ,దేవరకొండ ,చింతపల్లి మాడుగుల మరియు యాచారం మండలాల పరిధిలో సుమారు 17 బైకులు దొంగిలించారు. ఈ కేసు చేదనలో చాకచక్యంగా వ్యవహరించి నిందితులను పట్టుకున్న కొండమల్లేపల్లి సిఐ ధనుంజయ, ఎస్సైలు రామ్మూర్తి, నరసింహులు, వారి క్రైమ్ సిబ్బంది హేము ఉన్నారు.

## రెగ్యులటరీ పంపు నిర్మాణ పూజలో జిల్లా కలెక్టర్

**విశ్వంభర, మహదేవపూర్:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ శుక్రవారం చిన్న కాళేశ్వరం ప్రాజెక్ట్ విషయమై బీరసాగర్ పంప్ హౌస్ వద్ద లెగ్యులరటీ పంపు నిర్మాణం కోసం జరిగిన ఫౌండేషన్ పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. తదనంతరం కాళేశ్వరం ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్శనలో ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలు, పరిసరాలు పరిశుభ్రత మరియు వైద్య సిబ్బంది విధి నిర్వహణను పరిశీలించారు. తనిఖీలో రోగులకు అందుతున్న వైద్య సేవలు, సమస్యల పట్ల సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. మందుల సరఫరా మరియు ఎమర్జెన్సీ సేవల పై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూఆసుపత్రిలో శుభ్రతను నిరంతరం కొనసాగించాలని పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని సూచించారు. వైద్య సేవలకు వచ్చే ప్రజలకు అవసరమైన అన్ని రకాల మందులు అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు.

## అమీన్‌పూర్ రోడ్డుకు మహర్దశ

రూ.45 కోట్లతో సీసీ రోడ్డు నిర్మాణం



విశ్వంభర, సంగారెడ్డి : పటాన్ చేరు నియోజకవర్గం లోని అమీన్‌పూర్ రోడ్డుకు మహర్దశ చేకూరనున్నదని జన సమితి పటాన్ చేరు నియోజకవర్గ ఇన్చార్జ్ హనుమంత్ రెడ్డి శుక్రవారం రోజు మీడియా సమావేశాన్ని నిర్వహించారు. శాసనమండలిలో అమీన్పూర్ రోడ్డు గురించి ఎమ్మెల్సీ కోదండరాం ప్రస్తావించగా కోమటిరెడ్డి వెంకటరెడ్డి వెంటనే స్పందించి వివరణ ఇస్తూ అమీన్పూర్ ప్రాంతంలో ఐదు కిలోమీటర్ల వరకు సీసీ రోడ్డు నిర్మాణానికి 45 కోట్ల రూపాయలు కేటాయించామని సంక్రాంతి లోగా పనులు ప్రారంభించి మూడు నెలల్లో ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. లింగంపల్లి నుండి అమీన్పూర్ మీదుగా ఉన్న రోడ్డు అధ్వానంగా మారిందని గత పాలకులు పట్టించుకోలేదని కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక జంట నగరాల అభివృద్ధిలో భాగంగా ప్రత్యేక నిధులు కేటాయించడం జరిగిందని తెలిపారు. సంక్రాంతి తర్వాత త్వరలోనే టెండర్లు కేటాయించి పనులు ప్రారంభించి అమీన్పూర్ ప్రజల కష్టాలు తీరుస్తామని అన్నారు.

## వ్యవసాయ విశ్వవిద్యాలయములో వజ్రోత్సవ వేడుకలు



**విశ్వంభర, రాజేంద్ర నగర్ (హైదరాబాద్ ):** అగ్రికల్చర్ టెక్నాలజీ మేనేజిమెంట్ ఏజెన్సీ (ఆత్మ) సహకారంతో తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్ లోని రాజేంద్రనగర్ లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం డిసెంబర్ 20వ తేదీన యూనివర్సిటీ స్పోర్ట్స్ కాంప్లెక్స్ లో డైమండ్ జూబిలీ ఉత్సవాలు (వజ్రోత్సవ వేడుకలు), రైతు సదస్సు ప్రారంబించబడ్డాయి. యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండలం నుండి ఏ.ఈ.ఓ కిరణ్ ఆద్వర్యంలో ఉత్సాహవంతులులైన రైతులు ఈ వేడుకలకు హాజరయ్యారు. ఈ వేడుకలలో పలు స్టాల్స్ ను, రైతులకు ఉపయోగపడే పలు ఆధునిక సాంకేతికతలను ప్రదర్శించారు. హాజరైన శాస్త్రవేత్తలు అధిక దిగుబడులకు రైతులకు పలు సలహాలు, సూచనలు అందించారు.


## సీసీ రోడ్డు పనులు ప్రారంభం



**విశ్వంభర, మహేశ్వరం :** తుక్కుగూడ మున్సిపాలిటీ ఒకటో వార్డు దేవేందర్ నగర్ కాలనీలోసీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. సుమారుగా 20 లక్షల రూపాయలతో 12 రోడ్లకు సంబంధించిన మిగులు రోడ్లను పూర్తి చేసారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తుక్కుగూడ మున్సిపల్ చైర్మన్ బరిగెల హేమలత రాజు గౌడ్ పాల్గొన్నారు. 1వ వార్డు కౌన్సిలర్ బోధ యాదగిరి రెడ్డి, కౌన్సిలర్ ఎరుకల శివకుమార్ గౌడ్ , కాలనీ పెద్దలు, యువకులు పాల్గొన్నారు. చైర్మన్ మాట్లాడుతూ తుక్కుగూడ మున్సిపాలిటీ ప్రతి ఒక్క వార్డులో అభివృద్ధి చేస్తామని చెప్పడం జరిగింది రోడ్డు పనులకు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు.

## రామానుజాపురంలో పడిపూజ

**హాజరైన మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్**



**విశ్వంభర, నెల్లికుదురు :** మండలంలోని రామానుజపురంలో మాజీ ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షులు బత్తిని అనిల్ గౌడ్ స్వామి-క్రిష్ణవేణి దంపతులు తమ స్వగృహంలో అయ్యప్ప స్వామిమహా పడిపూజ శుక్రవారం ప్రముఖ గురుస్వామి రేణి కుంట్ల శివశర్మ స్వామి మంత్రోచ్చరణల మధ్య అత్యంత భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. దీనికి మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్- సీతా మహాలక్ష్మి దంపతులు, మాజీ ఎంపీపీ ఎర్రబెల్లి మాధవి,మేరుగు రమేష్ నిర్మల దంపతులు,బి ఆర్ ఎస్ మండల పార్టీ అధ్యక్షులు పరిపాటి వెంకటరెడ్డి తో సహా పలువురు హాజరై స్వామివారి సన్నిధిలో తరించిపోయారు.మాజీ జడ్పీ ఫ్లోర్ లీడర్ మంగళంపల్లి శ్రీనివాస్ మాజీ జెడ్పిటిసిహెచ్ వెంకటేశ్వర్లు,బాలాజీ పాశం రమేష్ తో పాటు పలువురు హాజరయ్యారు.

## ఎమ్మెల్యే చొరవతో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు



**విశ్వాంభర, పరిగి :** మున్సిపాలిటీ పరిధిలోని మూడో వార్డు సాయిరాం నగర్ కాలనీలో గత కొన్ని సంవత్సరాలుగా సక్రమంగా విద్యుత్ స్తంభాలు లేక కాలనీకి విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడేది. ఆ విషయాన్ని పరిగి పట్టణ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు ఎండి ఎజాజ్ స్థానిక ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి స్పందించి శుక్రవారం విద్యుత్ అధికారులతో మాట్లాడి విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసి వైర్ కనెక్షన్ ఇవ్వడంతో కాలనీవాసులు ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అనిల్, కవితా రెడ్డి, సల్మాన్ విద్యుత్ అధికారులు పాల్గొన్నారు.

## టస్సర్ పట్టు పరిశ్రమ అభివృద్ధికి చర్యలు చేపట్టాలి



**విశ్వంభర, భూపాలపల్లి:** టస్సార్ పట్టు పరిశ్రమ అభివృద్ధికి చర్యలు చేపట్టాలని భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. శుక్రవారం ఐడిఓసి కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్లో సెరికల్చర్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో కొనసాగుతున్న టస్సార్ పట్టు పరిశ్రమ అభివృద్ధికి చర్యలు చేపట్టాలని తెలిపారు. టస్సార్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలుపై నివేదిక అందించాలని ఆదేశించారు. టస్సార్ పట్టుకు మార్కెట్ లో మంచి డిమాండ్ ఉన్నప్పటికీ అనుకున్న మేరకు మార్కెటింగ్ జరగడం లేదని అన్నారు. మార్కెటింగ్ పెంచడానికి తీసుకోవాల్సిన చర్యలపై సమగ్ర కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు టస్సార్ చేనేత వస్త్ర కార్మికులకు ఇచ్చే రాయితీలను అందే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

## రక్తదానంతో రోగ నిరోధక శక్తి

**డాక్టర్ ముస్తఫా**




**విశ్వంభర, గచ్చి బౌలి :** రక్తదానంతో రోగ నిరోధక శక్తి పెరుగుతుందని ఫైన్ వేవ్ చారిటబుల్ సొసైటీ చైర్మన్ డాక్టర్ ముస్తఫా అన్నారు. శుక్రవారం గచ్చిబౌలిలోని హెచ్ సి ఎల్ టెక్నాలజీలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేశారు. అనంతరం డాక్టర్ ముస్తఫా మాట్లాడుతూ ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేసిన ఎలాంటి అనారోగ్యానికి గురికారని అన్నారు. 55 ఏళ్ల వరకు రక్తదానం చేయవచ్చని తెలిపారు. అనంతరం రక్తదానం చేయడం వల్ల ఉపయోగాలను వారందరికీ తెలియజేశారు. అనంతరం రక్తదాతలకు సన్మానించి ప్రశంస పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సమస్త ప్రతినిధి విజయ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గృహ కార్మికుల సంక్షేమానికి సమగ్ర చట్టం రూపొందించాలి



**విశ్వంభర, హైదరాబాద్:** గృహ కార్మికుల సంక్షేమానికి సమగ్ర చట్టం రూపొందించాలని పలువురు సామాజిక కార్యకర్త లు డిమాండ్ చేశారు. శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ డొమెస్టిక్ వర్కర్స్ యూనియన్, జాతీయ డొమెస్టిక్ వర్కర్స్ ప్లాట్ ఫాం సంస్థల అధ్వర్యంలో గృహ కార్మికుల సంక్షేమానికి సమగ్ర చట్టం వేయాలని డిమాండ్ చెస్తు రాష్ట్ర సదస్సు జరిగింది. నల్సార్ లా యూనివర్సిటీ ప్రొపెసర్ వాసంతి,న్యాయ విద్యార్ధి అఖిల్ లు తెలంగాణ గృహకార్మికుల సామాజిక భద్రత ముసాయిదా బిల్లు లొ వున్న అంశాలను చర్చకు పెట్టారు. వివిధ దేశాలలో వున్న గృహ కార్మికుల చట్టాలను,మన దేశంలో 2017 గృహ కార్మికుల బిల్లు,కేరళ, మహారాష్ట్రలో అమలవుతున్న గృహ కార్మికుల చట్టం, ఉత్తర ప్రదేశ్,తమిళనాడు ,తదితర రాష్ట్రాల ముసాయిదా బిల్లు ల పై చర్చించారు. గృహ కార్మికులను రిజిస్ట్రేషన్ చెసి,గుర్తింపు కార్డులు జారీ చేయాలని, కనీస వేతనాలు చెల్లించె విధంగా చట్టం చేయాలన్నారు.పిల్లలు చదువుకొవాలని,పని చెయకుండా నియంత్రించాలన్నారు.ఈ సమావేశంలో సామాజిక కార్యకర్త లు కె.సజయ, వర్గిస్, ఉషా సితాలక్ష్మి, పులి కల్పన , సత్యవతి , రవి, హర్ష, యంవిఎఫ్ వెంకట్ రెడ్డి, డిబిఎఫ్ శంకర్, వర్ష, జొషఫ్ , నవనీత , తదితరులు పాల్గొన్నారు.

## గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



**విశ్వంభర, షాద్ నగర్ :** మున్సిపాలిటీ ప్రజలకు అండగా ఉండడమే కాకుండా పోలీసుల ఆరోగ్యాన్ని కాపాడుకోవడం కూడా మా ప్రధాన కర్తవ్యమని, వారి ఆరోగ్యం భద్రత, బాధ్యత మాపై ఉందని షాద్ నగర్ అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ రంగస్వామి అన్నారు. సిపి అవినాష్ బాబు, జాయింట్ సిపి డేవిడ్ జోయల్, డిసిపి రాజేష్ ఆదేశానుసారం శుక్రవారం హైదరాబాద్ గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్, ఎస్బీ, ఎస్బీ క్యాన్సర్ ఆధ్వర్యంలో పట్టణంలోని బుగ్గారెడ్డి గార్డెన్ లో పోలీసులకు,కుటుంబాలకు సంబందించిన ఉచిత మెగా క్యాంపును టౌన్ సీఐ విజయ్ కుమార్ తో కలసి రంగస్వామి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ,,,అనుక్షణం ప్రజల శ్రేయస్సు కోసం కృషి చేస్తూ,అటు ప్రజలకు ఇటు ప్రభుత్వానికి మధ్యన విధులు నిర్వహిస్తూన్న పోలీసులు ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకుండా ఉండేందుకు ఇలాంటి వైద్య శిబిరాలను ఏర్పాటు చేయడం సంతోషమని అన్నారు.

## ఏజెన్సీ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు పొందిన వారిని తొలగించాలి



**విశ్వంభర, అచ్చంపేట:** అచ్చంపేట ప్రాంతంలోని పదరా, అమ్రాబాద్, అచ్చంపేట బలుమూరు, లింగాల, ప్రాంతంలో ఏజెన్సీ గ్రామాలలో నివాసముంటున్న ఆదివాసి లంబాడి ఎరుకుల వారికి ఏజెన్సీ సర్టిఫికెట్లు ఇస్తూ మైదాన ప్రాంతంలో ఉండే దేవరకొండ చందంపేట మిర్యాలగూడ మైదాన ప్రాంత గిరిజనులకు ఏజెన్సీ సర్టిఫికెట్ ఇవ్వడంతో ఏజెన్సీ ప్రాంతంలో ఉండే గిరిజనులకు అన్యాయం జరిగిందని అట్లాంటి వారికి న్యాయం జరిగే విధంగా చర్యలు చేపట్టాలని తెలంగాణ గిరిజన సంఘం ఆధ్వర్యంలో అచ్చంపేట ఆర్డిఓ కి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి శంకర్ నాయక్ మాట్లాడుతూ.. 2017 సంవత్సరంలో తెలంగాణ గిరిజన సంఘం ఆధ్వర్యంలో పదరా అమ్రాబాద్ లింగాల అచ్చంపేట ప్రాంతాల్లో అర్హులు లేని గిరిజనులకు ఏజెన్సీ ధ్రువీకరణ పత్రాలు ఇస్తున్నారని ఇది సరైన కాదని అనేకసార్లు తాసిల్దారులకు వినతి పత్రాలు ఇచ్చిన పట్టించుకోకుండా అవినీతికి పాల్పడుతూ అక్రమంగా సర్టిఫికేట్ ఇస్తూ సహకరించిన తాసిల్దారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తెలంగాణ గిరిజన సంఘంగా డిమాండ్ చేశారు.

## విద్యార్థుల భవిష్యత్తుకు క్రీడలు ఎంతో అవసరం

**ఇన్స్పెక్టర్ నాగరాజు గౌడ్**



**విశ్వంభర, ఎల్బీనగర్ :** విద్యార్థుల భవిష్యత్తుకు క్రీడలు ఎంతో అవసరం అని ఇన్స్పెక్టర్ నాగరాజు గౌడ్ అన్నారు. ఎల్బీనగర్ జోన్ పరిధిలోని 7 పాఠశాలల క్రీడా పోటీలు స్థానిక బిఎస్ ఆర్ క్రీడా మైదానంలో నిర్వహించిన పోటీలకు ముఖ్య అతిథులుగా హయత్ నగర్ ఇన్స్పెక్టర్ నాగరాజుగౌడ్, భాష్యం పాఠశాల జెడ్ ఈ ఓ అంకమ్మ రావు లు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు కూడా ఎంతో ముఖ్యమన్నారు. శారీరక, మానసిక ఎదుగుదలకు క్రీడలు దోహదపడతాయన్నారు. సీనియర్ జూనియర్ విభాగాలలో ప్రథమ బహుమతి పొందిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు.సీనియర్ విభాగం లో ఆర్కె పురం పురం బ్రాంచ్ విద్యార్థులు ప్రథమ బహుమతి గెలుచుకున్నారు. ప్రిన్సిపాల్ అప్పారావు మాట్లాడుతూ క్రీడల ప్రాముఖ్యత అని విద్యార్థులకు తెలియజేసే విధంగా ప్రోత్సహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్‌ను అవమానించిన అమిత్ షా వెంటనే క్షమాపణలు చెప్పాలి

ఎస్సీ సెల్ మాజీ రాష్ట్ర కార్యదర్శి కొండ్ర శ్రీనివాస్

**విశ్వంభర, ఎల్బీనగర్ :** అంబేద్కర్ ను అవమానించిన అమిత్ షా వెంటనే దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని టిఆర్ఎస్ పార్టీ ఎస్సీ సెల్ మాజీ రాష్ట్ర కార్యదర్శి కొండ్ర శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆర్కే పురంలో ఆయన మాట్లాడుతూ ఈమధ్య బాగా అంబేద్కర్... అంబేద్కర్... అంబేద్కర్..అనే వాదన ఎక్కువైపోయింది అని అదే భగవంతుని తలుకుంటే అందరం కూడా స్వర్గానికి పోతామని అమిత్ షా వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదు అని అన్నారు .

**విశ్వంభర, ఆమనగల్లు :** ఆమనగల్ మండల కేంద్రంలొని చౌరస్థలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో అంబేద్కర్ పట్ల అమిత్ షా అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా దిష్టిబొమ్మని దగ్ధం చేశారు. ఈ సందర్భంగా అంబేద్కర్ పూలే జ్ఞాన జాతర నాయకులు గండిగళ్ల సుధాకర్ మాట్లాడుతూ ప్రపంచ మేధావి అంబేద్కర్ ని కించపరిచిన అమిత్ షా వెంటనే రాజీనామా చేయాలని మనుధర్మశాస్త్ర సిద్ధాంతం నశించాలని అమిత్ షా హోమ్ మినిస్టర్ గా ఉండే హక్కు లేదని వెంటనే తొలగించాలని అమిత్ షా భారత ప్రజానీకానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు రైతు సంఘం జిల్లా నాయకులు కానుగుల వెంకటయ్య మాట్లాడుతూ నిండు పార్లమెంట్ సభలో భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ పై మత చాందసవాదముతో ఉన్న అమిత్ షా అనుచిత వాక్యాలు చేసినందున హోం మంత్రి పదవికి వెంటనే రాజీనామా చేయాలని లౌకిక దేశమైన భారత ప్రజలపై మనువాద భావజాలాన్ని బలవంతంగా రుద్దేందుకు ఆర్ఎస్ఎస్ బిజెపి శక్తులు నిరంతరం కృషి చేస్తున్నావని చెప్పారు.



**విశ్వంభర, సరూర్ నగర్ :** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్రమంత్రి అమిత్ షా బేషరత్తుగా క్షమాపణలు చెప్పాలని రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఆర్ కెపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు శేఖర్, చంద్రమౌళి ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా వ్యాఖ్యలకు నిరసనగా మాజీ శాసనసభ్యులు కెఎల్ఆర్, నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకులు, టీపిసిసి సభ్యులు దేప భాస్కర్ రెడ్డి సూచనల మేరకు ఎన్టీఆర్ నగర్ లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కాంస్య విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్రమంత్రి అమిత్ షా బేషరత్తుగా క్షమాపణలు చెప్పాలని, కేంద్ర మంత్రి వర్గం నుండి భర్తరఫ్ చేయాలని డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పున్న గణేష్, రమేష్, సురేందర్ రెడ్డి, శివ, అక్బర్, ప్రేమ్ నాయక్, మహమ్మద్, డక్కియార్ నాయక్, లింగస్వామి గౌడ్, జెల్ల జగన్నాథం, పటేల్, క్రిష్ణయ్య, శ్యామ్ గౌడ్, షఫి, శ్రీధర్, నాను నాయక్, శ్యామ్ సుందర్, విప్లవ్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

**విశ్వంభర, చింతపల్లి :** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌ను పార్లమెంట్ లో జరిగిన సమావేశంలో హెూంమంత్రి అమిత్ షా అవమానించినట్లు మాట్లాడడం దురదృష్టకరమని యువజన కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి ఎర్ర కృష్ణ జాంభవ్ అన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర హెూంమంత్రి అమిత్ షా భారత రాజ్యాంగం ద్వారా హక్కులు పొందుతున్న ప్రతి భారతీయ పౌరునికి తక్షణమే క్షమాపణ చెప్పాలని డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రాసిన భారత రాజ్యాంగమే లేకుంటే నీకు హెూం మంత్రి పదవి ఎక్కడిదని అన్నారు. మణిపూర్ రాష్ట్రం అల్లర్లతో అట్టుడికి పోతూ ప్రాణం నష్టం జరుగుతుంటే చోద్యం చూస్తూ అల్లర్లను ఆపలేని చేతగాని హెూం మంత్రి అమిత్ షా మరియు బిజెపి పార్టీ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చేతగాని పరిపాలనకు నిదర్శనం అని అన్నారు. బడుగు బలహీన వర్గాల ప్రజలకు అంబేద్కర్ వారసులను చిచ్చులు పెట్టి రెచ్చగొట్టే మాటలు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా అల్లర్లు సృష్టించాలని చూస్తున్నారన్నారు భారత రాజ్యాంగం పట్ల ఏ మాత్రం గౌరవం లేకుండా బాబాసాహెబ్ అంబేద్కర్ గారిని అగౌరవపరిచే విధంగా మాట్లాడడం సిగ్గుచేటు అన్నారు భారత రాజ్యాంగాన్ని పట్టుకొని దేశ ప్రజలకు భేషరతుగా క్షమాపణ చెప్పాలని హెచ్చరించారు.

## నేడు శ్రీలీలతో వైభవం షాపింగ్ మాల్ ప్రారంభోత్సవం





**విశ్వంభర, ఎల్బీనగర్ :** కొత్తపేటలోని అష్టలక్ష్మి కమాన్ ప్రక్కన ప్రముఖ సినీతార శ్రీలీలచే వైభవం షాపింగ్ మాల్ శనివారం ప్రారంభోత్సవ కార్యక్రమం ఉంటుందని నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిధులుగా చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, మహేశ్వరం శాసన సభ్యురాలు పటోళ్ల సబితా ఇంద్రారెడ్డి , ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగా రెడ్డి, తెలంగాణ రోడ్డు డెవలప్ మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్ రెడ్డి రామ్ రెడ్డి, స్థానిక కార్పొరేటర్ రాధ ధీరజ్ రెడ్డి హాజరు అవుతున్నట్టు తెలిపారు.

## సీఎం కప్ పోటీలలో ఫరూక్ నగర్‌కు మొదటి బహుమతి



**విశ్వంభర, హైదరాబాద్ :** సరూర్ నగర్ స్టేడియంలో జిల్లాస్థాయి సీఎం కప్ 2024 వాలీబాల్ పోటీలలో బాలికల విభాగంలో ఫరూక్ నగర్ మండలం మొదటి బహుమతి కైవసం చేసుకుంది. ఫరూక్ నగర్ మండలానికి ఇంతటి ఘనవిజయాన్ని అందించిన క్రీడాకారుణిలు అలాగే ఫరూక్ నగర్ మండల ఇంచార్జ్ రాజశేఖర్ రెడ్డి పిడి,బాలయ్య పిడి, లక్ష్మణ చారి పిడి,రేణుక పిడి, రాధిక గురుకుల పి ఈ టి సీఎం కప్ 2024 మండల చైర్మన్ ఎంపీడీవో, ఎంఈఓ జిల్లాస్థాయిలో అద్భుతమైన ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి సీఎం కప్ పోటీలకు ఎంపికైనందునకు ఫరూక్ నగర్ పీడీలకు, పి ఈ టి లకు అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేశారు.

## విద్యార్థులకు కలెక్టర్ అభినందనలు



**విశ్వంభర, మహబూబాబాద్ :** జన విజ్ఞాన వేదిక తెలంగాణ రాష్ట్ర కమిటీ, ఈనెల 14, 15, 16వ తేదీలలో ఆదిలాబాద్ జిల్లాలోని సాంకేతిక విద్య కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన చెకుముకి రాష్ట్రస్థాయి సైన్స్ టాలెంట్ టెస్టులో మహబూబాబాద్ జిల్లా నుంచి పాల్గొన్న పెద్ద వంగర మండలం లోని చిట్యాల గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఆర్. లుకేష్, ఆర్ . రవి కీర్తన్, వి. వర్షిత్ ఒక టీం గా ప్రభుత్వ ఆంగ్ల మాధ్యమం విభాగంలో మొదటి స్థానంలో నిలిచిన విషయం తెలిసిందే. ఈ విజయాన్ని పురస్కరించుకొని మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ ఈ ముగ్గురు పిల్లలను కలెక్టర్ చాంబర్లో అభినందించారు .

## తెలంగాణ గ్రామీణ బ్యాంకులో టిజిబి విలీనం



**విశ్వంభర, హైదరాబాద్:** ప్రభుత్వ 'వన్ స్టేట్-వన్ ఆర్ఆర్బీ' లక్ష్యంలో భాగంగా భారత ప్రభుత్వ ఆర్థిక సేవల విభాగం (డీఎఫ్ఎస్) 13-11-2024 నాటి ఎఫ్.నెం.15/2015(ఇ) ఉత్తర్వు ద్వారా 2025 జనవరి 1 నుంచి ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు (ఏపీజీవీబీ) తెలంగాణ గ్రామీణ బ్యాంకులో (టీజిబి) విలీనం చేస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేసింది. ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు (ఏపీజీవీబీ) సంబందించిన 493 శాఖలు తెలంగాణ గ్రామీణ బ్యాంకు (టీజీబీ)లో విలీనం కానున్నాయి. 01.01.2025 నుండి హైదరాబాద్ లో ఉన్న టీజీబీ హెడ్ ఆఫీస్ కింద ఏపీజీవీబీ బ్రాంచ్ లు నిచేయనున్నాయి. ఈ ప్రక్రియలో తలెత్తే సాంకేతిక సమస్యల కారణంగా, మా బ్రాంచ్ ఆపరేషన్స్, ఆన్ లైన్ బ్యాంకింగ్ సర్వీసెస్ మొబైల్ బ్యాంకింగ్, ఇంటర్నెట్ బ్యాంకింగ్ మొదలైనవి అన్ని కస్టమర్ సర్వీస్ సెంటర్లు లావాదేవీలు తేదీ: 28-12-2024 నుండి 31-12-2024 వరకు అందుబాటులో ఉండవు. వినియోగదారులు ఈ నెల 27 వ తేదీలోగా తమ లావాదేవీలను పూర్తి చేసుకోవలసిందిగా ప్రార్థిస్తున్నాము. జనవరి 1 2025 నుంచి ఈ సర్వీసులు యథావిధిగా నడుస్తాయి. ఖాతాదారుల ఖాతా నంబర్లు అలాగే ఉంటాయి కాబట్టి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. మా ప్రియమైన కస్టమర్లకు కలిగిన ఈ అసౌకర్యానికి మేము చాలా చింతిస్తున్నాము. అందువల్ల, మా విలువైన కస్టమర్లందరూ మాకు సహకరించి వారి ఆర్థిక లావాదేవీలను 27.12.2024 లోపు పూర్తి చేసుకోవాలని కస్టమర్లను అభ్యర్థిస్తున్నాము.

# ప్రభుత్వ భూమిని పరిశీలించిన సబ్ కలెక్టర్



**విశ్వంభర, మిర్యాలగూడ :** ప్రభుత్వ భూములు పరిరక్షించిన క్రమంలో భాగంగా రోజున శుక్రవారం రోజున సబ్-కలెక్టర్, మిర్యాలగూడ గారు మిర్యాలగూడ మండలంలోని అలగడప గ్రామ శివారులో గల సర్వే. నెం. 833 లో గల ప్రభుత్వ భూమి ని పరిశీలించడం జరిగింది. పూర్వం ఇట్టి సర్వే నెం. 833 నందు ఎ. 2.00 గుంటల భూమిని అవంతిపురం లో గల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం యొక్క నిర్మాణానికి కేటాయించారు. ఈ భూమి లో ఎ. 1.00 గుంటల భూమి లో స్కూల్ నిర్మాణం జరిగినది, మరియు మిగులు ఎ. 1.00 గుంటల భూమి నందు కళాశాల నిర్మించుటకు గాను ఖాళీగా ఉంచడం జరిగింది. ఈ భూమిలో అక్రమంగా ఆక్రమణలు చేయుటకు కొందరు ప్రయత్నిస్తునందున సబ్-కలెక్టర్, మిర్యాలగూడ పరిశీలించి, ఎవరు ఆక్రమణ చేయకుండా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్, మిర్యాలగూడ ఆదేశించారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ మరియు సిబ్బంది పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

# ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో అసెంబ్లీ ముట్టడి అరెస్టు

**విశ్వంభర, హైదరాబాద్ :** గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లలో జరుగుతున్న ఫుడ్ పాయిజన్ లను నివారించాలని డిమాండ్ చేస్తూ చలో అసెంబ్లీ నిర్వహించారు. రాష్ట్రంలో విద్యాశాఖ రేవంత్ రెడ్డి వద్ద ఉన్న సమస్యలు పరిష్కారం కావడం లేదని విద్యాశాఖకు ప్రత్యేక మంత్రిని కేటాయించాలని వారు డిమాండు చేశారు. ఏఐఎస్ఎఫ్ నాయకులను సుమారు 50 మంది పైగా పోలీసులు అరెస్ట్ చేసి అంబర్ పెట్ మరియు శాహీనయత్ గంజ్ పోలీస్ స్టేషన్లకు తరలించారు...ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు కసిరెడ్డి మణికంత రెడ్డి, పుట్టా లక్ష్మణ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దుకై అసెంబ్లీలో తీర్మానం చేయాలని డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. నూతన జాతీయ విద్యా విధానం వలన పేద మధ్యతరగతి విద్యార్థులకు విద్యను దూరం చేసే కుట్రను చేస్తున్నారని అన్నారు. మతతత్వ భావజాలాన్ని విద్యార్థులపై రుద్దాలని కేంద్ర ప్రభుత్వం



చూస్తుందని అన్నారు. నూతన జాతీయ విద్యా విధానం రద్దు చేసేంతవరకు ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

# కామ్రేడ్ వెంకట్ రెడ్డి సేవలు చిరస్మరణీయం

**రైతు సంఘం జిల్లా అధ్యక్షులు చిలుక బాల్ రెడ్డి**

**విశ్వంభర, కల్వకుర్తి :** యుటిఎఫ్ ఉమ్మడి జిల్లా వ్యవస్థాపక అధ్యక్షులు, సిపిఎం పార్టీ ఉమ్మడి జిల్లా కమిటీ సభ్యులు అమరజీవి కామ్రేడ్ దేశం వెంకట్ రెడ్డి 5వ వర్ధంతి సందర్భంగా తన స్వగ్రామం కల్వకుర్తి మండలం మార్చాల గ్రామంలోని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు చిలుక బాల్ రెడ్డి స్తూపానికి ఘనంగా నివాళులు అర్పించారు. గతంలో సరైన అవకాశాలు లేక చదువుకు దూరం అయ్యే పరిస్థితిలో ఉన్నటువంటి అణగారిన కులాలకు చెందిన వారిని చేరదీసి గోరటి వెంకన్న లాంటి అనేకమంది దళిత విద్యార్థులను చదువుపట్ల మక్కువ పెరిగేలా ప్రోత్సహించి ఉన్నత వ్యక్తులుగా తీర్చిదిద్దటానికి వెంకట్ రెడ్డి కృషి చేశారని అన్నారు. ముందుగా



ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి స్తూపం వద్ద ఆయన చేసిన సేవలను కొనియాడారు.

# అగ్ని ప్రమాదంపై చర్యలు తీసుకోవాలని వినతి



**విశ్వంభర, అంబర్ పేట్ :** మైనారిటీ బాలికల రెసిడెన్షియల్ హాస్టల్లో జరిగిన అగ్ని ప్రమాదంపై చర్యలు తీసుకోవాలని అంబర్పేట్ ఎమ్మార్వో కు కంటెస్టెంట్ ఎమ్మెల్యే శ్రీకాంత్ వినతిపత్రం సమర్పించారు. అర్ధరాత్రి బాగ్ అంబర్పేట్ లో ఉన్న మైనారిటీ బాలికల రెసిడెన్షియల్ హాస్టల్లో సుమారుగా రాత్రి 11 గంటలకు భారీ ఎత్తున మంటలు చెలరేగాయి. దీన్ని గమనించిన అంబర్పేట్ కంటెస్టెడ్ ఎమ్మెల్యే దేవరుప్పల శ్రీకాంత్ హుటాహుటిన హాస్టల్ వద్దకు వెళ్లి నిద్రలో ఉన్న వారిని లేపడం జరిగింది. అనంతరం అగ్నిమాపక సిబ్బందికి ఫోన్ చేసి పరిస్థితిని వివరించారు. స్థానికులు బస్తీవాసుల సహకారంతో మంటలను అదుపులోకి తీసుకున్నారు. సంఘటన స్థలానికి చేరుకున్న అధికారులు ఫైర్ సేఫ్టీ సిబ్బంది మంటలను పూర్తిగా అదుపులోకి తీసుకొచ్చి ఎలాంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవడం జరిగింది.

# కంటి ఆస్పత్రుల తనిఖీ

**విశ్వంభర, మహబూబ్ బాద్ :** శుక్రవారం స్థానిక మహాలక్ష్మి కంటి ఆసుపత్రి , సూర్య కంటి ఆసుపత్రులను డిప్యూటీ డి.ఎం.హెచ్.ఓ డాక్టర్ ప్రమీలరావ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అధికారి గ్రీవెన్స్ సంబంధించిన నాలుగు కేసుల చికిత్సల వివరాలను అడిగి తెలుసుకుని వారి యొక్క కంటికి సంబంధించిన చూపు మరియు అంశములపై అడిగి తెలుసుకున్నారు. అలాగే ఆస్పత్రి రికార్డులను సమర్పించాలని కోరారు. ఏవైతే నాలుగు కేసుల యొక్క వివరాలు వాటిని పరీక్షించుటకు వారి యొక్క కాన్సెంట్ఫాములను ఆపరేషన్ సర్టిఫిట్ లను సమర్పించాలని తెలిపారు. అలాగే ఆసుపత్రిని శుభ్రంగా ఉంచాలని శానిటేషన్ బాగా ఉండాలని వాష్రూమ్స్ ఎప్పటికప్పుడు శుభ్రపరచాలని అలాగే బెడ్స్ పరిశుభ్రంగా ఉండాలని తెలిపారు. ఆసుపత్రిలో పనిచేసే డాక్టర్ సర్టిఫికెట్స్ మేనేజ్మెంట్ సర్టిఫికెట్స్ అన్ని జిరాక్స్ కాపీలను ఆఫీస్ కు ఇవ్వాలని



కోరారు. ఈ తనిఖీ లో సబ్ యూనిట్ ఆఫీసర్ వడ్డే బోయిన శ్రీనివాస్ హెల్త్ ఎడ్యుకేటర్ గీత,డాక్టర్ సుధీర్ కుమార్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ పిల్లి గోవర్ధన్ పాల్గొన్నారు.

# అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన





విశ్వంభర, హైదరాబాద్ : రాజ్యాంగ నిర్మా త అంబేద్కర్ పై కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన అవమానకర వ్యాఖ్యలపై తక్షణమే ఆయనను బర్తరఫ్ చేయాలని అతని పై ఎస్సి ఎస్టీ కేసు నమోదు చేయాలని హైదరాబాద్ నగరం లో నిరసనలు కొనసాగాయి. సామాజిక ప్రజాసంఘాల నేతలు, విద్యార్థి సంఘాలు, వివిధ పార్టీల నాయకులు అంబేద్కర్ చిత్ర పటాలు చేతబూని శుక్రవారం హైదరాబాద్ ట్యాంక్ బండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద డిమాండ్ చేశారు.

**విశ్వంభర, మహేశ్వరం :** కందుకూర్ బిజెపి పార్టీ కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పై చేసిన అనుచిత వ్యాఖ్యల కు, వ్యతిరేకంగా మహేశ్వరం నియోజకవర్గం, కందుకూరు మండల కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ ఎండి అఫ్జల్ బేగ్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అమిత్ షా ఈ రాజ్యాంగా బద్ధంగా పదవి అనుభవిస్తున్నా నువ్వు పదవికి అర్హుడవు కాదు ఖబర్దార్ అమిత్ షా ఇప్పటికైనా రాజ్యాంగాన్ని గౌరవించడం నేర్చుకో మళ్లీ ఇంకొకసారి ఇలాంటి వాఖ్యలు చేసినట్లయితే ప్రజలే నీకు గుణపాఠం చెప్తారు నువ్వు చేసిన వాక్యాలు వెంటనే వెనక్కి తీసుకోవాలని నిరసన తెలియజేసిన, అదేవిధంగా బిజెపి పార్టీ నుంచి బర్త్రాఫ్ చేయాలని కాంగ్రెస్ పార్టీ తరపున డిమాండ్ చేశారు .

**విశ్వంభర, హైదరాబాద్ :** కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ పార్లమెంట్ సాక్షిగా బిజెపి పార్లమెంట్ సభ్యులపై దాడికి నిరసనగా, రాజ్యాంగాన్ని అమలుపరిచిన రోజు నుంచి అడుగడుగునా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ను అవమాన పరుస్తున్న కాంగ్రెస్ పార్టీకి బుద్ధి రావాలని బి జె వై ఎం రాష్ట్ర అధ్యక్షులు సెవెళ్ళ మహేందర్ ఆధ్వర్యంలో ట్యాంక్ బండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద శాంతియుతంగా నిరసన తెలిపారు. బీజేవైఎం నాయకులను అరెస్టు చేసి కంచన్బాగ్ పోలీస్ స్టేషన్ కి తరలించారు.

## ఆటో డ్రైవర్ల యూనియన్ నాయకుల ముందస్తు అరెస్ట్



**విశ్వంభర, మాడుగుల :** తెలంగాణ రాష్ట్ర ఆటో యూనియన్ జాయింట్ యాక్షన్ కమిటీ తమకు ప్రభుత్వం ఇస్తానన్న 12 వేల రూపాయల సహాయం మరియు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలి అన్న డిమాండ్ తో చేలో అసెంబ్లీ కార్యక్రమాన్ని పిలుపునిచ్చారు. ఆ కార్యక్రమానికి ముందస్తుగా పాల్గొనడానికి వెళ్తుండడంతో ముందు జాగ్రత్త చర్యల్లో గస్తీ తిరుగుతుండగా మాడుగుల మండల కేంద్రానికి చెందిన ఆటో డ్రైవర్ యూనియన్ సభ్యులు సయ్యద్ ఇమాం సాహెబ్, వీరమల్ల శ్రీనివాస్ ఎండి ఇబ్రహీం, సయ్యద్ షరీఫ్ అనే వ్యక్తులను ముందస్తుగా అరెస్టు చేసి ఎమ్మార్వో ముందు బైండోవర్ చేసామని మాడుగుల పోలీసులు తెలిపారు.

## ఆటో డ్రైవర్స్ యూనియన్ చలో అసెంబ్లీ



విశ్వంభర, హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర ఆటో డ్రైవర్స్ యూనియన్ ఆధ్వర్యంలో హైదరాబాద్ హిమాయత్ నగర్ లో చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆటో డ్రైవర్ల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని లేనిపక్షంలో మరింత ఉధృతమైన కార్యక్రమాలను చేపడతామని ఈరోజు అసెంబ్లీ వైపుగా వెళ్లిన ఆటో డ్రైవర్లను అడ్డుకున్న పోలీసులు. ఆటో జేఏసీ నేతలు మారయ్య వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



**విశ్వంభర, ఎల్బీనగర్ :** సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో మంది పేదలకు మేలు చేకూరుస్తూ, వారికి వైద్యభారాన్ని తగ్గిస్తుందని టీపీసీసీ క్యాంపెయిన్ కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్ పేర్కొన్నారు. వివిధ అనారోగ్య కారణాలతో ప్రైవేటు ఆసుపత్రులలో చికిత్స పొందిన ఎల్బీనగర్ నియోజకవర్గానికి చెందిన ఏడుగురు మధుయాష్కీ గారిని సంప్రదించగా.. స్పందించిన ఆయన సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు చేయించారు. సదరు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను శుక్రవారం లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమానికి కృషి చేస్తుందన్నారు. ఎంతోమంది సీఎం రిలీఫ్ ఫండ్ పొందడం ద్వారా ఆర్థిక ఉపశమనం పొందగలుగుతున్నారని పేర్కొన్నారు.

## అరోరా డిగ్రీ , పిజి కళాశాలలో ఆరోగ్య శిబిరం, రక్తదానం



**విశ్వంభర, హైదరాబాద్ :** చిక్కడపల్లిలోని అరోరా డిగ్రీ, పీజీ కళాశాలలో యశోద హాస్పిటల్స్ , సంజీవని బ్లడ్ బ్యాంక్ సహకారంతో హెల్త్ క్యాంపు మరియు బ్లడ్ డొనేషన్ డ్రైవ్ విజయవంతంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమం ఆరోగ్య అవగాహనను ప్రోత్సహించింది మరియు విద్యార్థులు, అధ్యాపకులు మరియు సిబ్బంది నుండి చురుకుగా పాల్గొన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సుహాసిని తాటిపర్తి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి, ఆరోగ్యంపై అవగాహన, రక్తదానం ప్రాముఖ్యతను తెలియజేశారు. హెల్త్ క్యాంపు సమన్వయకర్తలు డాక్టర్ సువర్ణ లక్ష్మి మరియు శ్రీ అర్జున్ రావు సమన్వయము కార్యక్రమాన్ని సమన్వయతో ఈ డ్రైవ్ లో 150 యూనిట్లకు పైగా రక్తాన్ని సేకరించి, బ్లడ్ బ్యాంక్ నిల్వలను పెంచింది. చాలా మంది ఎంబిఏ, ఎంసిఏ విద్యార్థులు తమ భాగస్వామ్యం ద్వారా సామాజిక బాధ్యత పట్ల తమ నిబద్ధతను చూపించారు.

## విద్యార్థులకు నైపుణ్యం అవసరం



**విశ్వంభర, హైదరాబాద్:** విద్యార్థులకు నైపుణ్యం అవసరం అని ఐటీఎం యూనివర్సిటీ నిర్వాహ%స్త్ర%కులు అన్నారు. శుక్రవారం హనుమకొండ అడ్వకేట్స్ కాలనీలోని తమ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. 2025-26 అకాడమిక్ సంవత్సరం కోసం అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ డాక్టర్ ప్రోగ్రామ్స్ కోసం అడ్మిషన్స్ ప్రకటించడం కోసం చాలా ఉత్సాహంగా ఉందని అన్నారు. కాంతివంతమైన మనసులను పెంపొందించే వారసత్వం కలిగిన ఐటీఎం యూనివర్సిటీ విద్యార్థులను తమ సంబంధిత రంగాలలో నాయకులుగా మారటానికి శక్తివంతమైన శిక్షణను అందిస్తుందని అన్నారు. నాయకత్వం కోసం రూపొందించిన వివిధ రంగాలలో ఉన్న అకాడమీ కోర్సులను ఎంచుకోవచ్చు అని అన్నారు. అకాడమిక్ కోర్సులను ఎంచుకోవచ్చని అన్నారుఇట్టి అవకాశం సంబంధిత విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

# చండూరులో 18వ మెట్టు మహాపడిపూజ

**పాల్గొన్న మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి**





**విశ్వంభర, మునుగోడు:** చండూరు మున్సిపాలిటీ పరిధిలోని లక్కినేనిగూడెం రామాలయ ప్రాంగణంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గురుస్వామి దోటి వెంకన్న యాదవ్ నిర్వహించిన అయ్యప్ప స్వామి 18వ మెట్టు మహా పడి పూజ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి పాల్గొన్నారు. ఈ మేరకు సంప్రదాయ దుస్తులు ధరించి ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజ నిర్వాహకుడు దోటి వెంకన్న యాదవ్ స్వామితో కలిసి 18 మెట్ల మాహ పూజ జ్యోతిని రాజ్ గోపాల్ రెడ్డి వెలిగించారు. అయ్యప్ప స్వామి చల్లని చూపు తో నియోజకవర్గం ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని, ఇంత గొప్పగా భక్తి భావంతో మహా పడి పూజ కార్యక్రమం నిర్వహించిన నిర్వాహకులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్మా నల్గొండ జిల్లా అధ్యక్షుడు డా.కోడి శ్రీనివాసులు, పల్లె వెంకన్న, అనంత చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుదాఘాతంతో గుడిసె దగ్ధం

**దాతృత్వాన్ని చాటుకున్న మిర్యాలగూడ సబ్ కలెక్టర్**



**విశ్వంభర, మిర్యాలగూడ :** పట్టణంలోని గాంధీనగర్ లో శుక్రవారం జరిగిన విద్యుత్ షాక్ సర్క్యూట్ తో దాసరి స్వప్న భర్త సతీష్ దంపతుల గుడిసె పూర్తిగా దగ్ధమైంది. ఈ విషయమై సబ్-కలెక్టర్, మిర్యాలగూడ నారాయణ అమిత్ మానవతా దృక్పథంతో స్పందించి వారి స్వంతంగా, వారికి 25,000 /- రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. విశ్వంభర, మిర్యాలగూడ : పట్టణంలో శుక్రవారం రోజున కౌన్సిలర్ కొమ్ము శ్రీను 35 వ వార్డు గాంధీనగర్లో ప్రమాదవశాత్తు షార్ట్ సర్క్యూట్ తో పూరి గుడిసె పూర్తిగా కాలిపోవడం జరిగింది. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్ రెడ్డి హుటాహుటిన వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి కాలిపోయిన ఇంటిని పరిశీలించి వారికి అన్ని విధాల ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి దృష్టికి తీసుకువెళ్లి తగువిధంగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ ముదిరెడ్డి నర్సిరెడ్డి, దేశి డి శేఖర్ రెడ్డి, డిసిసి జనరల్ సెక్రెటరీ చిలుకూరి బాలు పట్టణ కాంగ్రెస్ నాయకుడు చిన్న పంగు శ్రవణ్ , కాలనీవాసులు బి ఎల్ ఆర్ బ్రదర్స్ పాల్గొన్నారు.

## ఎల్బీనగర్ జోనల్ కమిషనర్‌ను కలిసిన హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్



**విశ్వంభర, ఎల్బీనగర్ :** ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పలు సమస్యల పరిష్కారం కోసం నిధులు మంజూరు చేయాలని కోరినట్లు హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాత నాయక్ తెలిపారు. ఎల్బీనగర్ జోనల్ కార్యాలయంలో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి పలు సమస్యలను వివరించినట్లు తెలిపారు. హనుమాన్ నగర్ భాగ్యనగర్ కాలనీ పేస్ 1 శ్రీరమణ కాలనీ ఫేస్ 1 లో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని కోరగా వెంటనే మంజూరు చేస్తున్నట్లు హామీ ఇచ్చినట్లు తెలిపారు. మరిన్ని సమస్యల పరిష్కారం కోసం నిధులు మంజూరు చేయాలని కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## దారుణం.. కొడుకును హత్య చేసిన తండ్రి

**విశ్వంభర, సంగారెడ్డి :** సంగారెడ్డి జిల్లా పటాన్ చేరు మండలం ప్రతి రోజు మద్యం సేవించి కుటుంబ సభ్యులను వేదిస్తున్న కొడుకును శుక్రవారం సాయంత్రం 4 గంటలకు తండ్రి కర్ర తో తలపై మోదీ హత్య చేసిన ఘటన బానూర్ బీడీఎల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. మృతుడు వెంకట్ రెడ్డి గతం లో తల్లి పై దౌర్జన్యం చేసే కొట్టిన కేసులో జైలు శిక్ష అనుభవించాడు. భానూర్ బీడీఎల్ పోలీసుల కథనం ప్రకారం క్యాసారం గ్రామానికి చెందిన అతెల్లి అనంత రెడ్డి (63) తన కుమారుడైన మృతుడు అతెల్లి వెంకట్ రెడ్డి (34) ప్రతి రోజూ మద్యం సేవించి తల్లి తో పాటు తండ్రిని వేధిస్తున్నడని, మృతుడి తండ్రి తన దగ్గర వున్న కర్రతో తలపై గట్టిగా కొట్టడంతో ఆతెల్లి వెంకట్ రెడ్డి అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న బిడిఎల్ - బానూర్ పోలీస్ లు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం పటాన్ చేరు ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పారిశ్రామికవేత్త బండారి దయానంద్ యాదవ్‌కు అరుదైన పురస్కారం



**విశ్వంభర, బషీర్ బాగ్:** తెలంగాణ సిటిజన్స్ కౌన్సిల్ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో ఈనెల 28వ తేదీ శనివారం ఉదయం 10 గంటలకు అబిడ్స్ లోని బొగ్గుల కుంటలో తెలంగాణ సరస్వత పరిషత్ ఆడిటోరియంలో రతన్ టాటా 86వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని ప్రముఖ పారిశ్రామికవేత్త, చైర్మన్ ఎస్ డి ఎస్ ఎం సి గ్రూప్ ఆఫ్ కంపెనీస్ బండారి దయానంద యాదవ్ కు ఉద్యోగ పతి అవార్డు 2024 ఎంపిక చేసినట్టు, వీరితోపాటు రతన్ టాటా ఎక్సెన్సీ అవార్డు 2024 ను డైరెక్టర్ డిపార్ట్మెంట్ ఆఫ్ బిజినెస్ మేనేజ్మెంట్ సరోజిని నాయుడు వనిత మహా విద్యాలయ ప్రొఫెసర్ వీణపాణి, ప్రొఫెసర్.వై. జహంగీర్ హెడ్ డిపార్ట్మెంట్ ఆఫ్ బిజినెస్ మేనేజ్మెంట్ ఉస్మానియా యూనివర్సిటీ, భాస్కర్ రెడ్డి చైర్మన్ ఎక్సెల్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్, శ్రీ మర్కిలి జయరాజ్ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ ఆఫ్ సిఐఎస్ ఫోర్స్ లిమిటెడ్, ప్రొఫెసర్ రేణుక సాగర్ డైరెక్టర్ డిపార్ట్మెంట్ ఆఫ్ బిజినెస్ మేనేజ్మెంట్ రాజా బహదూర్ వెంకట్ రామారెడ్డి ఉమెన్స్ పీజీ కాలేజ్ వైఎంసీఏ నారాయణగూడ లకు రతన్ టాటా ఎక్సలెన్సీ అవార్డు 2024 ను ప్రదానం చేస్తున్నట్టు తెలంగాణ సిటిజన్స్ కౌన్సిల్ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు డాక్టర్ రాజనారాయణ ముదిరాజ్ ఒక పత్రికా ప్రకటనలో తెలిపారు.

## గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

**విశ్వంభర, త్రిపురారం :** నీలాయి గూడెం గ్రామ శివారులోని దోమల బండ వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొని నిడమనూరుమండలం ముప్పారం గ్రామానికి చెందిన మర్రి దుర్గయ్య వయసు 45 సం. మృతి చెందాడు. నీలయగూడెం లో బందువుల దిన కర్మలకు వెళ్లి వస్తుండగా ప్రమాదం జరిగినట్లు సమాచారం, పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.

## తెలంగాణ సమాజ్ స్టూడెంట్ యూనియన్ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ

**విశ్వంభర, హైదరాబాద్ :** తెలంగాణ సమాజ్ స్టూడెంట్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వినయ్ విప్ల వ్ ఆధ్వర్యంలో దిల్సుఖ్నగర్ లో నిరసనగా ర్యాలీ నిర్వహించారు.విద్యార్థులు, మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకొని దేశ ప్రజలకు అంబేద్కర్ సాక్షిగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేసారు. అంబేద్కర్ కూడా ఒక దేవుడే, ఎందుకంటే జీవి తం తల్లిదండ్రులు ఇస్తే బ్రతుకు ఇచ్చింది మాత్రం అంబేద్కర్ అని భారతదేశంలో .గుర్తించుకోవాలని ఈ కేంద్ర మంత్రి అయినటువంటి అమిత్ షా కుహెచ్చరిస్తున్నాం. నువ్వు పార్లమెంట్లో ఉన్నది కూడా అంబేద్కర్ వల్లనే కాబట్టి ఆయనను ఆయన గురించి మాట్లాడే ముందు నీ అర్హత తెలుసుకోవాలని ఈ భూమి ఉన్నంతవరకు అంబేద్కర్ బతికే ఉంటాడని అమీషాకు హెచ్చరిస్తున్నాం. అంబేద్కర్ అంటే ఒక నినాదం కాదు అంబేద్కర్ అంటే ఒక పొలిటికల్ యుద్ధ నౌక అనీ మర్చిపోవదని ఈ దిల్సుఖ్నగర్ కేంద్రంగా హెచ్చరిస్తున్నాం. తెలంగాణ సమా జ్ యూనియన్ తరపున అంబేద్కర్ కు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తున్నాం. దీంట్లో తెలంగాణ సమాజ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు వినయ్ విప్ల వ్. విద్యార్థి నాయకులు పవన్, శ్రీను, మధు, పవన్, శ్రీకాంత్, రవి, వీరబాబు, చరణ్, రామ్, తదితర విద్యార్థులు పాల్గొన్నారు.

## తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్ యూనియన్ కోరుట్ల కమిటీ ఎన్నిక




**విశ్వంభర, మెట్ పల్లి :** ప్రజా సంక్షేమం కోసం పనిచేస్తున్న పాత్రికేయుల కోసం మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాలలో అమలు చేస్తున్నట్లుగా జర్నలిస్టు పెన్షన్ పథకాన్ని అమలు చేయాలని టీ ఎస్ జే యు రాష్ట్ర అధ్యక్షుడు పురుషోత్తం నారగౌని అన్నారు. టి ఎస్ జే యు కోరుట్ల నియోజకవర్గ కమిటీ ఎన్నిక యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోకల అనిల్ కుమార్ అధ్యక్షతన మెట్ పల్లి విఆర్ఎం గార్డెన్స్ లో శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో పురుషోత్తం నారగౌని మాట్లాడుతూ ...10 లక్షల రూపాయల ఉచిత ప్రమాద బీమా సదుపాయం కల్పించాలని, అక్రిడేషన్ల కమిటీలు పునరుద్ధరణ చేసి జర్నలిస్ట్ లందరికీ అక్రిడేషన్లు ఇవ్వాలనికోరారు. అక్రిడేషన్లతో సంబంధం లేకుండా జర్నలిస్ట్ సంక్షేమ పథకాలను జర్నలిస్టుల అందరికీ అందేలా చూడాలని తెలిపారు . రాబోయే అక్రిడేషన్ కమిటీలలో అన్ని జర్నలిస్టు సంఘాలకు భాగస్వామ్యం ఉండేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులుగా ధీకొండ మురళి, అధ్యక్షుడు జోరిగే శ్రీనివాస్,ప్రధాన కార్యదర్శి తరి రాజశేఖర్, ఉపాధ్యక్షులుగా పఠాన్ ఫిరోజ్ ఖాన్, పింజారి శివ, కోశాధికారి ఓంకారి శ్రీనివాస్, ఆర్గనైజింగ్ సెక్రటరీ జాకిర్ హుస్సేన్, బోద దివాకర్, సహాయ కార్యదర్శి నరేష్, మీడియా ఇంచార్జ్ గా నన్నాపు రాజు రవిరాజ్, ఈసీ మెంబెర్లు పండిత్ రాజేందర్, గట్ల శ్రీనివాస్, గణేష్, సయ్యద్ ఫిరోజ్, సభ్యులు గుండవేణి రమేష్, సునీల్, నాగేష్, హరీష్, రవీందర్, సీనియర్ పాత్రికేయులు గాజుల మహేష్, రంజిత్ పాల్గొన్నారు.

## సవారు - ముస్లిం సాహిత్య వ్యాసాలు పుస్తక ఆవిష్కరణ



**విశ్వంభర, హైదరాబాద్** బీ హైదరాబాద్ బుక్ ఫెయిర్ లో సంగిశెట్టి శ్రీనివాస్ రాసిన సవారు - ముస్లిం సాహిత్య వ్యాసాలు"పుస్తకాన్ని డా. సుంకిరెడ్డి నారాయణరెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన బుక్ ఫెయిర్ ప్రెసిడెంట్ కవి యాకూబ్ మాట్లాడుతూ.. సంగిశెట్టి శ్రీనివాస్ ప్రత్యేకంగా ముస్లిం సాహిత్యం మీద రాసినటువంటి వ్యాసాలు సాహిత్యానికి కొత్త వెలుగుల్ని తీసుకొస్తాయాన్నారు. కేంద్ర సాహిత్య అకాడెమీ యువ పురస్కార గ్రహీత మెర్సీ మార్గరెట్ మాట్లాడుతూ, "కేవలం కొన్ని వర్గాల వారు, కొన్ని కులాల వారు రాసిన సాహిత్యమే సాహిత్యంగా చాలా కాలం చెలామణి అవుతూ వచ్చిన క్రమంలో ఈ సమాజంలో మేమూ ఉన్నాం, మమ్మల్ని కూడా గుర్తించండి, మా వాయిస్ కూడా వినండి అని మైనారిటీలు ముందుకు వచ్చి ముస్లిం వాద సాహిత్యం రికార్డు అవుతుంది. ఈ క్రమంలో సంగిశెట్టి శ్రీనివాస్ , యాకూబ్, అఫ్సర్ , షాజాహానా,స్కైబాబా లాంటి తెలుగు ముస్లిం రచయితలు కవులు రాసినటువంటి సాహిత్యం మీద ఆయన రాసినటు వంటి వ్యాసాలు ఆకట్టు కుంటున్నావని అన్నారు. మతసామరస్యాన్ని బోధించేటటువంటి ఇలాంటి పుస్తకం చారిత్రిక అవసరమని సుంకిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కార గ్రహీత పసునూరి రవీందర్, స్కై బాబా పాల్గొన్నారు.

## గంజాయిపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి



**విశ్వంభర, వరంగల్:** విద్యార్థులు ఎలాంటి సమస్యలు వచ్చినా ఇరుకులు ఇబ్బందులు ఎదురైనప్పటికీ వాటిని ఎదుర్కోవాలి తప్ప వ్యసనాలకు బానిస కాకుండా గంజాయి వంటి మత్తుపదార్థాల పట్ల అప్రమత్తంగా ఉండాలని వరంగల్ పోలీస్ కమిషనర్ కిషోర్ జా అన్నారు. గ్రేటర్ వరంగల్ పరిధి 55వ డివిజన్ భీమారంలోని ఎస్వీఎస్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ పోస్టర్ ఇన్నోవేషన్ ఇంకు బేషన్ క్రియేటివిటీ కి విద్యార్థులకు ఎంతో ఉపయోగం అన్నారు. అదేవిధంగా విద్యార్థులకు గంజాయి, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం ఎస్వీఎస్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఎర్ర బెల్లి తిరుమల్ రావు మాట్లాడుతూ... విద్యార్థుల నైపుణ్యాలను వెలికి తీసి పారిశ్రామికవేత్తలను ఆహ్వానించి ఉద్యోగ అవకాశాలను కల్పిస్తామని తెలియజేశారు విద్యార్థులు ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అల్లరించారు. ఈ కార్యక్రమంలో హన్మకొండ ఏసిపి దేవేందర్ రెడ్డి, కేయూ సిఐ సుంకరి రవికుమార్, కళాశాల ఆధ్యాపకులు, పిఆర్ఓ, నాగేశ్వరరావు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


## ఇనుగుర్తిలో ముగిసిన ఇంటింటి సర్వే




విశ్వంభర, ఇనుగుర్తి : అంబేద్కర్ పై అమిత్ షా చేసిన వ్యాఖ్యల పట్ల సిపిఎం పార్టీ కన్నెర్ర చేసింది. వెంటనే హొం శాఖ మంత్రి పదవికి రాజీనామా చేయాలని ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు మార్తి తినేని పాపారావు డిమాండ్ చేశారు. మండల కేంద్రం ఇనుగుర్తిలో సిపిఎం ఆధ్వర్యంలో ఇంటింటి సర్వే శుక్రవారం ముగిసింది. దీనికి పాపారావు హాజరయ్యారు.అమిత్ షా వ్యాఖ్యలపై స్థానిక బస్టాండ్ వద్ద నిరసన తెలిపారు.సర్వే సమస్యలపై ఆయన మాట్లాడుతూ..ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలన్నారు. మహిళలకు నెలనెల రూ.2500 వెంటనే చెల్లించాలని కోరారు.కార్యక్రమంలో పార్టీ గ్రామ కార్యదర్శి ఆవుల వెంకన్న,గొడిశాల వెంకన్న, కావటి నరసయ్య, సావిత్ర, ఎల్లయ్య, ఉప్పలయ్య, సత్యం, యాకమ్మ, అమీర్, పెషెట్టి ఉప్పలయ్య, జన్నయ్య, హరీష్, మల్లెపాక యాకయ్య, రాజు పాల్గొన్నారు.

## సీపీఐ బహిరంగ సభకు విరాళం

విశ్వంభర న్యూస్: డిండి మండల కేంద్రంలో భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ వంద సంవత్సరాల వేడుకల సందర్భంగా డిసెంబర్ 30 తేదీన నల్లగొండ జిల్లా కేంద్రంలో జరిగే భారీ ప్రదర్శన అనంతరం ఎన్జీ కళాశాలలో జరిగే బహిరంగ సభను జయప్రదం చేసేందుకు ప్రజల నుండి శుక్రవారం డిండి మండల కేంద్రంలో సిపిఐ మండల నాయకత్వం విరాళాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులుబొడ్డుపల్లి వెంకటరమణ,జిల్లా సమితి సభ్యులు తూము బుచ్చిరెడ్డి, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎండి.మైనోద్దీన్, సిపిఐ మండల కార్యదర్శి శ్రీరామదాసు కనకాచారి, మండల సహా కార్యదర్శులు బొల్లె శైలేష్, తిప్పర్తి విజేందర్ రెడ్డి,మండల కార్యవర్గ సభ్యులు కేశవులు,ఎలిమినేటి హుస్సేన్,ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఎనమల నవీన్ తదితరులు పాల్గొన్నారు.



**వనస్థలిపురం పార్టీ ఆఫీస్‌లో ఎల్‌బీ నగర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్ మధు యాష్కీని మర్యాదపూర్వకంగా కలిసిన టీపీసీసీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ దాము మహేందర్ యాదవ్.**
- విశ్వంభర, ఎల్‌బీ నగర్:

## దిల్ సుఖ్ నగర్‌లో మైన్ డైమండ్ షో




**విశ్వంభర, ఎల్బీనగర్ :** ప్రపంచంలో అతిపెద్ద జ్యువెలరీ సంస్థ ఒకటైన మలబార్ గోల్డ్ అండ్ డైమండ్ దిల్ సుఖ్ నగర్ షో రూమ్ లో మైన్ డైమండ్ షో ని ప్రారంభించినట్లు స్టోర్ హెడ్ రధీష్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డిసెంబర్ 20 నుండి 24 వరకు ఈ డైమండ్ షో ఉంటుందని తెలిపారు. ఈ డైమండ్ షోలో రోజు ధరించే నగలు వివాహ అభరణాలు, లైట్ వెయిట్ ఆభరణాలు, పురుషుల ఆభరణాల సముదాయాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. వజ్రా భరణంలో కొనుగోలుపై వజ్రాల విలువలో 25శాతం వరకు తగ్గింపు ఉంటుందన్నారు. పాత వజ్రాభరణం ఎక్స్చేంజి పై 100శాతం విలువను పొందవచ్చు అన్నారు. వినియోగదారులు కొనుగోలు చేయాలనుకున్న బంగారం విలువలో 10శాతం ముందుగా చెల్లించి అడ్వాన్స్ బుకింగ్ సదుపాయాన్ని పొందవచ్చు అని తెలిపారు. బంగారం వజ్రాలపై బి ఐ ఎస్ హాల్ మార్కుతో ధ్రువీకరించబడిన స్వచ్ఛమైన హెచ్ యు ఐ డి బంగారం అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా 28 పాయింట్లు నాణ్యత పరీక్షలు పొందిన ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమం లో మార్కెటింగ్ మేనేజర్ యుగంధర్ రెడ్డి, వినియోగ దారులు పాల్గొన్నారు.

## ఇండియన్ ప్రజా కాంగ్రెస్ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు



**విశ్వంభర, అబిడ్స్ :** సూర్య కాంప్లెక్స్ శుక్రవారం ఇండియన్ ప్రజా కాంగ్రెస్ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిలుగా ఐ పి సి నేషనల్ ప్రెసిడెంట్ కె బి శ్రీధర్ ,ఉదయ,సుధాకర్ గుప్త,మోహన్ గాంధీ,ఎక్స ఎంఎల్ఏ మదన్మోహన్, బాలకృష్ణ, నరాగోని, చిత్ర, అంజలి, కొండలరావు, నవీన్ గుప్త, వెంకటేష్ గుప్త, అంజలి, డాక్టర్ లక్ష్మి, రూపదే వి, సరిత, పుష్పాంజలి తదితరులు పాల్గొన్నారు.

## ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలి

విశ్వంభర, ఇనుగుర్తి : సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 5 వ తరగతి ప్రవేశాల కోసం ఆన్లైన్లో దరఖాస్తులు చేసుకోవాలని స్థానిక బాలికల గురుకులం ప్రిన్సిపాల్ జయశ్రీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.100 చెల్లించి ఆన్లైన్లో ఈనెల 21 నుంచి ఫిబ్రవరి 1 వరకు అప్లై చేసుకోవచ్చని పేర్కొన్నారు. సాంఘిక, గిరిజన సంక్షేమ గురుకులాలతోపాటు, మహాత్మ జ్యోతిరావు పూలే గురుకులాలకు ప్రస్తుతం 4వ,తరగతి చదువుతున్న ఎస్సీ ఎస్టీ బీసీ జనరల్ పేద విద్యార్థులు అర్హులని, ఫిబ్రవరి 23న ఎంట్రన్స్ ఉంటుందని తెలిపారు.

## పెస్టిసైడ్ దుకాణంపై దాడులు



**విశ్వంభర, మహదేవపూర్:** మండల కేంద్రంలోని ఆగ్రో స్కై బయో మందుల దుకాణాన్ని వ్యవసాయ శాఖ అధికారులు శుక్రవారం సీజ్ చేశారు. వ్యవసాయ శాఖ ఎడిఏ, ఏఓ లు సంయుక్తంగా బయో ఫర్టిలైజర్, పెస్టిసైడ్ దుకాణం పై దాడులు నిర్వహించగా పెద్ద మొత్తంలో డ్రమ్ములో పెస్టిసైడ్ తీసుకొచ్చి బాటిలింగ్ చేసి స్టిక్కరింగ్ చేసి అమ్ముతున్నాడని అలాగే స్టాక్ రిజిస్టర్, బిల్స్ సరిగా మెయింటైన్ చేయకుండా ఇష్టం వచ్చిన రీతిలో షాపు నిర్వాహణ చేస్తున్నారని ఈ తనికి లో అక్రమంగా నిల్వ ఉంచిన సుమారు 13 లక్షల రూపాయల పురుగు మందులు దొరికాయని వాటిని స్వాధీనపరచుకొని కేసు నమోదు చేశామని వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు.

## కమ్యూనిటీ అడ్వైజరీ బోర్డు సమావేశం



**విశ్వంభర, మహబూబాబాద్ :** జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కమ్యూనిటీ అడ్వైజరీ బోర్డు సమావేశంలో ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ మురళీధర్ మాట్లాడుతూ, హై రిస్క్ గ్రూపులు , డ్రగ్ అబ్యూసర్లు, ఫిమేల్ సెక్స్ వర్కర్లు, ట్రాన్స్ జెండర్లు, యం.యస్. యం. గ్రూప్ ల వారిని గుర్తించి, హెచ్ఐవి నియంత్రణలో పాల్గొనాలని పేర్కొన్నారు. సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ వారు ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఎన్ ఏ సి ఓ , టి జి ఎస్ ఏ సి ఎస్ , ,డి ఎం హెచ్ ఓ సహకారంతో మహబూబాబాద్ జిల్లాలో హెచ్ఐవి నిర్మూలించాలని మన జిల్లాని హెచ్ఐవి లేని జిల్లాగా మనందరం కలిసి పనిచేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ విజయకుమార్, సబ్ యూనిట్ ఆఫీసర్ రామకృష్ణ, క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ జ్యోతి, క్లినికల్ సర్వీస్ ఆఫీసర్ సారయ్య, సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ ప్రోగ్రాం మేనేజర్ శాంతరాజు, లింక్ వర్కర్ మేనేజర్ ముస్తాక్, ఐ సి టి సి కౌన్సిలర్ రమేష్ పాల్గొన్నారు.

## అయ్యప్ప నామస్మరణతో మార్మోగిన ముడిమ్యాల

**విశ్వంభర, చేవెళ్ల :** సహకార సంఘం చైర్మన్ గోనె ప్రతాపరెడ్డి ఘనంగా అయ్యప్ప స్వామి పడిపూజ నిర్వహించారు. స్వాములకు అన్నప్రసాద వితరణ అయ్యప్ప నామస్మరణతో మార్మోగిన ముడిమ్యాల గ్రామం లోక కళ్యాణ కోసం అవతరించిన హరిహర పుత్రుడు అయ్యప్ప దీవెనలతో సమస్త జీవకోటికి మేలు జరగాలని సహకార సంఘం చైర్మన్ గోనె ప్రతాపరెడ్డి కోరుకున్నారు. శనివారం గ్రామంలో మాల ధారణ చేసిన అయ్యప్ప స్వాములకు అన్నప్రసాద వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి దైవభక్తితో పాటు దేశభక్తి ఆధ్యాత్మిక చింతన ఉండాలన్నారు. భక్తి మార్గం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంతో పాటు సకల సౌభాగ్యాలు కలుగుతాయి అన్నారు. అంతకుముందు కుటుంబ సమేతంగా ఆయన గురుస్వామి ఉమా శంకర్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా పడిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గోనె సరితా ప్రతాపరెడ్డి, వారి కుటుంబ సభ్యులు బంధువులు, నారాయణపురం మహేందర్ ముదిరాజ్, ముడి మ్యాల శ్రీనివాస్ రెడ్డి, కుమ్మిడి ఇంద్రారెడ్డి, ఆగి రెడ్డి, దేవర వెంకట్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# బాధితులకు సత్వర న్యాయం అందించడమే లక్ష్యం

**హోంమంత్రి అనిత**



**విశ్వంభర, అమరావతి:** బాధితులకు సత్వర న్యాయం అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు ఏపీ హోంమంత్రి అనిత తెలిపారు. అమరావతిలోని సచివాలయంలో న్యాయ శాఖ మంత్రి ఫరూక్‌తో కలిసి ఫాస్ట్ ట్రాక్, స్పెషల్ కోర్టులలో ఉన్న కేసులు, పనితీరు, పురోగతిపై సమీక్ష నిర్వహించారు. స్పెషల్ కోర్టులు, ఫాస్ట్ ట్రాక్ కోర్టులు, ఏసీబీ కోర్టులు, పోక్సో చట్టం, మహిళలకు సత్వర న్యాయమందించే న్యాయ వ్యవస్థలను మరింత పటిష్ఠం చేస్తామన్నారు. పోలీసు, జైళ్లు, న్యాయ వ్యవస్థల్లోని ఖాళీలను భర్తీ చేసే దిశగా చర్యలు చేపడతామన్నారు. గత ప్రభుత్వంలో కక్షలు, ఆక్రమణలపై ప్రశ్నించినందుకు కేసులు ఎదుర్కొన్న వారికి కూటమి ప్రభుత్వం భరోసా ఇస్తుందని తెలిపారు. మరోవైపు ఉత్తరాంధ్ర, ఇతర కోస్తాంధ్ర జిల్లాల్లో మోస్తరు నుంచి విస్తారంగా వర్షాలు కురిసే సూచనలు ఉండటంతో రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఎప్పటికప్పుడు హెచ్చరిక సందేశాల ద్వారా ప్రజలను అప్రమత్తం చేయాలని అధికారులను ఆదేశించారు.

# మార్చి నెల శ్రీవాణి, ఎస్ఈడీ కోటా టికెట్ల విడుదల తేదీల్లో మార్పు



**విశ్వంభర, తిరుమల:** జనవరి 10 నుంచి 19 వరకు వైకుంఠ ద్వార దర్శనాలకు సంబంధించి శ్రీవాణి టికెట్లను డిసెంబరు 23న ఉదయం 11 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేయనున్నట్లు తిరుమల తిరుపతి దేవస్థానం (తితిదే) ప్రకటించింది. ఈ పది రోజుల వైకుంఠ ద్వార దర్శనాలకు సంబంధించి ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్లను డిసెంబరు 24న ఉదయం 11 గంటలకు విడుదల చేయనున్నట్లు తెలిపింది. ఈ నేపథ్యంలో మార్చి నెలకు సంబంధించి శ్రీవాణి, ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్ల కోటా విడుదల తేదీలను మార్పు చేసినట్లు టీటీడీ పేర్కొంది. మార్చి నెల శ్రీవాణి టికెట్ల కోటాను డిసెంబరు 25న ఉదయం 11 గంటలకు, మార్చి నెల ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటాను డిసెంబరు 26న ఉదయం 11 గంటలకు విడుదల చేయనున్నట్లు వెల్లడించింది. అదే రోజు సాయంత్రం 3 గంటలకు తిరుమలలోని వసతి గదుల కోటాను సైతం విడుదల చేయనున్నట్లు ప్రకటనలో తితిదే పేర్కొంది. ఈ మార్పును భక్తులు గమనించాలని.. తితిదే వెబ్‌సైట్ https://ttdevasthanams.ap.gov.in లో మాత్రమే టికెట్లను బుక్ చేసుకోవాల్సిందిగా భక్తులకు సూచించింది.

# రుషికొండ ప్యాలెస్ కట్టారు గానీ.. రోడ్లు వేయలేకపోయారు: పవన్



**సాలూరు:** రాష్ట్ర ప్రజల కష్టాలు తీరాలని తిరుపతి కొండ ఎక్కినప్పుడు మొక్కుకున్నానని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు నియోజకవర్గం మక్కువ మండలం పనసభద్ర పంచాయతీ బాగుజోల గ్రామంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. అనంతరం నూతన రహదారి పనులకు శంకుస్థాపన చేశారు. కూటమి ప్రభుత్వం గిరిజన గ్రామాల్లో సుమారు రూ.36.71 కోట్ల వ్యయంతో, 39.32 కి.మీ. మేర నూతన రోడ్ల నిర్మాణం చేపడుతున్నట్లు.. తద్వారా 55 గిరిజన గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించనున్నట్లు తెలిపారు. 2017 పోరాట యాత్ర సమయంలో గిరిజన ప్రాంతాల్లో పర్యటించినప్పుడు కొన్ని సమస్యలు చూశానని పవన్ తెలిపారు. తాగునీరు, రహదారులు లేక గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రూ.500 కోట్లతో రుషికొండ ప్యాలెస్ కట్టారు గానీ.. ఇక్కడ రోడ్లు మాత్రం వేయలేకపోయారని వైకాపా(ysrcp) పాలనను విమర్శించారు.గిరిజన ప్రాంతాలు అభివృద్ధి చెందే విధంగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని పవన్ అన్నారు. కూటమి ప్రభుత్వం వద్ద డబ్బు లేకపోయినా గిరిజన ప్రాంతాల్లో రహదారులు నిర్మిస్తున్నట్లు చెప్పారు. సుందరమైన జలపాతాలు ఉన్న ఈ ప్రాంతాన్ని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసుకోవాలన్నారు.

# పోలీసుల విచారణకు హాజరైన వైసీపీ ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్

**విశ్వంభర, టెక్కలి:** శ్రీకాకుళం జిల్లా టెక్కలికి చెందిన వైసీపీ నేత, ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ శుక్రవారం పోలీసుల విచారణకు హాజరయ్యారు. వైసీపీ అధికారంలో ఉండగా తెదేపా అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కల్యాణ్, కార్యకర్తల మనోభావాలు దెబ్బతినేలా వ్యాఖ్యలు చేశారంటూ నవంబర్ 18న టెక్కలి జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి కణితి కిరణ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసిన పోలీసులు.. ఈనెల 13న దువ్వాడ శ్రీనివాస్‌కు 41ఏ నోటీసులు జారీ చేశారు. ఈ క్రమంలో దువ్వాడ పోలీసుల విచారణకు హాజరయ్యారు.

# అమరావతిని ఆర్థిక కేంద్రంగా మార్చేందుకు సహకరిస్తాం

## ప్రపంచ బ్యాంకు

**దిల్లీ:** ఏపీ రాజధాని అమరావతి నిర్మాణానికి రుణం ఇచ్చేందుకు ప్రపంచ బ్యాంకు ఆమోదం తెలిపింది. గురువారం జరిగిన ప్రపంచ బ్యాంకు బోర్డు సమావేశంలో అమరావతికి 800 మిలియన్ డాలర్ల రుణం ఇచ్చేందుకు ఆమోదం లభించింది. ఏపీ రాజధానికి ఇప్పటికే 788 మిలియన్ డాలర్ల రుణాన్ని ఏడీబీ మంజూరు చేసింది. అమరావతి నిర్మాణానికి నిధులు ఇస్తామని గతంలో కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో ప్రకటన చేసింది. ప్రపంచ బ్యాంకు, ఏడీబీల ద్వారా నిధులు సమకూరుస్తామని చెప్పింది. ఈ 2 సంస్థల ద్వారా 1588 మిలియన్ డాలర్ల నిధులు సమకూర్చుతామని పేర్కొంది. ఈ నేపథ్యంలో రుణం ఇచ్చేందుకు ప్రపంచ బ్యాంకు ఆమోదం తెలిపింది.

**అమరావతికి ప్రపంచ నైపుణ్యం తీసుకొస్తాం: ప్రపంచ బ్యాంకు**

అమరావతి సమగ్ర, స్థిర అభివృద్ధికి మద్దతిస్తున్నట్టు ఏడీబీ, ప్రపంచ బ్యాంకు ప్రకటించాయి. అమరావతి ఇంటిగ్రేటెడ్ అర్బన్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ ఆమోదించినట్టు ప్రపంచ బ్యాంకు ప్రకటన విడుదల చేసింది. ''దేశంలో 2050 నాటికి పట్టణ జనాభా 95 కోట్లకు చేరుతుంది. పట్టణీకరణకు అమరావతి అద్భుత నమూనా. అమరావతికి ప్రపంచ నైపుణ్యం తీసుకొస్తున్నాం. ప్రస్తుతం ఇక్కడ సుమారు లక్ష మంది నివసిస్తున్నారు. వచ్చే దశాబ్దంలోపు అమరావతిలో జనాభా అనేక రెట్లు పెరుగుతుంది. 2050 నాటికి 35 లక్షల మందికి వసతి కల్పించేలా ప్రణాళిక వేస్తున్నాం. 217 చ.కి.మీ విస్తీర్ణంలో ప్రభుత్వం మాస్టర్ ప్లాన్ సిద్ధం చేసింది. ప్రాజెక్టు భాగస్వాములతో విస్తృత ప్రయత్నాలు చేస్తాం. అమరావతిలో 22 శాతం సరసమైన గృహాల కోసం రిజర్వ్ చేశాం. వచ్చే ఐదేళ్లలో 50వేల ఉద్యోగాలు సృష్టించే అవకాశం ఉంది. కీలక మౌలిక సదుపాయాల నిర్మాణానికి అంతర్జాతీయ పరిజ్ఞానం అందిస్తాం. స్మార్ట్, గ్రీన్ టెక్నాలజీ, డిజైన్ విధానాలను తీసుకొస్తాం. విపత్తు నిర్వహణ సామర్థ్యం పెంపొందించడంలో సహాయపడతాం. అమరావతిని ఆర్థిక కేంద్రంగా మార్చేందుకు సహకరిస్తాం. కేంద్రం కోరినట్టు సుమారు రూ.6,800 కోట్ల రుణం ఇస్తాం. 6 ఏళ్ల గ్రేస్ పిరియడ్‌తో సహా 29 ఏళ్ల మెచ్యూరిటీతో రుణ సాయం. జపాన్ కరెన్సీలో రుణం పొందాలని ప్రభుత్వం నిర్ణయించింది'' అని ప్రపంచ బ్యాంకు ఓ ప్రకటనలో తెలిపింది.



# నన్ను పని చేసుకోనివ్వండి

**అభిమానులకు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ రిక్వెస్ట్**

**విశ్వంభర, పార్వతీపురం:** ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ శుక్రవారం విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలలో పర్యటించిన విషయం తెలిసిందే. రోడ్లు లేక ఇబ్బంది పడుతున్న గిరిజన ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. 9 గ్రామాల్లో సుమారు 50 కోట్లతో రహదారుల నిర్మాణానికి శుక్రవారం శంకుస్థాపన చేశారు. అయితే పవన్‌ని చూడడానికి అభిమానులు పెద్దఎత్తున్న తరలివచ్చారు. ఈ నేపథ్యంలో అభిమానులకు పవన్ రిక్వెస్ట్ చేశాడు.ఆయన మాట్లాడుతూ.. అభిమానులను నేను కోరేది ఒక్కటే. దయచేసి నన్ను నా పని చేసుకోనివ్వండి. నేను బయటికి వచ్చినప్పుడు మీరు నా మీద పడిపోతే నేను ఏ పని చేయలేను. రోడ్లు పరిస్థితి ఎలా ఉంది చూద్దాం అంటే అందరూ ఇక్కడే ఉండడంతో ఏం కనిపించట్లేదు. ఓజీ ఓజీ అని అరిస్తే పనులు జరగవు. నేను పనిచేస్తే మీ ఫ్యూచర్‌కి మంచి జరుగుతుంది. నేనున ఎక్కడికి వెళితే అక్కడ నన్ను చుట్టుముడితే నేను పనిచేయలేను. తెలుగు నేర్పించిన నేల ఇది. తిరుగుబాటు అంటే ఏంటో తెలిపిన నేల ఇది. ఇప్పుడు ఏంటంటే సినిమాల మోజులో పడి హీరోలకు జేజేలు కొట్టి మీ జీవితంలో బాధ్యతలు మర్చిపోతున్నారు. మాట్లాడితే అన్న మీసం తిప్పు అంటారు.. నేను మీసం తిప్పితే రోడ్లు పడవు.. పనులు జరగవు. అందుకే నన్ను పని చేయనివ్వండి అంటూ పవన్ కళ్యాణ్ చెప్పుకొచ్చారు.

# బీజేపీ ఎంపీల ప్రవర్తన ప్రజాస్వామ్యానికి మాయని మచ్చ

## వైఎస్ షర్మిల

**విశ్వంభర, అమరావతి:** కేంద్ర మంత్రి అమిత్ షా అంబేద్కర్‌పై చేసిన వివాదాస్పద వ్యాఖ్యల నుంచి దృష్టిని మళ్లించడానికి బీజేపీ కొత్త నాటకం ఆడుతుందని ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ట్విట్టర్ వేదిక ద్వారా ఆరోపించారు. అమిత్ షా రాజీనామా చేసి, క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ అగ్ర నాయకులు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే, ప్రియాంక గాంధీ పార్లమెంట్ లోపలికి వెళితే బీజేపీ ఎంపీలు అడ్డుకుని పక్కకు తోయడం వారి అహంకారానికి నిదర్శనమని అన్నారు. ఈ తోపులాటలో మల్లికార్జున ఖర్గే కిందపడిపోయారని తెలిపారు. బీజేపీ ఎంపీలు వారిలో వారే కొట్టుకుని రాహుల్ గాంధీపై నింద మోపుతున్నారని ఆరోపించారు. వారి ప్రవర్తన ప్రజాస్వామ్యానికి మాయని మచ్చగా నిలుస్తోందని విమర్శించారు.బీజేపీ, ఆర్ఎస్ఎస్ విధానాలు ఎప్పుడూ అంబేద్కర్‌కు వ్యతిరేకంగా ఉంటాయని, అంబేద్కర్ జ్ఞాపకాలను చెరిపివేయాలని కోరుకుంటున్నాయని ఆరోపించారు. అంబేద్కర్‌పై అమిత్ షా చేసిన వ్యాఖ్యల వీడియోను డిలీట్ చేయాలంటూ 'ఎక్స్'కు కేంద్రం నోటీసులు ఇవ్వడం చూస్తుంటే వారు తప్పు చేశారని అర్థమవుతోందని అన్నారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగం పరిరక్షణకు కాంగ్రెస్ పార్టీ కాషాయం మూకపై పోరాటం చేస్తూనే ఉంటుందని వెల్లడించారు.




# ఏపీ వైద్యారోగ్యశాఖలో ప్రగతి నివేదికను సీఎంకు అందజేసిన మంత్రి సత్యకుమార్

**విశ్వంభర, అమరావతి:** వైద్యారోగ్య శాఖలో ఆరు నెలల పాలనకు సంబంధించిన ప్రగతి నివేదికను మంత్రి సత్యకుమార్ యాదవ్ సీఎం చంద్రబాబుకు సమర్పించారు. వైద్యారోగ్యశాఖలో అమలు చేస్తున్న 12 అంశాలను నివేదికలో మంత్రి ప్రస్తావించారు. 'అందరికీ క్యాన్సర్ పరీక్షలు' కార్యక్రమంలో భాగంగా ఇప్పటి వరకు 33,58,347 మందికి స్క్రీనింగ్ టెస్టులు చేసినట్టు వెల్లడించారు. ఇందులో 29,469 మందికి క్యాన్సర్ ఉన్నట్టుగా అనుమానాలు ఉన్నాయని, తదుపరి పరీక్షలు, చికిత్స కోసం ప్రయత్నాలు చేస్తున్నట్టు పేర్కొన్నారు. ''విజయవాడ, విశాఖ, తిరుపతిలో సిటీ డయాగ్నోస్టిక్ సెంటర్ల ఏర్పాటుకు కార్యాచరణ ప్రారంభించాం. పట్టణ పేదల కోసం 87 రకాల వైద్య పరీక్షలు చేయనున్నాం. గిరిజన ప్రాంతాల్లోని రోగుల కోసం ఇ-ఐసీయు కార్యక్రమాన్ని చేపట్టాం. ఆస్టర్ రమేష్ ఆసుపత్రి భాగస్వామ్యంతో రంపచోడవరం, పార్వతీపురం ఆస్పత్రుల్లో 8 పడకలతో ఇ-ఐసీయూ నిర్వహిస్తున్నాం. 'గుండెకు భరోసా' కార్యక్రమంతో 22 ప్రధాన ఆస్పత్రులు, 234 కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ఏరియా ఆస్పత్రుల్లో టెనెక్టేప్లేస్ ఇంజక్షన్‌ను ఉచితంగా అందిస్తున్నాం. బహిరంగ మార్కెట్‌లో రూ.45 వేల విలువ చేసే ఈ ఇంజక్షన్‌తో ఇప్పటివరకూ 971 మంది హృద్రోగుల ప్రాణాలు కాపాడాం. రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు మెరుగైన సేవలందించేలా 30 అంశాలతో కార్యక్రమం చేపట్టాం'' అని మంత్రి వివరించారు. 25 జిల్లా, బోధనాసుపత్రుల్లో జన్ ఔషధి కేంద్రాలను మొదటి దశలో ఏర్పాటు చేసినట్టు నివేదికలో పేర్కొన్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ వైద్యకళాశాలల్లో బోధనా నాణ్యత పెంచేందుకు జాతీయస్థాయి ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్‌లోకి తీసుకువచ్చేలా నిర్దేశించినట్టు సత్యకుమార్ తెలిపారు.




# ధాన్యం సేకరణలో ఎక్కడా తప్పు జరగడానికి వీల్లేదు: సీఎం చంద్రబాబు

**విశ్వంభర, పెనమలూరు:** ధాన్యం సేకరణలో ఎక్కడా తప్పు జరగడానికి వీల్లేదని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. కృష్ణా జిల్లా పెనమలూరు నియోజకవర్గంలో ఆయన పర్యటించారు. గంగూరు, ఈడ్పుగల్లు గ్రామాలకు వెళ్లారు. గంగూరు రైతు సేవా కేంద్రం వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. తేమశాతం నిర్ధరణ చేసే మిషన్ పనితనంపై ఆరా తీశారు. సిబ్బంది, రైతులు, అధికారులతో మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. ఐవీఆర్ఎస్ ద్వారా రైతుల నుంచి తానే అభిప్రాయాలు సేకరిస్తానని చెప్పారు. అధికారుల నుంచి తనకు కావాల్సింది డాక్యుమెంటేషన్ కాదని పేర్కొన్నారు. రైతులకు సేవ చేసే విషయంలో ఇంప్రూవ్‌మెంట్ కనిపించాలని చెప్పారు. ఎక్కడ తప్పు జరిగినా కఠిన చర్యలు ఉంటాయని చెప్పారు. తేమ శాతం, ఇతరత్రా అంశాల్లో కచ్చితత్వం ఉండాలని ఆదేశించారు. రైతులకు ఐవీఆర్ఎస్‌పై స్వయంగా అవగాహన కల్పించారు.. దాని ద్వారా ఫీడ్‌బ్యాక్ పంపాలని సూచించారు.



# సెంటు భూమి కబ్జా చేసినా తాట తీస్తాం: సీఎం చంద్రబాబు



**ఈడ్పుగల్లు :** సెంటు భూమి కబ్జా చేసినా తాట తీస్తాం.. జాగ్రత్తగా ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు హెచ్చరించారు. కృష్ణా జిల్లా ఈడ్పుగల్లులో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో సీఎం మాట్లాడారు. ఇతరుల భూములు కబ్జా చేయకుండా కొత్త చట్టం తెచ్చామని, భూ కబ్జాలు, మోసాలు, బెదిరింపులు చేస్తే కఠిన శిక్షలు ఉంటాయని స్పష్టం చేశారు.''మీ తాత, తండ్రుల కష్టార్జితం మీకే దక్కాలి. కబ్జా చేయాలనుకున్న భూమి కనిపిస్తే చాలు.. జైలు గుర్తుకు రావాలి. తప్పుడు సర్వేలు జరిగాయని లక్షల మంది ఫిర్యాదు చేశారు. సర్వే వల్ల సెంటు, రెండు సెంట్ల భూమి పోయిందని ఫిర్యాదులు వస్తున్నాయి. భూమి గురించి వచ్చే ప్రతి ఫిర్యాదునూ పరిష్కరిస్తాం. భూమి కొలతల్లో తేడాలు, సర్వే నెంబర్లలో తేడాలు పరిష్కరిస్తాం. వారసుల పేర్లు సరిగా ఉండేలా చూస్తాం. అన్నీ సరిచేసి మీకు పట్టాదారు పాస్‌బుక్ ఇస్తాం. పట్టాదారు పాస్‌బుక్‌లో క్యూఆర్ కోడ్ ఇస్తాం. అన్ని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నాం. ఇప్పటి వరకు 95,200 పిటిషన్లు వచ్చాయి. జనవరి 9 వరకు రెవెన్యూ సదస్సులు జరుగుతాయి. సదస్సుల్లో ఇప్పటి వరకు 3లక్షల మంది పాల్గొన్నారు'' అని సీఎం తెలిపారు.

# ఏపీలో ప్రతిష్టాత్మక ఇన్నొవేషన్ యూనివర్సిటీ..

**మంత్రి లోకేశ్ సమక్షంలో ఒప్పందం**



**విశ్వంభర, అమరావతి:** అధునాతన సాంకేతిక ఆవిష్కరణల కేంద్రంగా ఆవిర్భవిస్తున్న ఆంధ్రప్రదేశ్‌లో డీప్-టెక్‌ను అభివృద్ధి చేయడంలో భాగంగా ఏపీ ప్రభుత్వం రెండు ప్రధాన సంస్థలతో కీలక ఒప్పందాలు చేసుకుంది. ఫిజిక్స్ వాలా ఎడ్యుటెక్ కంపెనీ తన పరిశ్రమ భాగస్వామి అమెజాన్ వెబ్‌తో కలిసి ఆంధ్రప్రదేశ్‌లో ఏఐ- ఫోకస్డ్ ఫస్ట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎమినెన్స్ .. యూనివర్సిటీ ఆఫ్ ఇన్నొవేషన్‌ను ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చింది. ఈ మేరకు ఏపీ ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం చేసుకుంది.రాష్ట్రంలో ఉన్నత విద్యను ఆధునికీకరించేందుకు టోనీ బ్లెయిర్ ఇనిస్టిట్యూట్ తో మరో ఒప్పందం చేసుకుంది. ఉండవల్లిలోని నివాసం రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ మంత్రి నారా లోకేశ్ సమక్షంలో ఫిజిక్స్ వాలా, టోనీ బ్లెయిర్ ఇనిస్టిట్యూట్ ప్రతినిధులు వేర్వేరుగా ఏపీ ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్నారు.

# వైసీపీకి విశాఖ డెయిరీ ఛైర్మన్, డైరెక్టర్లు రాజీనామా



**విశ్వంభర, విశాఖపట్నం:** వైసీపీకి విశాఖ డెయిరీ ఛైర్మన్ ఆడారి ఆనందకుమార్‌తో పాటు డైరెక్టర్లు రాజీనామా చేశారు. ఆనంద్ తన రాజీనామా లేఖను వైకాపా అధ్యక్షుడు జగన్‌కు పంపారు. గత కొన్ని రోజులుగా పార్టీ కార్యకలాపాలకు ఆయన దూరంగా ఉంటున్నారు. ఈ క్రమంలో వైకాపా ప్రాథమిక సభ్యత్వానికి, పదవులకు రాజీనామా చేశారు. పార్టీకి రాజీనామా చేసిన వారిలో విశాఖ డెయిరీ డైరెక్టర్లు శరగడం వరహా వెంకట శంకర్రావు, పిల్లా రమా కుమారి, శీరంరెడ్డి సూర్యనారాయణ, కోళ్ల కాటమయ్య, దాడి పవన్ కుమార్, ఆరంగి రమణబాబు, చిటికెల రాజకుమారి, రెడ్డి రామకృష్ణ, సుందరపు ఈశ్వర్, పరదేశి గంగాధర్ ఉన్నారు. వీరంతా వైకాపా కేంద్ర కార్యాలయానికి తమ రాజీనామా లేఖలను పంపించారు.

## అప్పట్లో ఎవరైనా ఇలా చెబితే నాకు హార్ట్ఎటాక్ వచ్చేదేమో: అశ్విన్

**ముంబయి:** రవిచంద్రన్ అశ్విన్ రెండ్రోజుల క్రితం అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన సంగతి తెలిసిందే. భారత్ ఎన్నో చిరస్మరణీయ విజయాలు సాధించడంలో కీలకపాత్ర పోషించిన అతడికి సెలబ్రెటీలు, క్రికెటర్లు, మాజీ ఆటగాళ్లు శుభాకాంక్షలు తెలుపుతున్నారు. అతడి భవిష్యత్తు బాగుండాలని సోషల్ మీడియా వేదికగా విష్ చేస్తున్నారు. దిగ్గజ క్రికెటర్లు సచిన్ తెందూల్కర్ , కపిల్ దేవ్ నేరుగా ఫోన్ చేసి అభినందనలు తెలియజేయడంతో అశ్విన్ సంతోషం వ్యక్తం చేశాడు. ఈ మేరకు తన ఫోన్‌లో కాల్ లిస్ట్‌కు సంబంధించిన స్క్రీన్‌షాట్‌ను ఎక్స్ (ట్విటర్) లో పంచుకున్నాడు.''భారత క్రికెటర్‌గా కెరీర్‌లో చివరి రోజున నా ఫోన్‌లో కాల్ లిస్ట్ ఇలా ఉంటుందని 25 ఏళ్ల క్రితం ఎవరైనా చెబితే అప్పుడు నాకు గుండెపోటు వచ్చి ఉండేదేమో. థాంక్స్ సచిన్ తెందూల్కర్, కపిల్‌దేవ్ పాజీ' అని రాసుకొచ్చాడు అశ్విన్.మరోవైపు.. అశ్విన్‌కు సరైన విధంగా వీడ్కోలు పలకకపోవడంపై కపిల్ దేవ్ అసంతృప్తి వ్యక్తం చేశాడు. భారత క్రికెట్ దిగ్గజాల్లో ఒకరైన అశ్విన్ ఇలా ఆటను వదలడం షాక్‌కు గురిచేసిందన్నాడు. టీమ్ఇండియా తరఫున 106 టెస్టులు ఆడి, భారత క్రికెట్‌కు అపారమైన కృషి చేసిన అతడికి బీసీసీఐ ఘనమైన వీడ్కోలు పలకాలని సూచించాడు. ఇక సచిన్‌తో అశ్విన్‌కు మంచి అనుబంధం ఉంది. టెస్టు కెరీర్ ఆరంభంలో తెందూల్కర్‌తో కలిసి మ్యాచ్‌లు ఆడాడు. భారత్ 2011 ప్రపంచ కప్ సాధించిన జట్టులోనూ అశ్విన్ భాగంగా ఉన్నాడు.

## మహిళల అండర్-19 ఆసియాకప్.. ఫైనల్‌కు భారత్




**కౌలాలంపూర్:** అండర్-19 మహిళల ఆసియా కప్ టీ20 టోర్నీలో భారత్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. శుక్రవారం శ్రీలంకతో జరిగిన సూపర్-4 మ్యాచ్‌లో యువ భారత్ 4 వికెట్ల తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన లంక 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 98 పరుగులు చేసింది. ఈ స్వల్ప లక్ష్యాన్ని భారత్ 14.5 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి ఛేదించింది. తెలుగమ్మాయి గొంగడి త్రిష (32; 24 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్స్‌లు), కమలిని (28; 26 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్), మిథిల (17*; 12 బంతుల్లో 4 ఫోర్లు) రాణించారు. ఈశ్వరి (0), సానికా చాల్కే (4) విఫలమవడంతో భారత్ 5 పరుగులకే రెండు వికెట్లు కోల్పోయింది. తర్వాత త్రిష, కమిలిని నిలకడగా ఆడి ఇన్నింగ్స్‌ను గాడిలో పెట్టారు. తర్వాత వీరిద్దరూ స్వల్పవ్యవధిలో ఔటయ్యారు. కెప్టెన్ నిక్కీ ప్రసాద్ (3) కూడా కాసేపటికే వెనుదిరిగింది. ఈ దశలో భవికా (7) అండతో మిథిల జట్టును విజయం దిశగా నడిపించింది. శ్రీలంక బ్యాటర్లలో కెప్టెన్ మనుడి నానయక్కర (33; 30 బంతుల్లో 1 ఫోర్, 2 సిక్స్‌లు), సుముడు నిసంసాల (21) మాత్రమే రెండంకెల స్కోర్ చేశారు. సజనా కవిండి (9), రష్మిక (8), హిరుణి హన్సిక (2), దహమి (5), లిమాన్స (1) సింగిల్ డిజిట్ స్కోరుకే పెవిలియన్ చేరారు. భారత బౌలర్లలో ఆయూషి శుక్లా (4/10) మరోసారి మెరిసింది. పరుణికా సిసోడియా 2, షబ్నమ్ షకీల్, దృతి కేసరి ఒక్కో వికెట్ పడగొట్టారు.

## అశ్విన్ తీవ్ర అసంతృప్తితోనే అంతర్జాతీయ కెరీర్‌కు గుడ్‌బై చెప్పేశాడు: బద్రీనాథ్



**ముంబయి:** అశ్విన్ తీవ్ర అసంతృప్తితోనే అంతర్జాతీయ కెరీర్‌కు గుడ్‌బై చెప్పేశాడని ఒకప్పటి అతడి సహచరుడు, సీఎస్కే మాజీ బ్యాటర్ సుబ్రహ్మణ్యం బద్రీనాథ్ ఆరోపించాడు. యాష్ హఠాత్తుగా ఈ నిర్ణయం తీసుకోవడంపై అతడు ఆశ్చర్యపోయాడు. జట్టు మేనేజ్‌మెంట్ నుంచి సరైన వీడ్కోలు లభించలేదని అభిప్రాయపడ్డాడు.''నేను అతడి నిర్ణయానికి షాకయ్యాను. నిజాయతీగా చెప్పాలంటే యాష్‌ను సరిగ్గా ట్రీట్ చేయలేదనే చెప్పాలి. పెర్త్ టెస్టు తర్వాత రిటైర్మెంట్ తీసుకోవాలని అతడు కోరుకున్నట్లు రోహిత్ శర్మ వెల్లడించాడు. వాషింగ్టన్ సుందర్ జట్టులో ఆడుతున్నాడని తెలియగానే అతడు ఆటను వదిలేయాలనుకొన్నాడు. అతడు సంతోషంగా లేడన్న అంశాన్ని ఆ విషయం చెబుతోంది. నిజంగా చెబుతున్నాను.. ఈ స్థాయికి చేరుకోవడం ఒక తమిళనాడు క్రికెటర్‌కు పెద్ద విషయం. అందుకు చాలా కారణాలున్నాయి. కొన్ని రాష్ట్రాల క్రీడాకారులకే మెరుగైన అవకాశాలొస్తాయి. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా అశ్విన్ ఎదురీది 500 వికెట్లు సాధించి లెజెండ్‌గా నిలిచాడు.అతడు ఎటువంటి పరిస్థితులను దాటుకుని వచ్చాడో ఊహించుకోండి. చాలా సందర్భాల్లో అతడిని పక్కకు తప్పించేందుకు ప్రయత్నించారు. కానీ, ప్రతిసారి ఫినిక్స్ పక్షిలా తిరిగి గాల్లోకి ఎగిరాడు'' అని ఓ క్రీడా ఛానల్ వద్ద బద్రీనాథ్ వ్యాఖ్యానించాడు. వాస్తవానికి రిటైర్మెంట్ నిర్ణయం ప్రకటించిన వెంటనే అశ్విన్ జట్టుతో సమయం కూడా గడపలేదు. వెంటనే బ్రిస్బేన్ నుంచి భారత్‌కు బయల్దేరి వచ్చేసిన విషయం తెలిసిందే.

**అతడు బీసీసీఐ లేదా ఐసీసీ పదవులు చేపట్టగలడు: పాక్ మాజీ క్రికెటర్**

క్రికెట్ జీనియస్‌గా పేరుగాంచిన అశ్విన్ భవిష్యత్తులో బీసీసీఐ లేదా ఐసీసీలో కీలక పదవులు చేపట్టేందుకు అర్హత ఉన్న వ్యక్తి అని పాక్ మాజీ ఆటగాడు రషీద్ లతీఫ్ పేర్కొన్నాడు. ''భారత్‌లో చాలా మంది క్రికెటర్లు ఉన్నా.. అశ్విన్ స్థాయి ప్రత్యేకమైంది. అతడిలో భిన్నమైన క్వాలిటీలున్నాయి. భవిష్యత్తులో అతడు బీసీసీఐ లేదా ఐసీసీలో కీలక పదవిలో ఉంటాడని నమ్ముతున్నాను. అతడి వినయం చూసి పెద్ద క్రికెటర్ అంటే నమ్మలేం. నావైపు, పాకిస్థాన్ నుంచి అతడికి బెస్ట్ విషెస్'' అని పేర్కొన్నాడు.



## అశ్విన్‌కు ఇలాంటి వీడ్కోలా?

**దిల్లీ:** అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన అశ్విన్ తగిన వీడ్కోలుకు అర్హుడని, ఇలాంటిది ఊహించలేదని దిగ్గజం కపిల్ దేవ్ అసంతృప్తి వ్యక్తం చేశాడు. ''భారత క్రికెట్ దిగ్గజాల్లో ఒకరు (అశ్విన్) ఇలా ఆటను వదలడం షాక్‌కు గురి చేసింది. అభిమానులకు నిరాశ కలిగింది. అయితే అశ్విన్ ముఖంలో ఆవేదన తాలూకు ఛాయ కనిపించింది. అతను సంతోషంగా లేడు. బాధతో ఉన్నాడు. అతను మెరుగైన, తగిన వీడ్కోలుకు అర్హుడు. అతను కొన్ని రోజులు వేచి ఉండి, భారత గడ్డపై రిటైర్మెంట్ ప్రకటించి ఉండొచ్చు. కానీ అశ్విన్ ఇప్పుడే ఎందుకు ప్రకటించాడో అర్థం కావడం లేదు. తన వైపు కథను వినాలని ఉంది. అతనికి గౌరవం ఇవ్వాలి. దేశం కోసం 106 టెస్టులాడాడు. భారత క్రికెట్‌కు అతను చేసిన అపారమైన కృషికి ఇంకెవరూ సరిపోరు. ఈ టీమ్ఇండియా మ్యాచ్ విన్నర్‌కు బీసీసీఐ ఘనమైన వీడ్కోలు పలకాలి'' అని కపిల్ తెలిపాడు. ప్రయోగాలకు అశ్విన్ ఎప్పుడూ సిద్ధంగా ఉండేవాడని కపిల్ అన్నాడు. ''అతనెప్పుడూ ప్రయోగాలకు సిద్ధంగా ఉండేవాడు. అదే అతణ్ని భిన్నంగా నిలబెట్టింది. బ్యాటర్లకు ఎక్కువ ప్రశంసలు దక్కే ఈ ఆటలో తన సత్తాతో అశ్విన్ దృఢంగా నిలబడ్డాడు. అతని దగ్గర క్యారమ్ బంతి ఉంది. అవసరమైనప్పుడు లెగ్‌స్పిన్నర్‌గానూ మారతాడు. ఒక ఛాంపియన్‌లో మాత్రమే అభద్రతాభావం ఉండదు. అశ్విన్ ఓ ఛాంపియన్. కెప్టెన్ నమ్మే బౌలర్ అతడు. నేనాడే సమయంలో అశ్విన్ ఉండి ఉంటే అతని కోసం జట్టులో చోటు కోల్పోయేవాణ్నేమో'' అని కపిల్ పేర్కొన్నాడు.

## ‘పృథ్వీ షా ఉన్నా లేనట్లే.. 10 మంది ఫీల్డర్లతో ఆడాం’



**ముంబయి:** పృథ్వీ షా ను విజయ్ హజారే ట్రోఫీ మ్యాచ్‌లకు ఎంపిక చేయకపోవడంపై ముంబయి క్రికెట్ అసోసియేషన్ స్పందించింది. అతని ఫిట్‌నెస్, క్రమశిక్షణ, ప్రవర్తన బాగా లేకపోవడమే ఇందుకు కారణమని ఎంసీఏ అధికారి ఒకరు తెలిపారు. ‘ముగిసిన సయ్యద్ ముస్తాక్ అలీట్రోఫీలో 10 మంది ఫీల్డర్లతో ఆడాం. పృథ్వీ షా మైదానంలో ఉన్నా లేనట్లే. బంతి అతని పక్కనుంచి వెళ్లినా దాన్ని పట్టుకోలేదు. బ్యాటింగ్ చేస్తున్నప్పుడు కూడా సరైన సమయంలో బంతిని హిట్ చేయడంలో ఇబ్బందిపడటం చూశాం. అతని ఫిట్‌నెస్, క్రమశిక్షణ, ప్రవర్తన కూడా బాగా లేవు. టీమ్‌లోని సీనియర్లు కూడా ఇప్పుడు అతని వైఖరిపై ఫిర్యాదు చేయడం ప్రారంభించారు. సోషల్ మీడియాలో ఇలాంటి పోస్టులు పెడితే అవి ముంబయి సెలక్టర్లు, ఎంసీఏపై ప్రభావం చూపిస్తాయని అనుకోవడం తప్పు. పృథ్వీ షా ఫిట్‌నెస్ విషయంలో జాగ్రత్తగా ఉండటం లేదు. పృథ్వీకి శత్రువులెవరూ లేరు. తనకి తానే శత్రువు’ అని ఎంసీఏ అధికారి పేర్కొన్నారు. విజయ్ హజారే ట్రోఫీ విషయంలో భంగపాటు ఎదురవడంతో పృథ్వీ షా ఇన్‌స్టా స్టోరీలో ఓ పోస్టు పెట్టాడు. ''చెప్పు దేవుడా.. నేనింకా ఏమేం చూడాలి? విజయ్ హజారే ట్రోఫీలో 65 ఇన్నింగ్స్‌లలో 55.7 సగటు, 126 స్ట్రైక్ రేటుతో 3,399 పరుగులు చేసినా టోర్నీ ఆడేందుకు అర్హుడిని కానా? అయినా నీపై నా నమ్మకాన్ని వీడను. ఇప్పటికీ ప్రజలు నాపై విశ్వాసంతో ఉన్నారని భావిస్తున్నా. కచ్చితంగా తిరిగొస్తా. ఓం సాయిరాం'' అని ఆ పోస్టులో పేర్కొన్నాడు. ఈ నేపథ్యంలోనే ఎంసీఏ వర్గాలు తాజాగా స్పందించాయి. ఇటీవల సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో ముంబయి ఛాంపియన్‌గా నిలిచింది. అయితే, పృథ్వీ షా అందులో పెద్దగా రాణించలేదు. 9 మ్యాచ్‌ల్లో 197 పరుగులు మాత్రమే చేశాడు. మధ్యప్రదేశ్‌తో జరిగిన ఫైనల్‌లో 10 పరుగులకే పెవిలియన్ చేరాడు. దీంతో విజయ్ హజారే ట్రోఫీకి అతడిని ఎంపిక చేయలేదు. ఫిట్‌నెస్, క్రమశిక్షణ కారణాలతో రంజీ ట్రోఫీ లీగ్ దశ మధ్యలోనే పృథ్వీని జట్టు నుంచి తొలగించిన విషయం తెలిసిందే. నవంబరులో జరిగిన ఐపీఎల్ వేలంలో పృథ్వీని ఏ ఫ్రాంఛైజీ కొనుగోలు చేయకపోవడంతో అన్‌సోల్డ్‌గా మిగిలాడు.

## త్వరలో బీసీసీఐకి కొత్త కార్యదర్శి.. ఎన్నికలకు రంగం సిద్ధం!




**ముంబయి:** త్వరలో బీసీసీఐకి కొత్త కార్యదర్శి రానున్నారు. బీసీసీఐ సర్వసభ్య సమావేశం వచ్చే ఏడాది జనవరి 12న ముంబయిలో నిర్వహించనున్నారు. అదే రోజు కార్యదర్శి, కోశాధికారి పదవుల భర్తీ కోసం ఎన్నికలు నిర్వహిస్తారు. ఎన్నికల అధికారిగా మాజీ చీఫ్ ఎలక్షన్ కమిషనర్ అచల్‌కుమార్ జ్యోతిని నియమించారు. ఈ మేరకు అపెక్స్ కౌన్సిల్‌లో నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్ర క్రికెట్ సంఘాలకు సమాచారం పంపారు. ఐసీసీ ఛైర్మన్‌గా జై షా .. మహారాష్ట్ర మంత్రిగా ఆశిష్ షెలార్ బాధ్యతలు స్వీకరించడంతో బోర్డు కార్యదర్శి, కోశాధికారి పదవులు ఖాళీ అయ్యాయి.బీసీసీఐ రాజ్యాంగం ప్రకారం.. రాజీనామా చేసిన కార్యవర్గ సభ్యుల స్థానంలో కొత్త వాళ్లను 45 రోజుల్లోపు ఎన్నుకోవాలి. ఎన్నికలకు నాలుగు వారాల ముందు ఎన్నికల అధికారిని నియమించాలి. ఈ మేరకు ఎన్నికలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. అయితే, కార్యదర్శితోపాటు కోశాధికారి ఎన్నిక ఏకగ్రీవం అయ్యే అవకాశాలున్నాయని సమాచారం. ప్రస్తుతం అస్సాంకు చెందిన దేవ్‌జిత్ సైకియా తాత్కాలిక కార్యదర్శిగా కొనసాగుతున్నారు. గుజరాత్ క్రికెట్ సంఘం కార్యదర్శి అనిల్ పటేల్‌తోపాటు దేవ్‌జిత్ సైకియా కార్యదర్శి పదవిపై ఆసక్తి చూపుతున్నట్లు సమాచారం. ఎన్నికల అధికారిగా నియమితులైన అచల్‌కుమార్ జ్యోతి 1975 బ్యాచ్ గుజరాత్ కేడర్ ఐఏఎస్ అధికారి (రిటైర్డ్). ఆయన జులై 2017 నుంచి జనవరి 2018 వరకు చీఫ్ ఎలక్షన్ కమిషనర్‌గా పనిచేశారు.

## భారత్‌తో చివరి రెండు టెస్టులకు ఆసీస్ జట్టు ప్రకటన.. కొత్త కుర్రాడికి చోటు

**ముంబయి:** బోర్డర్-గావస్కర్ ట్రోఫీ సిరీస్‌లో మిగిలిన రెండు టెస్టులకు 15 మంది ఆటగాళ్లతో ఆస్ట్రేలియా జట్టును ప్రకటించింది. ఓపెనర్ నాథన్ మెక్‌స్వీనీపై వేటు వేసిన ఆసీస్.. అతడి స్థానంలో 19 ఏళ్ల సామ్ కొన్‌స్టాస్‌ను జట్టులోకి తీసుకుంది. ఉస్మాన్ ఖవాజాతో కలిసి కొన్‌స్టాస్ ఓపెనింగ్ చేసే అవకాశముంది. అదేవిధంగా పేసర్ జే రిచర్డ్‌సన్‌ను మూడేళ్ల తర్వాత తిరిగి జట్టుకు ఎంపిక చేసింది ఆస్ట్రేలియా. రిచర్డ్‌సన్‌తోపాటు మరో పేసర్ సీన్ అబాట్ కూడా జట్టులో చోటు దక్కించుకున్నాడు.

**ఎవరీ సామ్ కొన్‌స్టాస్?**

టీనేజర్ అయిన సామ్ కొన్‌స్టాస్ టాపార్డర్‌లో బరిలోకి దిగి దూకుడుగా ఆడతాడు. ఇటీవల ప్రారంభమైన బిగ్ బాష్ లీగ్‌లో సిడ్నీ థండర్ తరఫున అరంగేట్రం చేశాడు. అడిలైడ్ స్ట్రైకర్స్‌తో జరిగిన తొలి మ్యాచ్‌లోనే 27 బంతుల్లో 56 పరుగులు చేశాడు. ఎనిమిది ఫోర్లు, 2 సిక్స్‌లు బాది జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు. షెఫీల్డ్ షీల్డ్ టోర్నీలో న్యూ సౌత్ వేల్స్ తరఫున రెండు సెంచరీలు చేశాడు. ఈ కుర్రాడు బోర్డర్ - గావస్కర్ సిరీస్ ఆరంభానికి ముందు ఆస్ట్రేలియా-ఎ, భారత్ ఎ జట్ల మధ్య జరిగిన జరిగిన రెండు అనధికారిక టెస్టుల్లోనూ ఆడాడు. నాలుగు ఇన్నింగ్స్‌ల్లో కలిపి 92 పరుగులు చేశాడు. రెండో టెస్టు సెకండ్ ఇన్నింగ్స్‌లో 128 బంతుల్లో 73 పరుగులు సాధించాడు. భారత్, ఆస్ట్రేలియా పీఎం ఎలెవన్ మ్యాచ్‌లోనూ ఆడాడు. ఓపెనర్‌గా వచ్చిన కొన్‌స్టాస్ (107; 97 బంతుల్లో 14 ఫోర్లు, 1 సిక్స్) శతకం బాదాడు. బోర్డర్-గావస్కర్ ట్రోఫీ సిరీస్‌లో ప్రస్తుతం ఇరుజట్లు 1-1 సమంగా ఉన్నాయి. పెర్త్‌లో జరిగిన తొలి టెస్టులో భారత్ గెలుపొందగా.. అడిలైడ్ జరిగిన రెండో మ్యాచ్‌లో ఆసీస్ విజయం సాధించింది. బ్రిస్బేన్‌లో జరిగిన మూడో టెస్టు డ్రాగా ముగిసింది. డిసెంబరు 26-30 మధ్య నాలుగో టెస్టు మెల్‌బోర్న్‌లో, జనవరి 3-7 మధ్య సిడ్నీలో ఐదో టెస్టు జరగనున్నాయి.

**భారత్‌తో చివరి రెండు టెస్టులు.. ఆసీస్ జట్టు ఇదే**

పాట్ కమిన్స్ (కెప్టెన్), ట్రావిస్ హెడ్, స్టీవ్ స్మిత్, సీన్ అబాట్, స్కాట్ బోలాండ్, అలెక్స్ కెరీ, జోష్ ఇంగ్లిస్, ఉస్మాన్ ఖవాజా,సామ్ కొన్‌స్టాస్, మార్నస్ లబుషేన్, నాథన్ లియోన్, మిచెల్ మార్ష్, రిచర్డ్‌సన్, మిచెల్ స్టార్క్, బ్యూ వెబ్‌స్టర్.





## వరుసగా ఐదోరోజూ నష్టాల్లో స్టాక్ మార్కెట్లు
## ఒక్క సెషన్‌లో ₹9 లక్షల కోట్లు ఉఫ్!

**ముంబయి:** దలాల్ స్ట్రీట్‌లో నష్టాల పరంపర కొనసాగుతోంది. వడ్డీ రేట్ల కోత విషయంలో ఫెడ్ వైఖరి కారణంగా నిన్న భారీ నష్టాలు చవిచూసిన మన మార్కెట్ సూచీలు.. శుక్రవారం కూడా అదే బాటలో పయనించాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలు, విదేశీ మదుపర్ల అమ్మకాలతో వరుసగా ఐదో రోజూ నష్టాలు చవిచూశాయి. ముఖ్యంగా రిలయన్స్, హెచ్‌డీఎఫ్‌సీ, యాక్సిస్ బ్యాంక్, టీసీఎస్, ఎల్అండ్ టీ షేర్లు సూచీలపై ఒత్తిడి పెంచాయి. ఈ వారంలో మొత్తంగా సెన్సెక్స్ దాదాపు 4 వేల పాయింట్ల మేర నష్టపోయింది. మదుపర్ల సంపదగా భావించే బీఎస్ఈలో నమోదిత కంపెనీల మొత్తం విలువ ఇవాళ ఒక్కరోజే దాదాపు రూ.9 లక్షల కోట్లు ఆవిరై.. రూ.441 లక్షల కోట్లకు చేరింది.

సెన్సెక్స్ ఉదయం 79,335.48 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 79,218.05) స్వల్ప లాభాల్లో ప్రారంభమై.. తర్వాత నష్టాల్లోకి జారుకుంది. ఇంట్రాడే 79,587.15 వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచీ.. తర్వాత భారీ నష్టాల్లోకి జారుకుని 77,874.59 వద్ద కనిష్ఠాన్ని తాకింది. చివరికి 1176.46 పాయింట్ల నష్టంతో 78,041.59 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 375.05 పాయింట్ల నష్టంతో 23,576.65 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ కాస్త రికవరీ అయ్యి 85.03 వద్ద ముగిసింది. సెన్సెక్స్ 30 సూచీలో నెస్లే ఇండియా, టైటాన్ షేర్లు మినహా మిగిలిన అన్ని షేర్లూ నష్టాల్లో ముగిశాయి. టెక్ మహీంద్రా, మహీంద్రా అండ్ మహీంద్రా, ఇండస్ ఇండ్ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, టాటా మోటార్స్ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 72 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 2621 డాలర్ల వద్ద ట్రేడవుతుంది.

**కారణాలు ఇవే..**

- వచ్చే ఏడాది వడ్డీ రేట్లలో మూణ్నాలుగు కోతలు ఉండొచ్చని మార్కెట్ అంచనా వేయగా.. రెండుసార్లు మాత్రమే రేట్ల కోత ఉంటుందని ఫెడ్ పేర్కొనడంతో వరుసగా రెండో రోజూ ప్రపంచ మార్కెట్లపై ప్రభావం పడింది.
- అమెరికాలో డాలర్ విలువ, బాండ్ల రాబడులు పెరగడంతో మన ఈక్విటీ మార్కెట్ల నుంచి విదేశీ మదుపర్ల అమ్మకాలు కొనసాగుతున్నాయి. గడిచిన 4 సెషన్లలోనే రూ.12వేల కోట్ల విలువైన షేర్లను విక్రయించడం గమనార్హం.
- ఐటీ స్టాక్స్ అమ్మకాల ఒత్తిడి ఎదుర్కొన్నాయి. నిఫ్టీ ఐటీ ఇండెక్స్ 2.6 శాతం మేర నష్టపోయింది.
- వాస్తవానికి వాల్‌స్ట్రీట్ అంచనాలను మించి యాక్సెంచర్ మెరుగైన త్రైమాసిక ఫలితాలు, భవిష్యత్ అంచనాలను వెలువరించడంతో ఈ ఉదయం లాభాల్లో కదలాడిన దేశీయ ఐటీ స్టాక్స్.. తర్వాత ఆరంభ లాభాలు కోల్పోయి నష్టాల్లోకి జారుకున్నాయి.




# బచ్చలమల్లితో అల్లరి నరేశ్ ఖాతాలో హిట్ పడినట్లే

## అల్లరి నరేశ్ నటన కోసమైనా చూడాలి ఈసినిమా

**చిత్రం:** బచ్చలమల్లి; **నటీనటులు:** అల్లరి నరేశ్, అమృత అయ్యర్, రోహిణి, రావు రమేష్, అచ్యుత్ కుమార్, బలగం జయరామ్, హరి తేజ, ప్రవీణ్, వైవా హర్ష తదితరులు; **స్క్రీన్ ప్లే:** విప్పర్తి మధు; **సంగీతం:** విశాల్ చంద్రశేఖర్; **సినిమాటోగ్రఫీ:** రిచర్డ్ ఎమ్.నాథన్; **ఎడిటింగ్:** ఛోటా కె ప్రసాద్; **ప్రొడక్షన్ డిజైన్:** బ్రహ్మ కడలి; **నిర్మాతలు:** రాజేష్ దండా, బాలాజీ గుత్తా; కథ, మాటలు, **దర్శకత్వం:** సుబ్బు మంగదేవి; **సంస్థ:** హాస్య మూవీస్; **విడుదల:** 20-12-2024

అల్లరి నరేశ్ అనగానే ఆయన చేసిన కామెడీ సినిమాలే గుర్తొస్తాయి. వాటి మధ్యలో ఆయన కంటెంట్ ప్రధానమైన కథల్నీ ఎంచుకుని చేశారు. వాటిలో సీరియస్‌గా సాగే పాత్రల్లో ఒదిగిపోతూ, తన నటనతో కట్టిపడేశారు. ఇప్పుడు మరోసారి ఆ తరహాలోనే 'బచ్చల మల్లి' అనే పేరున్న ఓ వ్యక్తి జీవితం ఆధారంగా, రా అండ్ రస్టిక్ యాక్షన్ కథతో తాజాగా ప్రేక్షకుల ముందుకు వచ్చారు. మరి ఈ మూవీ ఎలా ఉంది? నరేశ్‌కు విజయాన్ని అందించిందా?

**బచ్చలమల్లి కథ:** (కథేంటంటే): బచ్చలమల్లి (అల్లరి నరేశ్) చిన్నప్పటి నుంచీ బాగా చురుకైనవాడు. తండ్రి గర్వపడేలా పదో తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధిస్తాడు. తండ్రి అంటే ఎంతో మమకారం. కానీ, ఆయన తీసుకున్న ఓ నిర్ణయం మల్లి మనసుని గాయపరుస్తుంది. ప్రపంచం అంటే ఏమిటో తెలియని వయసులోనే తన మనసుకు తగిలిన ఆ గాయం చెడు అలవాట్లు, సావాసాలకి కారణం అవుతుంది. కాలేజీ చదువుకు కూడా స్వస్తి చెప్పి ట్రాక్టర్ నడుపుతుంటాడు. మద్యం తాగుతూ, నిత్యం ఊళ్లో ఏదో ఒక గొడవలో తలదూరుస్తూ మూర్ఖుడిలా మారతాడు. అప్పుడే అతని జీవితంలోకి కావేరి (అమృత అయ్యర్) వస్తుంది. ఆమెతో ప్రేమలో పడ్డాక మల్లి తీసుకున్న నిర్ణయాలేమిటి?మూర్ఖత్వం నుంచి బయటపడ్డాడా?లేదా?అసలు తండ్రితో ఉన్న సమస్యలేమిటి? కావేరితో ప్రేమకథ సుఖాంతమైందా? తదితర విషయాలు తెలియాలంటే సినిమా చూడాల్సిందే.

**ఎలా ఉందంటే:** వెనకా ముందూ ఆలోచించకుండా నిర్ణయాలు తీసుకునే ఓ మూర్ఖుడి కథ ఇది. చాలా మందిలో కనిపించే ఈ మూర్ఖత్వం ప్రేక్షకులకు కనెక్ట్ అయ్యే విషయమే. కానీ, ఆ మూర్ఖత్వం తాలూకు విపరీత ధోరణి, అనూహ్య పరిణామాలు ఈ కథపై పెద్దగా ప్రభావం చూపించలేదు. విలనిజం ఛాయలతో కనిపించే హీరో, రా అండ్ రస్టిక్ వాతావరణంతో కూడిన గ్రామీణ కథా చిత్రాలు ఈ మధ్య తరచూ వస్తున్నాయి. ఆ ట్రెండ్‌లో భాగంగా మనం కూడా ఓ ప్రయత్నం చేద్దాం అన్నట్టే ఉంది ఈ సినిమా. పాత్రల్ని, కథా నేపథ్యాన్ని ఆవిష్కరించడంలో కనిపించిన నిజాయతీ, కథ చెప్పిన విధానంలో కనిపించదు. బచ్చలమల్లి జీవితంలో జరిగిన మూడు సంఘటనల్ని తీసుకుని ఈ కథని మలిచామని చెప్పింది చిత్రబృందం. ఆ సంఘటనలు సినిమాలో చాలా సాధారణంగా, చాలా సినిమాల్లో చూసినట్టే అనిపిస్తాయి తప్ప ప్రత్యేకతేమీ లేదు.

నిజానికి మూర్ఖత్వంతో కూడిన హీరో క్యారెక్టరైజేషన్‌కి తోడు, గన్నీ సంచుల వ్యాపార నేపథ్యం, తండ్రి నిర్లక్ష్యానికి గురైన అన్న, అవమానంతో రగిలిపోయే తమ్ముడు... ఇలా ఓ మంచి కుటుంబ కథ కూడా ఇందులో ఉంది. కానీ, ఆ అంశాలపై తగినంత కసరత్తు చేయలేదు. హీరో పాత్రపై జాలి కలగదు, ప్రేమ పుట్టదు, కోపం రాదు. దాంతో సినిమా అంతా ఫ్లాట్‌గా సాగిపోతుంది. 2004తో కథని మొదలుపెట్టిన దర్శకుడు... 80, 90 దశకాల్లోకీ తీసుకెళతాడు. మూడు పార్శ్వాలుగా కథ సాగుతున్నా గందరగోళమేమీ ఉండదు కానీ, తర్వాత ఏం జరుగుతుందనే ఆత్రుతని మాత్రం రేకెత్తించదు. విరామ సన్నివేశాల్లో కనిపించే కొత్త పాత్ర,దాని నేపథ్యం మాత్రం ఓ మంచి మలుపు. ఆ పాత్ర ఎవరన్నది తేలాక మళ్లీ మామూలే. పతాక సన్నివేశాలు కాస్త హృద్యంగా సాగుతూ సినిమాపై ప్రభావం చూపిస్తాయి.

**ఎవరెలా చేశారంటే:** బచ్చల మల్లి పాత్రలోకి అల్లరి నరేశ్ పరకాయ ప్రవేశం చేసిన తీరు, ఆయన నటన సినిమాకి ప్రధానబలం. గాలి శీను తరహాలో గుర్తుండిపోయే పాత్రే. మూడు కోణాల్లో తెరపై కనిపిస్తూ, వైవిధ్యం ప్రదర్శించారు. డైలాగ్ డెలివరీ కూడా ప్రత్యేకంగా అనిపిస్తుంది. కావేరి పాత్రలో అమృత అయ్యర్ అమాయకంగా కనిపిస్తూ, మంచి నటనని ప్రదర్శించారు. రావు రమేశ్ పాత్ర సినిమాకి కీలకం. పెళ్లి చూపుల్లో భాగంగా వచ్చే సన్నివేశాల్లో అల్లరి నరేశ్‌కీ, రావు రమేశ్‌కీ మధ్య సన్నివేశాలు ఆకట్టుకుంటాయి. పతాక సన్నివేశాల్లోనూ ఆయన నటన ఆకట్టుకుంటుంది. కన్నడ నటుడు అచ్యుత్ కుమార్ సాధారణంగా కనిపిస్తూనే, బలంగా విలనిజం పండించారు. రోహిణి, బలగం జయరామ్, హరితేజ, ప్రవీణ్, వైవా హర్ష బలమైన పాత్రల్లో కనిపిస్తారు.

సాంకేతికంగా.. సినిమా ఉన్నతంగా ఉంది. విశాల్ చంద్రశేఖర్ స్వరపరిచిన పాటల్లో మా ఊరి జాతర్లో... సినిమాకి ప్రత్యేక ఆకర్షణ. నేపథ్య సంగీతం ఆకట్టుకుంది. రిచర్డ్ ఎమ్. నాథన్ కెమెరా పనితనం గ్రామీణ వాతావరణాన్ని పక్కాగా ఆవిష్కరించింది. ఎడిటింగ్, ఆర్ట్ విభాగాలూ మంచి పనితీరుని కనబరిచాయి. నిర్మాణం పరంగా లోటుపాట్లేమీ కనిపించవు. దర్శకుడు సుబ్బు కొన్ని సన్నివేశాలపైనా, కథా నేపథ్యాన్ని ఆవిష్కరించడంలోనూ తనదైన ముద్ర వేశారు.

బలాలు
+ అల్లరి నరేశ్ నటన
+ కథా నేపథ్యం
+ కొన్ని మలుపులు

బలహీనతలు
- రక్తి కట్టించని కథనం
- బలం లేని భావోద్వేగాలు

చివరిగా: బచ్చలమల్లి.. .

గమనిక: ఈ సమీక్ష సమీక్షకుడి దృష్టి కోణానికి సంబంధించింది. ఇది సమీక్షకుడి వ్యక్తిగత అభిప్రాయం మాత్రమే!

# ఉత్తమ నటిగా సాయిపల్లవి.. నటుడిగా విజయ్ సేతుపతి



తమిళ చిత్ర పరిశ్రమ ప్రత్యేకంగా భావించే చెన్నై ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ వేడుకగా జరిగింది. గురువారం సాయంత్రం జరిగిన ఈ కార్యక్రమంలో కోలీవుడ్ పరిశ్రమకు చెందిన ప్రముఖులు సందడి చేశారు. ఇందులోభాగంగా అమరన్ చిత్రానికి ఉత్తమ నటిగా సాయిపల్లవి , 'మహారాజ' చిత్రానికి ఉత్తమ నటుడిగా విజయ్ సేతుపతి అవార్డులు అందుకున్నారు. ఈ విజయంపై సాయిపల్లవి ఆనందం వ్యక్తంచేశారు.''22వ చెన్నై ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ఉత్తమ నటిగా అవార్డు అందుకున్నందుకు నాకెంతో సంతోషం, గర్వంగా ఉంది. ఎందుకంటే, ఈ ఏడాది ఎన్నో గొప్ప చిత్రాలు విడుదలయ్యాయి. ఎంతో పోటీ నెలకొంది. అలాంటి సమయంలో ఈ అవార్డుకు నన్ను ఎంపిక చేయడం ఆనందంగా ఉంది. నా అభిమానులకు ధన్యవాదాలు. వారు చూపించే ప్రేమ నన్నెంతో భావోద్వేగానికి గురి చేస్తుంటుంది. ముకుంద్ కుటుంబసభ్యులు, ఆయన భార్య వల్లే ఇది సాధ్యమైంది. ఈ కథను ప్రపంచానికి చెప్పడానికి వాళ్లు అంగీకరించడం వల్లనే దీనిని రూపొందించగలిగాం. దేశం కోసం నిరంతరం శ్రమిస్తోన్న ఒక జవాను కథ ఇది. రాజ్‌కుమార్ పెరియాసామి వంటి దర్శకులే ఇలాంటి మరెన్నో కథలు మనకు అందించగలరు'' అని సాయిపల్లవి తెలిపారు. తాను అవార్డు అందుకోవడంపై విజయ్ సేతుపతి ఆనందం వ్యక్తంచేశారు. 'మహారాజ'ను ఆదరించిన ప్రేక్షకులకు ధన్యవాదాలు చెప్పారు.

**విజేతలు వీరే:**

**ఉత్తమ చిత్రం:** అమరన్, **రెండో ఉత్తమ చిత్రం:** లబ్బర్ పందు, **ఉత్తమ నటుడు :** విజయ్ సేతుపతి (మహారాజ), **ఉత్తమ నటి:** సాయిపల్లవి (అమరన్), **ఉత్తమ సినిమాటోగ్రాఫర్:** సీహెచ్ సాయి (అమరన్), **ఉత్తమ ఎడిటర్:** ఫిలోమిన్ రాజ్ (అమరన్), **ఉత్తమ బాలనటుడు:** పొన్వెల్ (వాళై), **ఉత్తమ సహాయనటుడు:** దినేశ్ (లబ్బర్ పందు), **ఉత్తమ సహాయనటి:** దుషారా విజయన్ (వేట్టయన్), **ఉత్తమ రచయిత:** నిథిలన్ సామినాథన్ (మహారాజ), **ఉత్తమ సంగీత దర్శకుడు:** జీవీ ప్రకాశ్ (అమరన్), **స్పెషల్ జ్యూరీ అవార్డు :** మారి సెల్వరాజ్ (వాళై), పా.రంజిత్ (తంగలాన్)

# ఇది నాకెప్పటికీ గుర్తుండిపోయే మూవీ

- చిరుతో కలిసి నటించడంపై మోహన్‌బాబు పోస్ట్




**హైదరాబాద్:** తన నట ప్రయాణంలో ఇటీవల 50వ వసంతంలోకి అడుగు పెట్టారు నటుడు మోహన్‌బాబు . ఇప్పటివరకూ తాను నటించిన చిత్రాల్లో తనకు బాగా చేరువైన పలు సినిమాలను ఉద్దేశించి గత కొన్ని రోజులుగా ఆయన ఎక్స్ వేదికగా పోస్టులు పెడుతున్నారు. ఆయా చిత్రాలతో తన అనుబంధాన్ని నెమరు వేసుకుంటున్నారు. తాజాగా తనకు ఎప్పటికీ గుర్తుండిపోయే ఒక ప్రత్యేక మూవీ గురించి ఆయన మాట్లాడారు.చిరంజీవి, మోహన్‌బాబు ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రాల్లో 'పట్నం వచ్చిన పతివ్రతలు' ఒకటి. మౌళి దర్శకత్వం వహించిన ఈ సినిమాలో వీరిద్దరూ అన్నదమ్ములుగా నటించారు. రాధిక, గీత కథానాయికలు. 1982లో విడుదలైన ఈ సినిమా గురించి తాజాగా మోహన్‌బాబు సోషల్‌మీడియాలో పోస్ట్ పెట్టారు. ఈ చిత్రాన్ని తాను ఎప్పటికీ మర్చిపోనని అన్నారు. ''నా సినీ ప్రయాణంలో 'పట్నం వచ్చిన పతివ్రతలు'కు ప్రత్యేక స్థానం ఉంది. ప్రతిభావంతుడైన మౌళి దీనికి దర్శకత్వం వహించారు. ఈ పాత్రను పోషించడం.. ముఖ్యంగా నా స్నేహితుడు చిరంజీవితో స్క్రీన్ షేర్ చేసుకోవడం, ఆయనకు సోదరుడిగా యాక్ట్ చేయడం ఎంతో ప్రత్యేకంగా అనిపించింది. నేను ఎప్పటికీ మర్చిపోలేని చిత్రాల్లో ఇదీ ఒకటి'' అని ఆయన అన్నారు. ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమా తెరకెక్కింది. చిన్నప్పుడే తల్లిదండ్రులను కోల్పోయిన మనవళ్లను పెంచి పెద్ద చేస్తుంది నారాయణమ్మ. చదువుకోని పెద్ద మనవడు (మోహన్‌బాబు)కు బాగా చదువుకున్న దేవి (గీత)ని, బాగా చదువుకున్న చిన్న మనవడు (చిరంజీవి)కి పల్లెటూరు అమ్మాయి లలితాంబ (రాధిక)ను ఇచ్చి వివాహం జరిపిస్తుంది. పల్లెటూరి జీవితం నచ్చక భార్యలిద్దరూ పట్నానికి వెళ్లిపోదామని భర్తలను ఇబ్బంది పెడతారు. అందుకు వారు అంగీకరించరు. దీంతో ఇంట్లో చెప్పకుండా వెళ్లిపోయిన దేవి, లలితకు ఎలాంటి సమస్యలు వచ్చాయి? వాటి నుంచి ఎలా బయటపడ్డారు? అనేది సినిమా. దాదాపు 280 రోజుల పాటు థియేటర్లలో ఇది ఆడింది. ఇక, చిరంజీవి - మోహన్‌బాబు కలిసి వర్క్ చేసిన చిత్రాల్లో 'కొదమ సింహం', 'చక్రవర్తి', 'కిరాయి రౌడీలు', 'శ్రీరామ బంటు', 'లంకేశ్వరుడు', 'కొండవీటి దొంగ' విశేష ఆదరణ సొంతం చేసుకున్నాయి.

# పవన్‌కల్యాణ్.. అద్భుతమైన వ్యక్తి: శ్రియారెడ్డి



'సలార్'తో గతేడాది ప్రేక్షకులను అలరించారు నటి శ్రియా రెడ్డి . ప్రస్తుతం ఆమె పవన్‌కల్యాణ్ హీరోగా నటిస్తోన్న 'ఓజీ' కోసం వర్క్ చేస్తున్నారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న శ్రియా రెడ్డి.. తాను నటిస్తోన్న సినిమాల గురించి మాట్లాడారు. ముఖ్యంగా పవన్‌కల్యాణ్ 'ఓజీ' గురించి ఆసక్తికర కామెంట్స్ చేశారు.

''గడిచిన ఈ ఏడాది కాలం నాకు ఎంతో ప్రత్యేకం. గతేడాది చివర్లో విడుదలైన 'సలార్ - సీజ్‌ఫైర్'లో నా పాత్ర ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. అందులో నేను ఖాన్సార్ సామ్రాజ్యంలో ఆధిపత్యం వహించేవిధంగా కీలక పాత్ర పోషించా. ఈ ఏడాది విడుదలైన 'తలైమై సేయలగం'లో రాజకీయ నాయకురాలి రోల్ చేశా. తెలుగు చిత్ర పరిశ్రమలో రానున్న బిగ్గెస్ట్ మూవీల్లో ఒకటైన 'ఓజీ'లో వర్క్ చేశా. ఈ ఏడాదికాలంలో నన్ను నేను పునర్నిర్మించుకున్నా. ప్రస్తుతానికి నా చేతిలో కేవలం 'ఓజీ' మాత్రమే ఉంది. కొన్ని చిత్రాలు ఇంకా చర్చల దశలో ఉన్నాయి. ఇందులో నా పాత్ర చాలా ప్రత్యేకంగా ఉంటుంది. 'సలార్'లోని రాధారమ పాత్రకు, ఈ సినిమాలోని పాత్రకు ఎలాంటి సంబంధం ఉండదు. రెండు పాత్రల మధ్య ఎంతో వ్యత్యాసం ఉంటుంది. స్క్రీన్‌పై నన్ను చూసి ప్రేక్షకులు తప్పకుండా ఆశ్చర్యపోతారు'' అని తెలిపారు.అనంతరం ఆమె పవన్‌కల్యాణ్‌తో వర్క్ చేయడంపై మాట్లాడుతూ.. '' పవన్‌కల్యాణ్ కాంబినేషన్‌లో ఇప్పటికే కొన్ని సన్నివేశాలు చేశా. ఆయన చాలా తెలివైన, మర్యాద గల వ్యక్తి. ఎంతో హుందాగా ఉంటారు. ఆయనొక అద్భుతమైన వ్యక్తి. ఎదుటి వ్యక్తులతో ఆయన ప్రవర్తన, మాట్లాడే విధానం చూడచక్కగా ఉంటుంది'' అని ఆమె చెప్పారు. పవన్‌కల్యాణ్ హీరోగా సుజిత్ తెరకెక్కిస్తోన్న చిత్రమే 'ఓజీ'. డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై దానయ్య దీనిని నిర్మిస్తున్నారు. ప్రియాంకమోహన్ కథానాయిక. ఇమ్రాన్ హష్మీ కీలకపాత్ర పోషించారు. ప్రస్తుతం ఇది చిత్రీకరణ దశలో ఉంది. 2006లో విడుదలైన 'పొగరు'తో శ్రియారెడ్డి తెలుగు వారికి చేరువయ్యారు. ఇందులో ఆమె నెగిటివ్ షేడ్స్ ఉన్న పాత్రలో నటించారు.

# ఫిబ్రవరిలో ప్రేక్షకుల ముందు జానకి వెర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ



సూపర్ స్టార్ సురేష్ గోపి అనుపమ పరమేశ్వరన్ ముఖ్య పాత్రల్లో కాస్మోస్ ఎంటర్టైన్మెంట్స్ పై జె. ఫణీంద్ర కుమార్ నిర్మాతగా ప్రవీణ్ నారాయణ దర్శకత్వంలో వస్తున్న యదార్థ సంఘటనల ఆధారంగా వాస్తవిక దృక్పథ కోణంలో తీసిన సినిమా జానకి వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ (జె. ఎస్. కె). బైజు సందోష్, మాధవ్ సురేష్ గోపి, దివ్య పిళ్లయి, అస్కర్ అలీ ఇతర ముఖ్య పాత్రలు పోషించారు. ఇంటెన్స్ కోర్టు డ్రామాగా ఈ చిత్రాన్ని నిర్మించారు.అనుపమ పరమేశ్వరన్ సినిమాలో జానకి పాత్రలో నటిస్తోంది. యదార్థ సంఘటన ఆధారంగా నిర్మిస్తున్న ఈ చిత్రంలో జానకి పై జరిగిన అన్యాయాన్ని కోర్టులో ఎలా ఎదుర్కొంది అన్న అంశాన్ని ఇంటెన్స్ డ్రామాగా నిర్మించారు. ఈ కేసును వాదించే లాయర్ పాత్రలో సూపర్ స్టార్ సురేష్ గోపి నటించారు. ఈ సినిమాని ఫిబ్రవరిలో విడుదల చేస్తామని మూవీ మేకర్స్ తెలిపారు.

నటీనటులు : సురేష్ గోపి, అనుపమ పరమేశ్వరన్
రచన & దర్శకత్వం: ప్రవీణ్ నారాయణన్
నిర్మాత: జె. ఫణీంద్ర కుమార్
బ్యానర్: కాస్మోస్ ఎంటర్టైన్మెంట్
సహ నిర్మాతలు: సేతురామన్, హుమాయున్ అలీ అహమ్మద్
DOP: రెనదివ్ ఎడిటర్: సంజిత్ మహమ్మద్
సంగీతం : గిరీష్ నారాయణన్ , జిబ్రాన్
పి ఆర్ ఓ : మధు వీఆర్

Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com